thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 310 కరీంనగర్ బుధవారం, 16 జనవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ప్రయాగ్‌రాజ్‌లో.. 5.5కోట్ల మంది పుణ్యస్నానాలు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో సంగం నది ఒడ్డున నిర్వహించబడుతున్న మహా కుంభమేళాలో ఈరోజు మూడవ రోజు. జనవరి 13 నుండి ప్రారంభమైన మహా కుంభమేళాలో ప్రతిరోజూ కోట్లాది మంది త్రివేణి సంగమంలో స్నానాలు చేస్తున్నారు. మకర సంక్రాంతి సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుంచే వివిధ అఖాడాల నుంచి సాధువులు వేలాదిగా తరలివచ్చారు. తొలి రోజున 1.75 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేయగా.. సంక్రాంతి ఒక్కరోజునే మొత్తం 3.5 కోట్ల మంది భక్తులు అమృత స్నానాలు చేశారు. రెండు రోజుల్లోనే 5.5 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.




డిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి సంబంధించిన కొత్త భవనాన్ని సోనియా గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దిగ్గజ నాయకులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, %ూజజ% చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యాలయానికి 'ఇందిరాగాంధీ భవన్' అని పేరు పెట్టారు. ఇది కాంగ్రెస్ పార్టీకి గౌరవంగా కనిపిస్తుంది. ఇందిరాగాంధీ భవన్ 1978 నుంచి అక్బర్ రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయానికి భిన్నంగా, 9%ూా% కోట్లా రోడ్డులో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు. ఈ భవనంలో ఆరు అంతస్తులు ఉండి, రాజకీయ కార్యకలాపాలకు అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. దీనివల్ల పార్టీ కార్యాచరణకు మరింత సమర్థత మరియు సౌలభ్యం లభించనుంది. ఇది కాంగ్రెస్ పార్టీకి ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఎందుకంటే ఇది కాంగ్రెస్ అఖిల భారత కార్యాలయానికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. కొత్త కార్యాలయం ప్రారంభం, కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా మరింత శక్తివంతమైన నాయకత్వాన్ని అందిస్తుంది. ఈ కార్యాలయాన్ని ప్రారంభించడం.. కాంగ్రెస్ పార్టీకి తిరిగి పుంజుకోవడం కోసం కీలకమైన దశగా భావిస్తున్నారు. ఇక్కడి నుండి జాతీయ, రాష్ట్ర స్థాయి వ్యూహాలను అభివృద్ధి చేయడం, ప్రణాళికలు అమలు చేయడం కొనసాగుతుంది. ఈ కొత్త కార్యాలయం ప్రారంభం, పార్టీ నాయకత్వానికి కొత్త ఆలోచనలకు, దృష్టికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఇందిరాగాంధీ భవన్ పేరుతో ఈ కొత్త భవనం కాంగ్రెస్ పార్టీ యొక్క సంప్రదాయాలను, ఆధునికతను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఇచ్చే మార్గంగా ఉంది.

| DATE | DEP/ ARR | TIME | DEP/ARR PLACE |
|---|---|---|---|
| 16.01.2025 | DEP. | 21.50 | DELHI IGI AIRPORT |
| 17.01.2025 | ARR. | 06.00 | SINGAPORE (CHANGI) |
| 20.01.2025 | DEP. | 00.05 | SINGAPORE (CHANGI) |
| 20.01.2025 | ARR. | 06.10 | ZURICH AIRPORT |
| 23.01.2025 | DEP. | 14.35 | ZURICH |
| 23.01.2025 | ARR. | 23.45 | [illegible]BAI |
| 24.01.2025 | DEP. | 03.30 | DUBAI |
| 24.01.2025 | ARR. | 08.25 | HYDERABAD |




## నేడు దావోస్ పర్యటనకు సీఎం రేవంత్..!

హైదరాబాద్: ఈ నెల 16న అంటే రేపు దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లనున్నారట. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. పీఆర్ టీమ్ కు కీలక ఆదేశాలు ఇచ్చింది కాంగ్రెస్. ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలని%ొ%సోషల్ మీడియాలో అప్డేట్స్ ఇవ్వాలని ఆర్డర్స్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ప్రస్తుతం ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి ఉన్న విషయం తెలిసిందే. ఇవాళ కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభం కానుంది. కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంది. కొత్త భవనంతో పాటు, త్వరలో సరికొత్త రూపును సంతరించుకోనుంది కాంగ్రెస్ పార్టీ. ఈ కార్యక్రమంలో కోసం నిన్ననే ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కాంగ్రెస్ పెద్దలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కార్యవర్గం కూర్పు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపై వారితో చర్చించనున్నారు. అలాగే పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి వారితో మాట్లాడనున్నారు. కేంద్రమంత్రులను కలిసే సమయంలో సీఎం వెంట ఆయా శాఖల రాష్ట్ర మంత్రులు ఉంటారు. అనంతరం గురువారం రాత్రి ఢిల్లీ నుంచి సింగపూర్ పర్యటనకు రేవంత్ రెడ్డి వెళతారు. సింగపూర్‌కు చేరుకున్న తర్వాత రేవంత్ బృందం శుక్రవారం అక్కడ జరిగే బిజినెస్ మీట్‌లో పాల్గొంటారు.

పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అవుతారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే స్పోర్ట్స్ యూనివర్శిటీకి సంబంధించి సింగపూర్‌లో ఉన్న స్పోర్ట్స్ యూనివర్శిటీని సందర్శిస్తారు. ఆ యూనివర్శిటీకి సంబంధించి పలు విషయాలను తెలుసుకోనున్నారు. అలాగే షాపింగ్ మాల్స్, స్టేడియాల నిర్మాణాలను పరిశీలించే అవకాశం ఉంది. జనవరి 19న సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు సీఎం రేవంత్ రెడ్డి వెళతారు. 20, 21, 22 తేదీల్లో అక్కడ నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణకు పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చే ప్రయత్నం చేయనున్నారు.

హైదరాబాద్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. యాదాద్రి జిల్లా పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకుంటున్నాయి. పంతంగి టోల్‌ప్లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ నుంచి తెలంగాణ వైపు వాహనాలను అనుమతిస్తున్నారు. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఏపీ వ్యాప్తంగా ప్రయాణ ప్రాంగణాల్లోనూ రద్దీ పెరుగుతోంది. సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగుపయనమవడంతో విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు 116 అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని.. సాధారణ ఛార్జీలే వసూల చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది.




## నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక.. కలెక్టర్లకు సీఎస్ కీలక సూచనలు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న నాలుగు కొత్త పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపికపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా కోసం భూముల వివరాలను రెవెన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపించినట్లు సీఎస్ తెలిపారు.

"క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగుయోగ్యం కాని భూములను గుర్తించాలి. వాటి వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలి. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కోసం కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు వెళ్లిన భూమి లేని రైతు కూలీల కుటుంబాలను గుర్తించి.. ఆ జాబితాను గ్రామ సభల్లో ప్రకటించాలి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో వివరించి ఆమోదం పొందాలి. అభ్యంతరాలుంటే స్వీకరించాలి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున.. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి" అని కలెక్టర్లకు సూచనలు చేశారు.




## భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో

# మార్మోగుతోన్న ప్రయాగ్‌రాజ్..

## కుంభమేళాలో సరికొత్త రికార్డ్!

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మూడో రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు మూడో రోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే మంగళవారం(జనవరి 14)నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది. అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు. మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది. మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మఠాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు. శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు. 35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు.

ఇది కాకుండా, జునా అఘోరా, ఆవాహన్ అఘోరా, పంచాగ్ని అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు కూడా అమృత్‌లో స్నానం చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి నేతృత్వంలోని కిన్నార్ అఘోరా సభ్యులు కూడా జునా అఘోరాతో పాటు పవిత్ర స్నానమాచరించారు.

పెద్ద రథంలో ఘాట్ వద్దకు చేరుకున్న నాగ సాధువుల బృందం అనుసరించింది.నాగ సాధువులు ఈటెలు, త్రిశూలాలను ధరించి, వారి శరీరాలపై బూడిద పూసుకుని, కొన్ని గుర్రాలతో ఊరేగింపుగా రాజ స్నానానికి బయలుదేరారు. జుట్టులో పువ్వులు, మెడలో దండ, చేతిలో త్రిశూలంతో మహాకుంభానికి ఆధ్యాత్మిక వైభవాన్ని జోడించింది.




## సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు.. పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా–ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. %ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపింది. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరఫు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

**కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు..!** ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.




## 'బ్లాక్‌బోట్స్' అణు రహస్యాలను లీక్ చేసిన ఫిట్‌నెస్ యాప్..!

హిరోషిమా, నాగసాకిపై వేసిన బాంబుల కంటే 1,000 రెట్లు శక్తిమంతమైన అణ్వాయుధాల డేటా లీకైంది. సాధారణంగా రక్షణ దళాల్లో అణుజలాంతర్గాముల కదలికలు అత్యంత రహస్యంగా ఉంటాయి. ఓ రకంగా చెప్పాలంటే అందులోని సిబ్బందికే చివరి నిమిషం వరకు ఎక్కడికి వెళుతున్నారో తెలియని పరిస్థితి కూడా ఉంటుంది. కానీ, ఏకంగా అణు జలాంతర్గాముల బేస్ వివరాలే లీకయ్యాయి. ఒక్కో దానిలో 16 అణు క్షిపణులు ఉన్న నాలుగు సబ్‌మెరైన్లు అక్కడ ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి ఓ ఫిట్‌నెస్ ట్రాకింగ్ యాప్ కారణంగా నిలిచింది. ఫ్రాన్స్‌కు చెందిన ఓ అణుజలాంతర్గామి సిబ్బంది, అధికారుల డేటా సహా.. లొకేషన్ వివరాలు పొరపాటున లీకయ్యాయి. వాస్తవానికి ఆ సబ్‌మెరైన్ రష్యా సమీపంలో గస్తీకి వెళ్లాల్సిఉంది. ఈ వివరాలు మాస్కో చేతికి చేరితే.. ఆ జలాంతర్గామి పరిస్థితేంటని ఫ్రాన్స్ బెంబేలెత్తిపోతోంది. మొబైల్, స్మార్ట్‌వాచ్‌ల్లో వినియోగించే స్ట్రావా యాప్ ఈ మొత్తం తతంగానికి మూలకారణంగా నిలిచింది. అది వినియోగదారుల ఫిట్‌నెస్ కార్యకలాపాలను ట్రాక్ చేసి పర్యవేక్షిస్తుంది. దీనిలో వారు ఎక్కడున్నారు అనే అంశాన్ని అత్యంత కచ్చితత్వంతో గుర్తిస్తుంది. తాజాగా అది బ్రెస్ట్‌హార్బర్‌లో లాంగ్ ఐలాండ్ అనే ఫ్రాన్స్ సబ్‌మెరైన్ బేస్‌ను గుర్తించింది. ఇక్కడ ఉన్న నాలుగు జలాంతర్గాములు కలిపి మొత్తం 64 అణుక్షిపణులను ప్రయోగించగలవు. వీటిని బ్లాక్‌బోట్స్ అంటారు. 1972 నుంచి ఇక్కడ ఉన్న జలాంతర్గాముల్లో ఒకటి ఎప్పుడూ గస్తీలో ఉంటుంది. ఆ సమయంలో దేశంపై అణు దాడి జరిగితే తక్షణం అధ్యక్షుడి ఆదేశాల మేరకు స్పందించేలోపే ఓ రహస్య ప్రదేశంలో కాచుకొని ఉంటుంది. లాంగ్ ఐలాండ్ బేస్‌లో మొత్తం 2,000మంది మిలటరీ సిబ్బంది పని చేస్తున్నారు. ఫ్రాన్స్‌లో ఇదే టాప్ సీక్రెట్ మిలటరీ జోన్. ఇక్కడ కనీసం స్మార్ట్ ఫోన్లను కూడా వాడనీయరు. ఒకవేళ తీసుకెళ్లినా వాటిని స్విచ్ఛాఫ్ చేసి సిగ్నల్ ప్రూఫ్ లాకర్లలో పెట్టేస్తారు. కానీ, కొందరు సిబ్బంది మాత్రం ఫిజికల్ యాక్టివిటీని చెక్ చేసుకోవడానికి థర్డ్‌పార్టీ యాప్స్ వినియోగించే స్మార్ట్ వాచ్‌లను వాడటం మొదలుపెట్టారు. ఇది సేకరించిన డేటా లీకయ్యాక ఫ్రాన్స్ రక్షణశాఖ అప్రమత్తమైంది. గత పదేళ్లుగా స్ట్రావా యాప్ వాడుతున్న దాదాపు 400 మంది సిబ్బందిపై దర్యాప్తు మొదలుపెట్టింది. ఈవిషయాన్ని యూకేకు చెందిన డెయిలీ మెయిల్ కథనంలో పేర్కొంది.

**జలాంతర్గామిలో ప్రయాణించిన విషయాలు కూడా..** ఫ్రాన్స్ పత్రిక లా మాండే కథనం ప్రకారం ఇక్కడ పనిచేసే సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా తమ అసలు పేర్లతోనే యాప్‌లో నమోదైనట్లు తేలింది. పైగా వారి ప్రొఫైల్‌ను పబ్లిక్‌గానే ఉంచారు. ఓ అధికారి మొత్తం 16 సార్లు అణు జలాంతర్గాములున్న ప్రదేశాల్లో జాగింగ్‌కు వెళ్లినట్లు తేలింది. ఆ సమయంలో తన లొకేషన్, టైమ్‌ను అతడు రికార్డు చేశాడు. ఆ తర్వాత రెండు నెలలపాటు అతడి కార్యకలాపాలు ఆ యాప్‌లో నిలిచిపోయాయి. ఆ తర్వాత మళ్లీ మొదలయ్యాయి. దానిలో చాట్ చేస్తూ తాను రెండు నెలలపాటు 'జీవ వ్యర్థాల బాక్స్' (జలాంతర్గామిని ఉద్దేశించి)లోకి వెళ్లి వచ్చాను అని మెసేజ్ చేశాడు. దీనికితోడు స్కూబా డైవింగ్ ఇమేజ్‌లను షేర్ చేశారు. ఇదే స్ట్రావా యాప్‌ను అమెరికా, రష్యా, ఫ్రాన్స్ అధ్యక్షుల బాడీగార్డులు కూడా వాడుతున్నట్లు ఆ ఫ్రాన్స్ పత్రిక కథనంలో పేర్కొంది. దీంతో ఆయా అధ్యక్షుల కదలికలు, ట్రిప్‌ల వివరాలు కూడా ఆ యాప్‌లోకి చేరుతున్నట్లు పేర్కొంది.

## ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం.. సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి15: కాంగ్రెస్ పార్టీకి 140 ఏళ్ల చరిత్ర ఉందని.. ఆ పార్టీ ఏ స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంత ఘన చరిత్ర ఉన్న ఈ పార్టీ దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమంతోపాటు అభివృద్ధి కోసం పాటు పడిందని ఆయన గుర్తు చేశారు. ఇన్నేళ్లు దేశాన్ని నడిపిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోందన్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ అగ్రనేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. నిన్న కాకుండా మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాగే ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఇకపై ఈ కార్యాలయం వేదికగా ప్రణాళికలు రచించబోతున్నామని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలందరికీ ఇక్కడి నుంచే దశ దిశ నిర్ధారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు విధి విధానాలు రూపొందిస్తామన్నారు. దేశ ప్రజలకు ఇది పండగ రోజు అని ఆయన అభివర్ణించారు.

దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు పలువురు కేంద్ర మంత్రుల అపాయింట్మెంట్ కోరామన్నారు. అపాయింట్‌మెంట్ వచ్చిన వెంటనే వారిని కలిసి.. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

## మీ ఆవేదన, ఆక్రోశం దేని కోసం



హైదరాబాద్, జనవరి 15: నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ.. కేంద్రం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానిక బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం స్పందించారు. ఆ క్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా తనపై మీరు చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మంత్రి తుమ్మల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నిజామాబాద్ రైతుల సుదీర్ఘ పోరాటం, చిరకాల నిరీక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగానే కాకుండా.. ఒక రైతుగా తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఈ సందర్భంగా.. పార్టీ, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి తాను ధన్యవాదాలు తెలియజేశానని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం...ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు తెలియజేశారు. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానివని స్పష్టం చేశారు. 1983 నుంచి నేటి వరకు తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకమన్నారు. పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏ నాడు, ఏ నాయకుడి వద్ద తాను మోకరిల్లింది లేదు... ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నదని తెలిపారు. తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిక్షణం ప్రజాహితమే తప్ప వ్యక్తిగత స్వార్థం లేదు... ఇకపై ఉండబోదు కూడా అని స్పష్టం చేశారు. ఆ నాడు నందమూరి తారక రామారావు లాంటి మహానుభావుడి నుంచి నేడు రేవంత్ రెడ్డి వరకు ఏ కేబినెట్‌లో పని చేసినా, ఏ హోదాలో విధులు నిర్వర్తించినా రాష్ట్ర అభివృద్ధి, రైతులు సంక్షేమం, పేదల పక్షపాతం తప్ప తనకు మరో ఎజెండా అయితే లేదన్నారు. చంద్రబాబు నాయుడు కావచ్చు... చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కావచ్చు.. రాజకీయంగా, సిద్ధాంత పరంగా తనతో విభేదించవచ్చు కానీ.. ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల తన కమిట్‌మెంట్‌ను ప్రశ్నించ లేదని వివరించారు. నాయకుడు ఎవరైనా, పార్టీ ఏదైనా ప్రజాహితమే తన అభిమతంగా పని చేశానని చెప్పారు. తనను పార్టీలో చేర్చుకోండి, టికెట్ ఇవ్వండి, పదవి ఇవ్వండంటూ ఈ 40 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఏనాడు, ఎవరిని అడిగింది లేదని తెలిపారు. తన వల్ల సమాజానికి మంచి జరగుతుంది, తన పని తీరుతో రాష్ట్రానికి మేలు జరుగుతుందని విశ్వసించి ఆయా పార్టీల నేతలను తనను కోరుకున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఆదరించారు తప్ప... తాను ఏ పార్టీ గుమ్మం ముందు, ఏ నాయకుడు వద్ద సాగిలపడింది లేదని స్పష్టం చేశారు. ఈ తన రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలో కానీ.. తెలంగాణ రాష్ట్రంలో కానీ.. ఏ మూలకు వెళ్లినా అక్కడ అభివృద్ధి ఆనవాళ్లలో తన గుర్తులు కనిపిస్తాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులైనా, జాతీయ రహదారులైనా వాటి నిర్మాణంలో తన పాత్ర, తన శ్రమ ఉంటుందని తెలిపారు.

## ఆ వాదనను ఇప్పుడు మేము ఏకీభవించం: మంత్రి ఉత్తమ్

న్యూఢిల్లీ: కృష్ణ ట్రిబ్యునల్ పై గురువారం నుంచి రెండు రోజుల పాటు సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. న్యాయస్థానంలో తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్, సుప్రీంకోర్టు న్యాయవాది వైద్యనాథన్‌ను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల ప్రతిపాదనకు సూచనప్రాయంగా ఒప్పుకున్నారని, నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగవద్దని మంత్రి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టిఎంసిల నీటి కేటాయింపులు జరిగాయని, ఆ వాదనను తాము ఇప్పుడు ఏకీభవించడం లేదన్నారు. తెలంగాణలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టీఎంసీలు కేటాయించారని, అందులో మెజార్టీ టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఏపీలో జగన్మోహన్‌రెడ్డి తన అయిదేళ్ల పరిపాలన కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అటకెక్కించడమే కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలను జటిలం చేసి వెళ్లారు. అటు కర్ణాటక ఇటు తెలంగాణతో నెలకొన్న పరిష్కారం కాని వివాదాలు దురదృష్టం కొద్దీ కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమనే చుట్టుముడుతున్నాయి. ప్రస్తుతం విచారణ జరుపుతున్న కృష్ణ ట్రిబ్యునల్‌లో సమర్థవంతంగా వాదించేందుకు, అనువైన చర్యలు చేపట్టేందుకు తోడు అంతర్రాష్ట్ర జల వివాదాంశాలపై ఉన్నత స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించడం ఎంతైనా అవసరం. తుంగభద్ర జలాశయం పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పోయిందని కర్ణాటక ప్రభుత్వం ఎగువ భాగంలో వరసబెట్టి రిజర్వాయర్ల నిర్మాణానికి తలపడుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడిక ఏర్పడి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వాస్తవమైనా దానివల్ల ఒక్క కర్ణాటకే కాకుండా ఆంధ్రప్రదేశ్ వాటాలో కూడా కోత పడుతోంది. ఆంధ్రప్రదేశ్ వాటా 72 టీఎంసీలకు గాను 40 టీఎంసీలు కూడా రావడం లేదు. జగన్ హయాంలోనే 2022లో 29 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావడమే కాకుండా, జాతీయ హెూదా కూడా లభ్యమైంది. అప్పర్ భద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా అప్పట్లో రాయలసీమలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు




జరిగాయి. కాని ముఖ్యమంత్రిగా జగన్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండి పోయారు. కాగా 2020లోనే గంగావతి తాలూకాలో నావళి వద్ద 31 టీఎంసీలతో మరొక ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. ఈ ప్రాజెక్టు కూడా తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందనే పేరుతోనే ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇటీవల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక ప్రవేశపెట్టి ఆమోదించమని కోరింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువకు ఆమోదం కోరినట్లు వార్తలు వచ్చాయి. నావళి ప్రాజెక్టు కూడా నిర్మిస్తే తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో 60 టీఎంసీల సామర్థ్యంతో కర్ణాటక రెండు రిజర్వాయర్లను అదనంగా నిర్మించుకొంటుంది.

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఉన్న కేసు ఇప్పుడు విచారణకు వచ్చింది. ఈ కేసు విచారణ సందర్భంగా సమర్థవంతంగా వాదించేందుకు అనుభవమున్న లాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువ వరద జలాల ఆధారంగా కోరబడినా ప్రయోజనం లేదు. కర్ణాటక పైభాగం నుంచి వచ్చే వరద కిందకు రాకుండా ఆ రాష్ట్రం రిజర్వాయర్లు నింపుకొంటుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నావళి ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకించాలి. చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న సాగునీటి రంగ సమీక్ష సమావేశాల్లో ఇంజనీరింగ్ అధికారులు అంతర్రాష్ట్ర జల వివాదాల్లో మున్ముందు వచ్చే ఇబ్బందులను వివరంగా నివేదించవలసి ఉంది.

## తెలంగాణ ప్రజలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే: ప్రభుత్వ విప్ డిమాండ్..



హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెంపపెట్టని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకున్న కేటీఆర్.. కుంభకోణం లేదు లంబకోణం లేదని అన్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే అక్రమ కేసులు అంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసిన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని ప్రభుత్వ విప్ తేల్చి చెప్పారు. ఇందుకు కోర్టులూ ప్రభుత్వానికి సహకరించడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లాగా ఇళ్ల తలుపులు విరగొట్టి మరీ అరెస్టులు చేయడం లేదని ఆయన విమర్శించారు. తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని కేటీఆర్ చెప్తున్నారని, ఇప్పుడు ఉన్నత న్యాయస్థానం తీర్పుపై తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సమాధానం చెప్తారంటూ ప్రశ్నించారు. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని హైకోర్టును కేటీఆర్ ఆశ్రయించారని, అందుకు న్యాయస్థానం నిరాకరించిందని శ్రీనివాస్ గుర్తు చేశారు. దీనిపై ఆయన ఉన్నత న్యాయస్థానానికి వెళ్లినా సుప్రీంకోర్టు తన తీర్పుతో కేటీఆర్‌కు చెంపదెబ్బ కొట్టినట్లయ్యిందని ఆయన ఎద్దేవా చేశారు. ఏసీబీ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో న్యాయం ఉందని అందుకే కోర్టులు కేటీఆర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వలేదని శ్రీనివాస్ చెప్పారు. ఈ కేసుల్లో కేటీఆర్ ఇప్పటివరకూ చేసిన హంగామాకు, చేస్తున్న దానికి సైతం బహిరంగ క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగా, ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నేడు విచారణ చేపట్టిన ధర్మాసనం హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోలేమంటూ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేసిన పోలీసులు




హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, విచారణకు ఈనెల 17న హాజరవుతానని కౌశిక్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులు అడ్డుకోవడం, బెదిరింపుల వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదు మేరకు గతంలో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌ను దర్యాప్తు అధికారిగా డీసీపీ విజయ్‌కుమార్ నియమించారు.

## పుప్పాలగూడ జంట హత్యల కేసు.. వివాహేతర సంబంధమే కారణమా?



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ జంట హత్యల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. అనంత పద్మనాభస్వామి ఆలయ గుట్టల వద్ద దారుణహత్యకు గురైన యువతి, యువకుడిని పోలీసులు గుర్తించారు. హత్యకు గురైన బిందు ఈ నెల 3న అదృశ్యమైనట్లు వనస్థలిపురంలో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతి చెందిన అంకిత్ సాకేత్‌పై ఈనెల 8న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. నార్సింగి పరిధిలోని పుప్పాలగూడలో వీరు మంగళవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. వివాహేతర సంబంధమే హత్యకు కారణం అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

# చురకలు

## సంపాదకీయం

### ట్రంపా.. మజాకా... విదేశీ ఉద్యోగులు ఉన్న కంపెనీలకు కొత్త టెన్షన్ స్టార్ట్!

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. జనవరి 20న అగ్రరాజ్యం అధినేతగా బాధ్యతలు స్వీకరించనున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో నిన్నటివరకూ అమెరికాలోని యూనివర్శిటీలు, కళాశాలలకు టెన్షన్ స్టార్ట్ అవ్వడం.. దీంతో పలు విద్యాసంస్థలు.. వింటర్ విరామం నుంచి ముందుగానే క్యాంపస్ కు తిరిగి రావాలని రిక్వెస్టులు పంపడం తెలిసిందే. అంతర్జాతీయ విద్యార్థుల విషయంలో ట్రంప్ సరికొత్త నిబంధనలు ఎలా ఉంటాయనేదానిపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో... అమెరికాలోని యూనివర్శిటీలు, కాలేజీలకు ట్రంప్ టెన్షన్ మొదలైందని.. వింటర్ విరామానికి ముందే క్యాంపస్ లకు తిరిగిరావాలని మెయిల్స్ పెట్టాయని చెబ్బుతున్నారు. ఈ సమయంలో ఉద్యోగుల విషయంలోనూ కంపెనీలు అదే పనిలో ఉన్నాయని అంటున్నారు. అవును... 2023-24 అకడమిక్ ఇయర్ లో అమెరికాలోని కాలేజీలు, యూనివర్శిటీ సుమారు 1.1 మిలియన్లకు పైగా అంతర్జాతీయ విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు చెబుతున్నారు. అయితే... ట్రంప్ తిరిగి వైట్ హౌస్ కు చేరుకున్న తర్వాత.. కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనల అమలు తెరపైకి తెచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో... ఇప్పటికే విదేశీ విద్యార్థులకు ఈ మేరకు ఈ-మెయిల్స్ పంపినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... ట్రంప్ వైట్ హౌస్ కు తిరిగి రావడానికి కనీసం వారం ముందు యూఎస్ కి తిరిగిరావాలని యూనివర్శిటీలు కోరుతున్నాయని అంటున్నారు. ఈ సమయంలో... అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు ఈ మేరకు ఈ-మెయిల్స్ వెళ్లినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... భారత్ సహా ఇతర దేశాలకు వెళ్లిన తమ ఉద్యోగులు జనవరి 20 లోపు అమెరికాలో వాలిపోవాలని.. ఆ తర్వాత ఏమైనా జరిగే అవకాశం ఉందని పలు కంపెనీల యాజమాన్యాలు ఈ-మెయిల్స్ పెడుతున్నాయని చెబుతున్నారు. దీంతో... సంక్రాంతి పండుగ కూడా ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదన్నట్లుగా ఎప్పుడు ఫ్లైట్ దొరికితే అప్పుడు యూఎస్ వెళ్లిపోతున్నారంట జనాలు! కాగా.. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను సిద్ధం చేస్తున్నారని అంటున్నారు. మరోపక్క ప్రధానంగా ఆయన తొలి నిర్ణయం.. విదేశీ ఉద్యోగులు, వీసాలపైనే ఉంటుందనే చర్చా బలంగా సాగుతున్న పరిస్థితి. దానికీ ఓ బలమైన కారణం ఉంది. ఎన్నికల సమయంలోనూ స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు లభించేలా చేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. ఈ సమయంలో ఆ హామీని నెరవేర్చాలంటే.. "అమెరికా ఫస్ట్" అనే స్లోగన్ కు న్యాయం జరగాలంటే ఆయన ఫస్ట్ టార్గెట్ హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు విధించడమే అనే చర్చా తెరపైకి వచ్చింది. హెచ్-1బీ వీసాలు ఆపుతారని కాదు కానీ.. మరింత కఠినమైన నిబంధనలు తెచ్చే అవకాశం మాత్రం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో... మరికొన్ని వీసాలను రద్దు చేసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు అలర్ట్ అయ్యాయి.. ట్రంప్ కుర్చీ ఎక్కే లోపు తిరిగి అమెరికాకు రావాలని కోరుతున్నట్లు చెబుతున్నారు.

# కథా రచయితలకు మార్గదర్శకాలు చాసో కథలు - జనవరి 15: కథకులకు కథకులు చాగంటి సోమయాజులు జయంతి




తెలుగు కథకు దిశానిర్దేశం చేసిన కొద్ది మంది ప్రముఖులలో చాసో ఒకరు. తెలుగు సాహిత్యంలో 'కథకులకి కథకుడు' అని పేరు ఆయన పేరెన్నిక గన్నారు. చాసో పూర్తి పేరు చాగంటి సోమయాజులు. "ఏలూరెళ్ళాలి ' "వాయులీనం" "కుంకుడాకు" "కుక్కుటేశ్వరము" చాసో పేరు చెప్పగానే మొదటగా గుర్తొచ్చే కథలు. ఈ నాలుగు కథలు ప్రధానంగా పేర్కొన్న బడినా, 1943-79 మధ్య కాలంలో చాసో రాసిన కథల నుంచి ఎంపిక చేసిన నలభై కథలతో విశాలాంధ్ర సంకలనం 'చాసో కథలు పేరున వెలువరించింది. మళ్ళీ మళ్ళీ చదువుకునే కథలు ఇవి. కొత్తగా కథలు రాయాలనుకునే వారికి చాసో కథలు మార్గదర్శకాలు. ఒక కథకు మరో కథకు ఏ మాత్రం పోలిక పరంగా సంబంధం లేక పోవడమనే అంశం ఆయనను గొప్ప కథకుడిని చేసింది. చాగంటి సోమయాజులు ( 1915, జనవరి 15 - 1994 జనవరి 1) ప్రముఖ తెలుగు రచయిత. ఆయన మొట్ట మొదటి రచన "చిన్నాజీ" 1942లో భారతి పత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత ఎన్నో కథలు, కవితలు రాశారు. ఆయన రాసిన కథల్లో పీడిత ప్రజల బాధలు, సమస్యలు, సమ కాలీన వ్యవస్థ అయన రచనలో ప్రధానంగా ఉన్నాయి. ఆయన రాసిన చాలా కథలు హిందీ, రష్యన్, కన్నడ, మరాఠి, మలయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించ బడ్డాయి. 1968లో చాసో కథలుగా పుస్తక రూపంలో చాసో కథా సంకలనం వెలువడింది. 1915 జనవరి 15 న శ్రీకాకుళంలో జన్మించిన చాగంటి సోమయాజులు తల్లితండ్రులు కానుకొలను లక్ష్మీనారాయణ శర్మ, తులసమ్మ. తర్వాత పెదతల్లి తులసమ్మకు దత్త పుత్రునిగా విజయ నగరం వెళ్ళారు. చాసో అయిదో ఫారం వరకు శ్రీకాకుళంలో చదివారు. విజయనగరం ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేసి మహారాజా కళాశాల విజయ నగరంలో పై చదువులు చదివారు. కళాశాల విద్యార్థిగానే ఆయన కవితా రచనకు శ్రీకారం చుట్టారు. తోరుదత్, సరోజినీ నాయుడుల కవిత్వం, లియో టాల్‌స్టాయ్, మాక్సిం గోర్కీల కళాత్మక వ్యక్తీకరణ, ప్రగతిశీల మార్క్సిస్టు దృక్పథం చాసోను ప్రభావితం చేశాయి. సృజనాత్మక ప్రక్రియలైన కథ, కవిత్వం, రెండింటినీ దాదాపు ఒకే సమయంలో వ్రాస్తూ వచ్చినా, తర్వాతి కాలంలో ఆయన కథా రచనకే ప్రాధాన్య మిచ్చారు. అచ్చయిన చాసో తొలి కవిత 'ధర్మక్షేత్రము' (భారతి : 1941 జూన్), కాగా తొలి కథ చిన్నాజీ (భారతి: 1942). చాసో కథల రెండో కూర్పు విశాలాంధ్ర ప్రచురణాలయం 1983లో ముద్రించింది. ఇందులో మొత్తం 40 కథలున్నాయి. అభ్యుదయ రచయితల సంఘం స్థాపించిన వారిలో చాసో ఒకరు. ఆయన నిత్యజీవితంలో చాలా ఆదర్శాల కోసం పనిచేసారు. అభ్యుదయ సాహిత్యోద్యమ వేదిక, అభ్యుదయ రచయితల సంఘం మొదటి మహాసభలు తెనాలిలో 1943లో జరిపారు. కన్నుమూసే వరకూ ఆయన 'అరసం'లోనే ఉంటూ కార్యకర్తగా నాయకునిగా తెలుగునాట అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి విశేష సేవలందించారు. చాసో 1994 జనవరి 1 న మరణించారు. మరణానంతరం తన భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం ఇమ్మని కోరటం ఆయన అభ్యుదయ జీవన దృక్పథానికి నిదర్శనం. చాసో కథల్లో ఉన్న మనుషులకి అంటే ప్రధాన పాత్రలకి ఆవేశాలుండవుబీ కామం, ప్రేమ, ఈర్ష్య, క్రోధం, ఇలాంటి ఉద్రేకాలుండవు. వాళ్ళు ఏ కోరికకీ లొంగిపోరు ఒక్క బతకాలనే కోరిక తప్ప. మనిషి సుఖంగా బతకాలంటే ఏం చెయ్యాలో చాసో పాత్రలు అన్యాపదేశంగా వివరిస్తాయి. సుఖం దానంతట అది రాదు. సుఖం నువ్వు చేసుకునేది. అది అదృష్టం వల్లో, మరో సదుపాయం వల్లో వచ్చే వొస్తువు కాదు. ఆలోచనల వల్ల, లౌక్యం వల్ల, చాకచక్యం వల్ల మాత్రమే సౌఖ్యం సాధ్యం. నీతి, స్నేహం, న్యాయం, ధర్మం ఇవి నిజాలు కావు. కాని ఇవి ఉన్నాయని తెలివితక్కువ వాళ్ళు నమ్ముతారు. అవి నిజంగా ఉన్నాయని నువ్వు నమ్మేవో నువ్వూ లోకంలో నానా కష్టాలూ పడే వాళ్ళలో చేరిపోతావు. ఇలా చాసో కథలలో పాత్రల ద్వారా చెపుతారు. తెలుగు కథా విమర్శకులలో చాసోని మెచ్చుకున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. వేళ్ళ మీద లెక్కపెట్ట దగిన పదిమంది తెలుగు కథానికా రచయితలలో చాసో పేరుంటుందని రోణంకి అప్పలస్వామి కితాబిచ్చారు. తెలుగు మరిచి పోయినప్పుడే చాగంటి సోమయాజులుని మరిచి పోవడమని ఆరుద్ర పేర్కొన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఆపత్కాలంలో ఆపద్ధర్మ ప్రధాని నందా - జనవరి 15 నందా వర్ధంతి

గుల్జారీలాల్ నందా పేరు ఈ తరం వారికి చాలా మంది తెలియక పోవచ్చు. అయన భారత దేశానికి రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా భాద్యతలను చేపట్టారు. పదవిలో ఉన్న ప్రధాని ఆకస్మికంగా మరణిస్తే, లోకసభ సభ్యులు మరో నేతను ఎన్నుకుని ఆ పదవిలో సదరు నేత చేరే వరకు తాత్కాలికంగా ప్రధాని పదవిని రాజ్యాంగం ప్రకారం నిర్వహించే పదాధికారిని ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అంటారు. అలా నందా మొదటి సారి 1964 లో భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మరణం తరువాత13 రోజులు (27 మే 1964 - 9 జూన్ 1964)బీ రెండవసారి 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మరణం తరువాత (11 జనవరి 1966 %-% 24 జనవరి 1966) 13 రోజులు ఈ పదవిని చేపట్టారు. గుర్జారీలాల్ నందా (జూలై 4, 1898 - జనవరి 15, 1998) నిబద్దత కలిగిన జాతీయ రాజకీయ నాయకుడు, ఆర్థికవేత్త. కార్మిక సమస్యలపై ప్రత్యేకంగా కృషిచేసిన వ్యక్తి. రెండు పర్యాయములు భారతదేశ తాత్కాలిక ప్రధాన మంత్రిగా నెల రోజుల లోపే పదవిలో ఉన్నారు. రెండు సందర్భాలలోనూ లోకసభలో మెజారిటీ సభ్యులు కలిగి ఉన్న భారత జాతీయ కాంగ్రెస్, లోకసభ నాయకుడిని అంటే ప్రధాన మంత్రిగా కొత్త నేత ఎన్నిన్నుకునే వరకు ఈ రెండు సందర్భాలలో దేశ మలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేత ప్రమాణ స్వీకారం చేయించ బడి, పరిపాలన బాధ్యతలు చేపట్టారు. 1997లో అతనికి భారత రత్న పురస్కారం స్వీకరించారు. గుల్జారీలాల్ నందా 1898 జూలై 4న బ్రిటిష్ ఇండియాలో అవిభాజ్య పంజాబ్ ప్రాంతములోని సియాల్‌కోట్ (ప్రస్తుతము పంజాబ్ (పాకిస్తాన్)లో ఉన్నది) పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించారు. లాహెూర్, అమృత్‌సర్, ఆగ్రా, అలహాబాద్ లలో విద్యాభ్యాసం చేసారు. ఆయన1920-1921 వరకు ఈయన అలహాబాద్ విశ్వవిద్యాలయములో కార్మిక సమస్యలపై పరిశోధన చేశారు. 1921 లో బొంబాయిలోని నేషనల్ కాలేజీలో ఆచార్య పదవిని పొందారు. అదే సంవత్సరము బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమములో పాల్గొన్నారు. 1922లో అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ కార్మిక సంఘము కార్యదర్శిగా చేరి 1946 వరకు అందులోనే కొనసాగారు. 1932లో సత్యాగ్రహము చేసి జైలు కెళ్లారు. మరలా 1942 నుండి 1944 వరకు జైలులో గడిపారు. రిజిస్టరు కాబడిన "అలహాబాదు విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థుల అసోసియేషన్" విడుదలచేసిన 42 సభ్యుల జాబితాలో "గర్వపడ వలసిన పూర్వ విద్యార్థి" గా గౌరవింప బడ్డారు. 1937లో బ్రిటిష్ ప్రభుత్వంలో బొంబాయి శాసనసభకు ఎన్నికైనారు. తరువాత 1937 నుండి 1939 వరకు బొంబాయి ప్రభుత్వంలో పార్లమెంటు సెక్రటరీ గా (కార్మిక, ఎక్సైజ్ శాఖలు) సేవలనందించారు. 1946 నుండి 1950 వరకు బొంబాయి ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు అతను రాష్ట్ర శాసనసభలో కార్మిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టడంలో విజయవంతంగా నాయకత్వం వహించారు. కస్తూర్బా మెమోరియల్ ట్రస్టు లో ఒక ట్రస్టీగా తన సేవలను అందించారు. హిందూస్థాన్ మజదూర్ సేవక్ సంఘ్ కు సెక్రటరీగా, బొంబాయి హౌసింగ్ బోర్డు కు ఛైర్మన్ గా పని చేశారు. జాతీయ ప్లానింగ్ కమిటీలో సభ్యుడుగా ఉన్నారు. "ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" ను నిర్వహించడంలో ముఖ్యపాత్ర వహించి, తరువాత ఆ సంస్థకు అధ్యక్షునిగా భాధ్యతలు చేపట్టారు. 1947లో నందా జెనీవా, స్విట్జర్లాండ్ దేశాలలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సభలకు ప్రభుత్వ ప్రతినిధిగా హాజరయ్యారు. ఆ సమావేశంలో "ఫ్రీడం ఆఫ్ అసోసియేషన్ కమిటి"లో పనిచేస్తూ, స్వీడన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, బెల్జియం, యు.కె దేశాలను సందర్శించి ఆ దేశాలలో గల కార్మికులు, వారి గృహ పరిస్థితులను అధ్యయనం చేసారు. మార్చి 1950లో భారత ప్లానింగ్ కమీషన్ లో వైస్ ఛైర్మన్ గా చేరారు. 1951 సెప్టెంబరులో అతను భారత ప్రభుత్వంలో ప్లానింగ్ మంత్రిగా నియమింప బడ్డారు. ఆయనకు వ్యవసాయం, విద్యుత్ శాఖలను కూడా అదనంగా కేటాయించారు. 1952 సార్వత్రిక ఎన్నికలలో బొంబాయి నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి ప్లానింగ్, వ్యవసాయం, విద్యుత్ శాఖలకు మంత్రిగా నియమితుడయ్యారు.

1955 లో సింగపూర్ లో జరిగిన ప్లాన్ కన్సల్టేటివ్ కమిటీకి భారతీయ ప్రతినిధులకు నాయకత్వం వహించారు. నందా 1957 ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నిక అయి కార్మిక, ఉపాధి, ప్లానింగ్ శాఖలకు కేంద్రమంత్రిగా పనిచేసారు. 1959 లోజెనీవా జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశాలలో పాల్గొన్నారు. తరువాత ప్లానింగ్ కమీషన్ డిప్యూటీ ఛైర్మంగా భాధ్యతలు చేపట్టారు. 1959లో ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ, యుగోస్లేవియా, ఆస్ట్రియా దేశాలకు పర్యటించారు. నందా 1962 ఎన్నికలలో లోక్‌సభకు గుజరాత్ లోని శంబర్ కాంత



నియోజకవర్గం నుండి తిరిగి ఎన్నికయ్యారు. సామ్యవాద నిర్మాణం కోసం కాంగ్రెస్ ఫోరం ప్రారంభించారు. 1962 - 1963 కాలంలో కార్మిక, ఉపాధి శాఖలకు కేంద్రమంత్రిగాను, 1963 - 1966 కాలంలో హెూం మంత్రిగానూ పదవులను చేపట్టారు.

1967,1971 లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలోని కైతల్ నియోజవవర్గం నుండి ఎన్నికైనారు. 1970 - 1971 కాలంలో రైల్వే శాఖకు కేంద్రమంత్రిగా సేవలనందించారు. గుల్జారిలాల్ నందా రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో చైనాతో, పాకిస్తాన్ తో యుద్ధం జరిగిన కీలకమైన సమయంలో సమయోచితంగా పదవి నిర్వహించారు. నందా 1998 జనవరి 15న తన 99వ యేట మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సంఘ సంస్కర్త త్రిపురనేని - జనవరి 15...త్రిపురనేని రామస్వామి జయంతి



'కవిరాజుగా ప్రసిద్ధి చెందిన 'త్రిపుర నేని రామస్వామి (జనవరి 15, 1887 - జనవరి 16, 1943) న్యాయవాది, ప్రముఖ హేతువాద రచయిత, మనసా, వాచా, కర్మణా సంఘ సంస్కర్త. ప్రసిద్ధ కవి రాజుగా పిలువబడే ఆయన హేతువాదం, మానవతా వాదం తెలుగు కవిత్వం, సాహిత్యాల్లో లోకి మొదటి సారిగా ప్రవేశపెట్టిన కవిగా భావిస్తారు. త్రిపురనేని రామస్వామి 1887 జనవరి 15 న కృష్ణా జిల్లా, అంగ లూరు గ్రామంలో ఒక రైతు కుటుం బంలో జన్మించారు. నాటికే భారత దేశంలో ప్రచారంలో ఉన్న సామాజిక - మత సంస్కరణ ఉద్యమాలలో పాల్గొన్నారు. రాజా రామ్ మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, గోవింద రనడే, దయానంద సరస్వతి మొదలైన వారి ఆదర్శాలను ప్రజల లోనికి తీసుకు రావడానికి ఉద్యమించిన వారిలో రామస్వామి ఒకరు. రామస్వామి రైతు కుటుంబములో పుట్టినా చిన్నప్పటినుడి సాహితీ జిజ్ఞాసతో పెరిగారు. 23వ యేట మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణుడైనా రు. అదే సంవత్సరము ఆయన పల్నాటి యుద్ధము ఆధారముగా "కారెంపూడి కదనం", మహాభారత యుద్ధము ఆధారముగా "కురుక్షేత్ర సంగ్రామం" రెండు నాటికలు రచిం చారు. 1911లో ఇంటర్మీడియట్ చదవడానికి బందరు లోని నోబుల్ కాలేజీలో చేరాక, అక్కడ అవధా నము చేసి తన సాహితీ నైపుణ్య మును, అద్భుతమైన జ్ఞాపకశక్తిని ప్రదర్శించారు. 1898లో పున్నమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1910లో వారికి కలిగిన కుమారుడే ప్రఖ్యాత రచయిత, త్రిపురనేని గోపీచంద్. 1914లో న్యాయ శాస్త్రం చదివేందుకు డబ్లిన్ వెళ్ళి, ఆంగ్ల సాహిత్యము, ఆధునిక ఐరోపా సంస్కృతి కూడా చదివారు. డబ్లిన్ లో చదువుతున్న రోజుల్లోనే అనీ బీసెంట్ ప్రారంభించిన హెూం రూల్ ఉద్యమంకు మద్దతు ఇవ్వ వలసినదిగా భారతీయులకు విజ్ఞాపన చేస్తూ కృష్ణా పత్రికలో అనేక రచనలు చేశారు. రామ స్వామి స్వాంతంత్ర్యోద్యము రోజులలో ప్రజలకు స్ఫూర్తినిచ్చి ఉత్తేజ పరచే అనేక దేశభక్తి గీతాలు రచిం చారు. 1917లో భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాలు మచిలీ పట్నంలో న్యాయవాద వృత్తి నిర్వహించారు. కానీ ఆయన ముఖ్య వ్యాసంగము సంఘ సంస్కరణే. స్మృతులు, పురాణాలు, వ్యవస్థీకృత మతము వలన వ్యాపించిన కుల వ్యవస్థ మీద, సామాజిక అన్యాయాల మీద ఆయన పూర్తి స్థాయి ఉద్యమము ప్రారంభించారు. 1922లో గుంటూ రు జిల్లా, తెనాలిలో స్థిరపడ్డారు. 1925లో తెనాలి పురపాలక సంఘ చైర్మనుగా ఎన్నికయ్యాడు. తెనాలి మున్సిపాలిటీ చైర్మెన్ గా ఉన్న పుడు, గంగానమ్మ కొలుపులలో నిర్వహించే జంతు బలిని నిషేధిం చారు. ఫలితంగా ఆయనను చైర్మను పదవి నుండి తీర్మానం ద్వారా తొలగించగా, వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్ళీ ఎన్నికై, తిరిగి చైర్మను అయ్యారు. జంతు బలులు మాత్రం సాగలేదు. 1938 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. సూతాశ్రమం అనిపేరు పెట్టుకున్న ఆయన ఇల్లు రాజకీయ, సాహిత్య చర్చలతో కళకళలాడుతూ ఉండేది. సంస్కృత భాషలో ఉన్న పెళ్ళి మంత్రాలను తెలుగులోకి అనువ దించి, అచ్చులో సరళమైన వివాహ విధి అను పద్ధతిని తయారు చేసారు. ఆయన స్వయంగా అనేక పెళ్ళిళ్లకు పౌరోహిత్యము వహించి జరిపించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1943 జనవరి 16 న త్రిపురనేని రామ స్వామి మరణించారు. 1987 వ సంత్సరంలో భారతదేశ ప్రభుత్వము వారు ఆయన స్మారక చిహ్నముగా ఆయన పేరు మీద తపాళా బిళ్ళను జారీ చేయడం జరిగింది. ప్రజలను మేలుకొలిపే హేతువాద భావాలను వ్యక్తపరచడానికి సాహితీ రచనలను సాధనంగా త్రిపురనేని ఎంచుకున్నారు. రామ స్వామి తన ఆలోచనలను సాహి త్యం ద్వారా వ్యక్త పరచడమే కాక ఆచరణలో పెట్టడానికి కూడా ప్రయత్నించారు. "వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడొ తెల్పుడీ పూసి పోదుము మెడను వైతుము పూల దండలు భక్తితో"... గేయం త్రిపురనేని రచనే... ఒకరుడు 'వేదమే' భగవ దుక్తమటంచు నుపన్యసించు నింకొకరుడు 'బైబిలే' భగవదుక్త మటంచును వక్కణించు, వేరొంకరుడు మా ' ఖొరాన్ ' భగవదుక్త మటంచును వాదులాడు, నీ తికమక లేల పెట్టెదవు? తెల్పగరాదె నిజంబు నీశ్వరా... మా మతం గొప్పదంటే కాదు మా మతం గొప్పదని వాదులాడే మతోన్మాదులను ఈసడిస్తూ రాశారు. సూత పురాణము, శంబుక వధ, సూతాశ్రమ గీతాలు, ధూర్త మానవ శతకము, ఖూనీ, భగవద్గీత, రాణా ప్రతాప్, కొండవీటి పతనము, కుప్పు స్వామి శతకం, గోపాల రాయ శతకం, పల్నాటి పౌరుషం, వివాహ విధి తదితరాలు త్రిపుర నేని ముఖ్య రచనలు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి, ఆంధ్ర మహాసభ ఆయనకు కవి రాజు అనే బిరుదునిచ్చి గౌరవిం చింది. 1940లో గుడివాడ ప్రజానీకము గజారోహణ సన్మానము చేసారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు



కరీంనగర్ : ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి జిల్లాలో యథావిధిగా కొనసాగడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఇన్నాళ్లు చేసిన సేవలకుగానూ కోట్ల రూపాయల బకాయిలను సర్కారు చెల్లించాల్సి ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రుల యాజమన్యాలు ఇక మీద వైద్య చికిత్సనందించమని పేర్కొన్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి రోగులను తీసుకోమని ప్రకటించాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి కొంత మొత్తాన్ని విడుదల చేయడంతో నాలుగు జిల్లాల పరిధిలో శుక్రవారం సేవలు ఆగకుండా కొనసాగాయి. జగిత్యాల జిల్లాలో మాత్రం కొత్తగా రోగులను కొన్ని ఆస్పత్రుల్లో అనుమతించలేదు. ప్రభుత్వం అందించనున్న సొమ్ములో తమకే మేరకు అందుతాయనే సంశయంతో ఉన్నవారికే సేవలందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 49 ప్రైవేటు దవాఖానాల్లో ఆరోగ్యశ్రీ సదుపాయంతో పేదలు అత్యవసర వైద్యసేవల్ని పొందుతున్నారు. ఇందులో 17 ప్రభుత్వ, 32 ప్రైవేటువున్నాయి.

**రూ.వంద కోట్లకుపైగా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గడిచిన ఏడాదిన్నర కాలంగా అందించిన సేవలకు సంబంధించి రూ.100 కోట్లకు పైగా బకాయిలను ప్రభుత్వం ఆయా ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉంది. ఇందులో కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా 22 ఆస్పత్రులకు బకాయి ఉంది. పెద్దపల్లి జిల్లాలో ఒక ఆస్పత్రి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు, జగిత్యాల జిల్లాలో ఏడు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సదుపాయాలు అందుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేరొందిన ప్రైవేటు ఆస్పత్రులు 200కుపైగా ఉన్నప్పటికీ ఆరోగ్య శ్రీ సేవలకు 32 ఆస్పత్రులు మాత్రమే ముందుకొచ్చాయి. రూ.5 లక్షల స్థానంలో గడిచిన ఏడాదిగా రూ.10 లక్షల వరకు ఉచితంగా చికిత్సనందిస్తున్నాయి. మొత్తం 1,835 రకాల సేవలు అందుతున్నాయి. పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వం ఆర్నెల్ల కిందట ధరల్ని 20శాతం పెంచింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారితోపాటు ఆయుష్మాన్ భారత్ కార్డులున్నవారికి ఈ సేవల్ని వర్తింపజేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

ఎలాంటి ఇబ్బంది రాకుండా సేవలందుతున్నాయి. అన్ని ఆస్పత్రుల్లో సేవల్ని ప్రత్యేకంగా పరిశీలించాం. కరీంనగర్‌లో కొత్త రోగులు కూడా ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇటీవల కాలంలో శస్త్రచికిత్సల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వం సేవల పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ పెంచుతోంది.

ఏ.విజయ్‌కుమార్, ఆరోగ్యశ్రీ మేనేజర్, ఉమ్మడి జిల్లా

**చెల్లిస్తేనే మేలు**

పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తేనే మాకు మేలు జరుగుతుంది. ఇప్పటి వరకు అందించిన సేవల్లో దాదాపుగా 85 శాతం బకాయిలు రావాల్సి ఉంది. శస్త్రచికిత్సల్లో వినియోగించే పరికరాల ధరలు పెరిగాయి. ఎప్పటికప్పుడు చెల్లిస్తే మాకు కూడా పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు వెసులుబాటు ఉంటుంది.

డాక్టర్, నరహరి, ఎముకల వైద్య నిపుణులు, జగిత్యాల

# అంతంత మాత్రంగానే ఎల్ఆర్ఎస్



కరీంనగర్ : జిల్లాలోని పంచాయతీలు, పురపాలికలు, పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు(ఎల్ఆర్ఎస్) పరిష్కార ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రెండు నెలలుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కారణంగా ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగించడంతో ఈ వైపు చూసే వారు కరవయ్యారు. ఖాళీ స్థలాలను పరిశీలన చేసి సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన వారు ఆసక్తి చూపించడం లేదు. పట్టణ ప్రణాళిక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అర్జీదారులకు ఫోన్లు చేసి స్థలాలు చూపించాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదు. సంక్షిప్త సమాచారం ద్వారా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరించుకోవాలని, డాక్యుమెంట్లు నమోదు చేయాలని సూచించినా ఫలితం లేకుండా పోతుంది. మరో వైపు ఆసక్తి ఉన్న వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండటంలేదు. నగరంతోపాటు తిమ్మాపూర్, కొత్తపల్లి, కరీంనగర్ గ్రామీణ మండలాల నుంచి అధిక దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు సుమారు 2 వేల అర్జీలను పరిశీలించారు. అన్ని సవ్యంగా ఉన్న వాటికి ఫీజు చెల్లించాలని సమాచారం ఇస్తుండగా సగం మంది మొగ్గు చూపడం లేదు.

**మూడు శాఖల అనుమతి రావాల్సిందే..**

ఎల్ఆర్ఎస్‌కు ప్రయత్నిస్తే మూడు శాఖల అనుమతి కోసం వేచి చూడాల్సి వస్తోంది. కార్పొరేషన్, పురపాలికల్లో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, నీటి పారుదల శాఖ విభాగాల పరిశీలన తప్పనిసరిగా మారింది. టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఆ స్థలం వివాదాస్పదంగా ఉందా? కేసులు ఉన్నాయా? ప్రభుత్వానిదా? ప్రైవేటుదా నిర్ధారించాలి. ఇరిగేషన్ ఉద్యోగులు క్రమబద్ధీకరించే స్థలం చెరువులు, డ్యాంలు, నీటి పారుదలకు సంబంధించినవేనా? కాదా చూస్తున్నారు. ఆ శాఖలన్నీ తిరిగి వచ్చే సరికి 15 రోజుల సమయం పడుతుంది.

**నిషేధిత స్థలాలపై నిర్ణయమేదీ?**

నగరంతోపాటు పురపాలికలు, పంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసిన స్థలాలు నిషేధిత జాబితాలో ఉన్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోనే 9,467, పంచాయతీల్లో 341, పురపాలికల్లో 1,956, సుడా పరిధిలో 2,770 అర్జీలు పక్కన పెట్టారు. నగరంలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం కూడా నిషేధిత జాబితాలో చేరింది. అక్కడ చెరువులు, కుంటలు లేకపోగా అబాది ఉన్న చోట ఇలాంటి పరిస్థితి ఎదురుకావడంతో చివరకు ఎల్ఆర్ఎస్ వద్దనే పరిస్థితి వచ్చింది. ఒక సర్వే నంబర్‌లో ఏ ఒక్క చోట అయినా కోర్టు కేసు ఉన్నా నిషేధిత జాబితాలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అర్జీదారు రిజిస్ట్రేషన్ శాఖకు వెళ్లి రాతపూర్వకంగా దరఖాస్తు చేస్తే అందుల్లోంచి తీసి వేస్తారని చెబుతుండగా, అక్కడి వరకు ఎందుకు వెళ్లాలనే ఆలోచనలో కొందరు ఉన్నారు.

# రచనలతో సామాజిక చైతన్యం



సిరిసిల్ల : సామాజిక, వర్ధమాన అంశాలే కథా వస్తువులుగా సిరిసిల్లకు చెందిన పలువురు కవులు, కవయిత్రులు రచనలు చేస్తున్నారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న అంశాలు, మనుషులు, వారి స్వభావాలు తదితర అంశాలపై రచనలు చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

**వచన కవిత్వంతో... ఎలగొండ రవి**

సిరిసిల్లకు చెందిన ఎలగొండ రవి తన రచనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పదో తరగతి వరకు సిరిసిల్లలోని యూపీఎస్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లో డిప్లొమా, డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం సిరిసిల్లలోని గీతానగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సామాజిక, వర్ధమాన అంశాలపై వచన కవిత్వం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. చలం, తిలక్ రచనలు తనను ఎక్కువగా ప్రభావితం చేశాయని చెబుతారు రవి. కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం, బీఎస్ రాములు పురస్కారం అందుకున్నారు. ఖడ్గధార, సముద్రం, 'జీవితం పియానో మెట్ల మీద' అనే పుస్తకాలు రచించారు.

**గేయ రచయిత్రిగా...**సుమన చక్రవర్తి

సిరిసిల్లకు చెందిన కూన సుమన చక్రవర్తి బీటెక్ పూర్తి చేశారు. భర్త వీరవేణి మధు ఆర్మీలో పని చేస్తారు. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్న సుమన బీటెక్ చదివే రోజుల్లోనే పుస్తకాలు రచించడం ప్రారంభించారు. నాలోని భావం, వరంగల్ కవయిత్రులు, కవితా మేఘమాల పుస్తకాలు రాశారు. 2021 సంవత్సరంలో ప్రపంచ మహిళా తెలుగు కవిత మహోత్సవంలో 250 కవయిత్రులతో కలిసి పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. వంశీ గ్లోబల్ పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకున్నారు. ఓవైపు రచనలు, యూట్యూబ్‌లోని ఆల్బమ్‌లకు గేయ రచయిత్రిగా పని చేస్తూనే సామాజిక సేవలోనూ ముందుంటున్నారు.

**పుస్తకాలు చదువుతూ... సుంక ధరణి**

సిరిసిల్లకు చెందిన సుంక ధరణి పుస్తకాలు చదువుతూ, రచనలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఆమె తల్లి సుంక లత బీడీలు చుడుతారు. తండ్రి నర్సయ్య మరమగ్గాల కార్మికుడు. ధరణికి చిన్నతనం నుంచే సాహిత్యం, పుస్తక పఠనంపై అభిరుచి ఎక్కువ. శ్రీశ్రీ మహాప్రస్థానం, డా.సి.నారాయణరెడ్డి విశ్వంభర పుస్తకాలే తన రచనలకు స్ఫూర్తి అని చెబుతున్నారు. అప్పటివరకు కవిత్వాలు, రచనలు చేస్తున్న ధరణి ఓసారి కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవిత్వం పోటీల్లో విజయం సాధించడంతో పుస్తక రచనపై ఆసక్తి కలిగింది. అలా 'అరుణిమలు' అనే పుస్తకాన్ని రాసి అందరి ప్రశంసలు అందుకున్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేసే రచనలు చేస్తున్నారు.

## యాసంగి సజావుగా 'సాగే'నా!

పెద్దపల్లి : నీటి లభ్యత కలిగిన ప్రాంతాల్లో యాసంగి వరి నాట్లు జోరందుకున్నాయి. బావులు, చెరువులతో పాటు కాలువ ఆధారంగా రైతులు సాగు చేస్తున్నారు. యాసంగిలో నీటి విడుదలపై అధికారులు హామీ ఇవ్వడంతో సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కాలువల డ్రాపులు, తూములు దెబ్బతినడంతో నీరంతా వృథాగా పోతోంది. కాలువ చివరి ఆయకట్టుకు నీటిని అందించేందుకు అధికారుల వద్ద సరైన ప్రణాళిక లేకపోయింది.

**దిగువకు తగ్గిన ప్రవాహ వేగం**

ఎలిగేడు మండలంలో ఎస్సారెస్పీ డీ86 ప్రధాన కాల్వ డ్రాపులు, తూములు ధ్వంసమయ్యాయి. శివపల్లి సమీపంలో డ్రాప్ పాడయి ప్రవాహ వేగం తగ్గింది. శివపల్లి, లాలపల్లి, నర్సాపూర్, సుల్తానాబాద్ మండలం పూసాల, నారాయణపూర్ గ్రామాలకు నీరందకపోగా దిగువ ప్రాంతాలైన సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు వేగంగా వెళ్లడం లేదు. పలు గ్రామాలకు వెళ్లే కాలువ తూములు ధ్వంసమవడంతో పాటు కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది.

**షట్టర్లు లేక నీటి వృథా**

మండలంలోని 22 గ్రామాల పరిధిలో ఎస్సారెస్పీ ఆధారంగా 17 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. ఏటా



చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పూడిక చేరడంతో ప్రధాన, ఉపకాలువలు చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. ప్రధాన కాలువ నుంచి ఉప కాలువకు నీటి విడుదల సమయంలో తూములకు షట్టర్లు లేక నీరంతా వృథాగా పోతోంది. ప్రధాన కాలువతో పాటు మైనర్, సబ్ మైనర్ కాలువలను మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

**దెబ్బతిన్న సీసీ నిర్మాణాలు**

ఇప్పలపల్లి వద్ద డీ 86 పరిధిలోని 56 ఎల్ఆర్ కాలువకు సీసీ దెబ్బతింది. కాలువలో పిచ్చి మొక్కలు, పూడిక నిండి నీరు పారడం లేదు. గతేడాది నీరందక పంటలు ఎండిపోయాయి. ఈ యాసంగిలోనైనా మరమ్మతులు చేయకుంటే అదే పరిస్థితి ఎదరవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సొంత డబ్బుతో పూడిక తొలగింపు**

పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట ప్రాంతంలో డీ-83 కాలువకు పలు చోట్ల తూములు దెబ్బతిన్నాయి. పట్టణం మీదుగా వెళ్లే 22-ఆర్ కాలువ సైఫన్ వద్ద రైతులే సొంత డబ్బుతో పూడిక తొలగించారు. పెద్దకల్వల, కొత్తపల్లి, నిట్టూరు వద్ద పలు చోట్ల కాలువలు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులు చేపట్టకపోవడంతో దిగువ ప్రాంతాలకు నీరు వెళ్లే పరిస్థితి లేదు.

**దెబ్బతిన్న చోట చేశాం..**

డి-83 కాలువ పరిధిలో కాలువలు బాగానే ఉన్నాయి. అక్కడక్కడ చిన్న చిన్న ఇబ్బందులున్నాయి. కాలువలు పెద్దగా దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేశాం.

కె.శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ

## పనుల్లో వేగంతో గడువులోగా పూర్తి

పెద్దపల్లి : పల్లెల్లో బురద దారులు, గుంతల రోడ్లకు కాలం చెల్లనుంది. శాశ్వత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధిహామీ నిధులు కేటాయించింది. సిమెంట్ రోడ్లు, పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది కూలీల నిష్పత్తి ఆధారంగా రూ.27.77 కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత పనులు మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంది. ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రతి సంవత్సరం నిధులు మంజూరైన తర్వాత పనులు చేయడానికి గడువు స్వల్పంగా ఉంటోంది. ఈసారి రెండు నెలలకు పైగా ఉండటంతో వేగం పెంచితే ప్రగతి సాకారం కానుంది.



**రూ.6.17 కోట్లతో సిమెంట్ రోడ్లు**

జిల్లాలో రూ.6.17 కోట్లతో 104 ప్రాంతాల్లో సిమెంటు రహదారులు నిర్మించనున్నారు. స్థానిక ఎమ్మెల్యేల ఆమోదంతో పనుల ఎంపిక పూర్తయింది. పాలకుర్తి 10, అంతర్గాం 7, ఎలిగేడు 8, జూలపల్లి 8, శ్రీరాంపూర్ 10, ఓదెల 11, పెద్దపల్లి 15, సుల్తానాబాద్ 12, ధర్మారం 12, మంథని 2, ముత్తారం 2, కమాన్‌పూర్ 3, రామగిరి 4 చొప్పున పనులు ఎంపిక చేశారు. గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనుల ఎంపికలో ప్రాధాన్యం కల్పించారు.

**6 పంచాయతీలకు సొంత గూడు**

జిల్లాలో పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఆరుబయటే సభలు, సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది. ఇరుకు గదుల్లోనే కొనసాగించక తప్పడం లేదు. విలువైన దస్త్రాలకు భద్రత కరవైంది. అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో, అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ధర్మారం మండలం లంబాడితండా, పాలకుర్తి మండలం లంబాడితండా, ఓదెల మండలం బాయమ్మపల్లి, ముత్తారం మండలం పారుపల్లి, పెద్దపల్లి మండలం రాంపెల్లి, కాల్వశ్రీరాంపూర్ మండల అంకంపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో చోట రూ.12 లక్షలతో 17 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మిస్తారు.

## ఎరువుల సరఫరాకు ఇబ్బంది..!

ఖమ్మం : మొన్నటివరకు డీఏపీ సక్రమంగా దొరక్క అన్నదాతలు అవస్థలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు సహకార సంఘాల్లో తప్ప ప్రైవేటు దుకాణాల్లో యూరియా అందుబాటులో లేక అగచాట్లు పడుతున్నారు. ఎరువులు కావాల్సిన తరుణంలో ఖమ్మం జిల్లా కేంద్రానికి రావాల్సిన రైలు వ్యాగన్లు శనివారం (నేటి) నుంచి నిలిచిపోతున్నాయి. **ఇక పందిళ్లపల్లి స్టేషన్ నుంచే..**

రైల్వేశాఖ గతేడాది మూడో లైన్ నిర్మాణ పనులు చేపట్టింది. ఇవి ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి కొనసాగుతున్నాయి. ఎరువుల వ్యాగన్లు దిగుమతి అయ్యే ప్లాట్‌ఫాం గూడ్సు షెడ్డును మూడో లైనుకు అనుసంధానించి పనులు చేపట్టారు. ఇకపై ఖమ్మం వచ్చే గూడ్సు వ్యాగన్ల ఎగుమతులు, దిగుమతులన్నీ పందిళ్లపల్లి స్టేషన్‌లో జరుగుతాయని రైల్వేశాఖ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు.

**నెల రోజుల పాటు అవస్థలు..**

వివిధ ఎరువుల కంపెనీలు ఖమ్మం జిల్లాకు వ్యాగన్ల ద్వారా సరకు తీసుకొస్తుంటాయి. సరకు దిగుమతులు, ఎగుమతులతో పాటు లారీల ద్వారా రవాణా చేసేందుకు హమాలీలు హ్యాండ్లింగ్ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకుంటారు. ఏటా టెండర్లు పిలిచి జిల్లా పరిధిలోని గోదాములు, ఇతర మండలాల గ్రామాల్లోని డీలర్ల పాయింట్లకు చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంటారు. అయితే ఖమ్మం రైల్వేస్టేషన్ గూడ్సు షెడ్ నుంచి ఈపనులు చేయటానికి గతంలో సదరు ఎరువుల కంపెనీలు కాంట్రాక్టు ఇచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం హమాలీలు, కాంట్రాక్టర్లు పందిళ్లపల్లి స్టేషన్ గూడ్సు షెడ్ నుంచి రవాణా చేసేందుకు ముందుకురావటం లేదని ఎరువుల



కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఎరువులు పంపిణీ చేసేందుకు మళ్లీ కొత్తగా హమాలీ, హ్యాండ్లింగ్ రవాణా కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తవటానికి కనీసం నెల రోజుల సమయం పడుతుందని తెలిపారు. ఖమ్మం గాంధీచౌక్ పరిసర ప్రాంతాల్లో పోలీసుశాఖ నుంచి ట్రాఫిక్ ఆంక్షలున్నాయి. దీనికి తోడు ఖమ్మం స్టేషన్‌కు వ్యాగన్లు ఆగిపోవటం వల్ల జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశముందని, తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే వరకు నెలరోజులు వెసులుబాటు కల్పించాలని రైల్వేశాఖను కోరుతున్నారు.

**పెరగనున్న లారీ కిరాయిల భారం..**

మూలిగే నక్కపై తాటిపండు పడినట్టుగా అన్నదాతల పరిస్థితి తయారైంది. ఇప్పటికే పెరిగిన ఎరువుల ధరల భారం మోయలేక సతమతమవుతుంటే, గూడ్సు షెడ్ ఖమ్మం నుంచి పందిళ్లపల్లికి మార్చటంతో లారీ కిరాయిలు పెరిగే అవకాశముంది. ఖమ్మం నుంచి పందిళ్లపల్లి గూడ్సు షెడ్ 3కి.మీ.దూరం ఉంటుంది. అక్కడి నుంచి గోదాములు, డీలర్ పాయింట్లకు రవాణా చేసేందుకు లారీ కిరాయిలు అనివార్యంగా పెరుగుతాయి. ఈ భారం వినియోగదారులు భరించక తప్పదని లారీ యజమానులు చెబుతున్నారు. ఇప్పటికే 15 రోజుల నుంచి జిల్లాకు యూరియా వ్యాగన్లు రావటం లేదు. ఇప్పుడు ప్లాట్‌ఫాం సమస్యతో ఎరువుల కొరత ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి.

## పర్యావరణం హితం కోరి..

నల్గొండ : మనిషి జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విడదీయలేని బంధంగా మారింది. తక్కువ ఖర్చుతో పాటు సులభంగా అన్ని అవసరాలకు ఉపయోగపడేవి కావడంతో ప్రతి ఒక్కరూ వీటిపై ఆధారపడుతున్నారు. తక్కువ మైక్రాన్‌తో తయారు చేసిన ప్లాస్టిక్ ప్లేట్లు, టీ కప్పులు, క్యారీబ్యాగులు, మంచినీటి సీసాలు, మార్కెట్‌లో విచ్చలవిడి అమ్మకాలు జరుగుతున్నాయి. నిత్యం హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లలో జరిగే శుభ, అశుభ కార్యక్రమాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే చిన్నపాటి కార్యాలకు ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగింది. దీని మూలంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి గ్రామానికి చెందిన నెర్మటి లక్ష్మి భర్త రవీందర్‌రెడ్డితో కలిసి ఆర్టీసీ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ ఇద్దరు ఆడపిల్లలను బీటెక్ చదివిస్తోంది. కుటుంబ పోషణ కోసం సంప్రదాయ విస్తరాకుల అమ్మకాలు చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తుంది. పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పూర్తి చేసి అడ్డాకులు, మోదుగు ఆకులు ఉపయోగిస్తూ భూమిలో కలిసి పోయే అట్టముక్కలతో




విస్తర్లు తయారు చేస్తున్నారు. దీంతోపాటు పలువురికి వీటి వాడకం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నారు.

**ఏపీ నుంచి దిగుమతి.. నెర్మట లక్ష్మి**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుంచి అడ్డాకులు, మోదుగు ఆకులను దిగుమతి చేసుకుని విస్తరాకులు తయారు చేస్తున్నాం. ఇక్కడి నుంచి హైదరాబాద్, రాజమహేంద్రవరం, గుంటూరు, తెనాలి, విజయవాడకు ఆర్డర్లపై ఎగుమతి చేస్తున్నాం. భోజన ప్లేటుపై రూపాయి, టిఫిన్‌ప్లేట్లపై రూ.50పైసలు లాభం వస్తోంది. **క్యాన్సర్లు తగ్గుతాయి: డా. వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో**కెమికల్‌తో తయారు చేసిన విస్తరాకులు ఇతర ప్లేట్ల మూలంగా క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు ఇవి భూమిలో కరగకపో వడం మూలంగా ఇతర సమస్యలు తలెత్తుతాయి. మొక్కల ఆకులతో పాటు భూమిలో కరిగే పేపర్ ద్వారా ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

# ధరణి వినతుల పరిష్కారంపై దృష్టి..!

ఎనిమిదేళ్లుగా భూ సమస్యలతో సతమతమవుతున్న రైతుల ఇబ్బందులు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపడుతోంది. కొత్తగా భూభారతి చట్టం(ఆర్వోఆర్)-24కు రూపకల్పన చేసింది. గతంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల అధికార, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గతంలో ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు వెలుగు చూశాయి. కొత్త చట్టం రూపకల్పన నేపథ్యంలో రైతులు తమ పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయనే ఉద్దేశంతో ఇటీవల అర్జీలు సమర్పించడం లేదు. గతంలో రోజుకు 100 వరకు దరఖాస్తులు వస్తే కొత్త చట్టం రూపకల్పన ప్రకటన తర్వాత పదుల సంఖ్యలోనే వస్తున్నాయి. కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకు ప్రత్యేక దృష్టి ధరణి పోర్టల్‌లో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు పాలనాధికారి(రెవెన్యూ), కలెక్టర్‌లకు లాగిన్ సౌకర్యం కల్పించి సమస్యలు పరిష్కరించే బాధ్యతలు



అప్పగించారు. మరో వారంలో ధరణి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. డిజిటల్ పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పేరు మార్పిడితో పాటు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో సమస్యలను ఒకటిరెండు రోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. గతంలో వీటికి నెల నుంచి రెండు నెలల సమయం పట్టేది. ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని మూడు జిల్లాల పాలనాధికారులు చెబుతున్నారు. గురువారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,064 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకరోజులో మొత్తం 130 దరఖాస్తులు రాగా ఇందులో 96 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# పల్లెల్లో పనుల జాతర

చేగుంట: రైతులకు సంబంధించిన పనులు చేపట్టేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సన్నద్ధమైంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేయనున్నారు. 'పనుల జాతర' పేరిట ప్రణాళిక సిద్ధం చేశారు. మార్చి చివరిలోగా వీటిని పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రైతులకు జల సంరక్షణ పనులతో పాటు కర్షకుల పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలిబాటలను బాగు చేసేందుకు నిర్ణయించారు.

**అన్ని మండలాల్లో..**జిల్లాలోని 21 మండలాల్లో 493 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు దుబ్బాక, గజ్వేల్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాలకు చెందిన పలు మండలాలు ఉన్నాయి. అన్నింటికీ జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి 31లోగా పనులు పూర్తి అయ్యేలా చేపడుతున్నారు.

**రైతులకు ఎంతో మేలు - శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో**

పనుల జాతర వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మూడు నెలల్లో పూర్తిచేసి వినియోగించే విధంగా చూస్తున్నాం. ఇందుకోసం గ్రామాల్లో పనులు కూడా గుర్తించాం. పెద్ద ఎత్తున నిధులు ఉండటంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగే ఆస్కారం ఉంది.

**ఉపయోగపడే పనులు**

రైతులకు ఉపయోగపడే పనులు ఇందులో చేపడుతున్నారు. ముఖ్యంగా పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, వర్మీ కంపోస్టు తయారీ పనులు, నాడెపు కంపోస్టు పిట్, అజోల తయారీ యూనిట్, ఇంకుడు గుంతలు, జలనిధి ద్వారా చెక్‌డ్యాంల నిర్మాణం, వ్యవసాయ బావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీదారులు, గతంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన రోడ్లపై మట్టిని వేయటం వంటివి చేపట్టనున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా పొలాల వద్దకు ఉన్న కాలిబాటలను అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. చేపట్టే ప్రతి పని కూడా పూర్తిగా రైతులకు ఉపయోగపడే విధంగా ఉండటంవల్ల వారు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పనులు గుర్తించే విధంగా అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. నిధులు పుష్కలంగా ఉండటంతో త్వరితగతిన పూర్తిచేసి మేలు చేసే విధంగా చూస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఒక్కో పనిని పూర్తిచేశారు.

# నవీన విద్యకు నవోదయ దారి

కాగజ్‌నగర్: మేటి సంస్థల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌లో చదవాలనుందా.. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదా.. అయితే ఆరు నుంచి ప్లస్ టూ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం జవహర్ నవోదయ విద్యాలయాలు కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు కలిపి కాగజ్‌నగర్‌లో నవోదయ విద్యాలయం ఉంది. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 80 సీట్లలో చేరేందుకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 24 పరీక్ష కేంద్రాల్లో 5,191 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనుంది.

**ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు**

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో నవోదయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చు. నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి హాల్‌టికెట్ పొందవచ్చు. పరీక్షకు సంబంధించిన మెటీరియల్, పాత ప్రశ్నపత్రాలు సైతం అందుబాటులో ఉంటాయి.

చదవాల్సినవి.. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు గంటల పాటు పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్ విభాగాల నుంచి 100 మార్కులకు గానూ 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. వీటికి 50 మార్కులు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్టుల్లో ఒక్కో దానికి 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో విభాగానికి 25 మార్కులు కేటాయించారు. మెంటల్ ఎబిలిటీ టెస్టుకు గంట సమయం. అర్థమెటిక్, లాంగ్వేజ్ టెస్టుకు అరగంట చొప్పున సమయం కేటాయించారు.

చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ విద్యాలయంలో చదువుతోపాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవాటు పడేలా స్కౌట్స్, ఎన్‌సీసీ నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది

# రికార్డుల వజీర్... ప్రేమ్ నజీర్ - జనవరి 16... ప్రపంచ రికార్డుల సృష్టి కర్త ప్రేమ్ నజీర్ వర్ధంతి



సినిమాల్లో అవకాశాలు రావడం కోరుకున్న, ప్రయత్నించిన అందరికీ అసాధ్యం. కొందరికే సుసాధ్యం. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని, సినీ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుని, కలకాలం మనుగడ సాగించడం అతి తక్కువ మంది అదృష్ట వంతులు మాత్రమే పొందే వరం. అలా మనుగడ సాగిస్తూ, చిత్రసీమలో అగ్రస్థానంలో కొన సాగడం, తద్వారా పేరు ప్రతిష్టలు గడించడం నూటికో కోటికో ఒక్కరికి మాత్రమే లభించే అరుదైన గౌరవం. అలాంటి అదృష్ట వంతులు, లబ్ధ ప్రతుష్టులలో అగ్ర భాగాన నిలుస్తారు ప్రేమ్ నజీర్. సినీ చరిత్రలో పలుదైన రికార్డులు సొంతం చేసుకున్న ఘనత ప్రతిభా శాలి నజీర్ కే దక్కింది. ఆయన రికార్డుల గురించి తెలుసు కుంటే అవి నమ్మశక్యం కానట్లు అనిపిస్తాయి. అయినా ఆ రికార్డులు మామూలు రికార్డులుగా కాకుండా ప్రపంచ రికార్డులుగా నమోదు కావడం, గిన్నీస్ బుక్ లో నమోదు కావడం నజీర్ గొప్పతనం, ఆయనకే సాధ్యం, సొంతం. అత్యధిక చలనచిత్రాలలో (725 సినిమాలలో) కథానాయకుని పాత్ర ధరించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఒకే నటి (శీల)తో 107 సినిమాలలో కలిసి నటించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఒకే ఏడాది (1979)లో అత్యధిక సినిమాలలో అనగా 39 సినిమాలలో ప్రధాన పాత్రలో నటించారు. అత్యధికంగా 89 మంది హీరోయిన్లతో కలిసి పనిచేశారు. మలయాళ చిత్రాలలో అత్యధికంగా 33 సినిమాలలో ద్విపాత్రాభినయం చేశారు. ఆయన రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులను సృష్టించారు. మొదటిది 725 సినిమాలలో నాయకునిగా నటించడం. అయితే రెండవ రికార్డు ఒకే నటి (షీలా)తో కలసి 130 సినిమాలలో నటించడం. భారత ప్రభుత్వం ఆయన కళారంగానికి చేసిన సేవలను గుర్తించి, "పద్మభూషణ్, పద్మశ్రీ" పురస్కారాలతో సత్కరించింది. ప్రేమ్ నజీర్ (అసలు పేరు అబ్దుల్ ఖాదర్) (07 ఏప్రిల్ 1926 - 16 జనవరి 1989) ఎవర్ గ్రీన్ హీరో రంగస్థల నటుడిగా మొదలై 1952లో తొలి సినిమాలో నటించి మూడు దశాబ్దాలకు పైగా మలయాళ సినిమాలలో నటించారు. ప్రేమ్ నజీర్ ట్రావన్కోర్ సంస్థానం (ప్రస్తుతం కేరళ రాష్ట్రం)లోని చిరయింకీళు గ్రామంలో అక్కోడ్ షాహుల్ హమీద్, ఆస్మా బీవీ దంపతులకు 1926, ఏప్రిల్ 7వ తేదీన జన్మించారు. సాధారణ విద్యను కడినంకులం లోయర్ ప్రైమరీ స్కూల్, శ్రీ చితిరవిలాసం స్కూల్, ఎస్.డి కాలేజ్ ఆలప్పుళా, సెయింట్ బెర్చ్‌మన్స్ కాలేజ్ చంగనస్సేరి లలో చదివారు. విద్య పూర్తి అయ్యే సమయానికి గొప్ప రంగస్థల నటుడిగా పేరు సంపాదించారు. అయన రెండవ సినిమా తీసే సమయంలో ఆ సినిమా దర్శకుడు తిక్కురుసి సుకుమారన్ నాయర్... ఆయన పేరును ''అబ్దుల్ ఖాదర్'' నుండి ''ప్రేమ్ నజీర్''గా మార్చారు. ఎస్.బి.కాలోజీలో విద్యార్థిగా ఉన్నప్పుడు 1951లో తొలి సారి ది మర్చెంట్ ఆఫ్ వెనీస్ నాటకంలో "షైలాక్" పాత్రను నటించడంతో నట జీవితాన్ని ప్రారంభించారు. ఆ పాత్రకు అతనికి ఉత్తమ నటుడు అవార్డు లభించింది. నజీర్ తొలి సినిమా మారుమకళ్ 1952లో విడుదలయ్యింది. 1950లోనే త్యాగసీమ అనే సినిమాలో పనిచేశారు కానీ ఆ సినిమా విడుదలకు నోచుకోలేదు. తమ జీవితంలో మొత్తం 700కు పైగా మలయాళ చిత్రాలు, 55 తమిళ చిత్రాలు, 7 తెలుగు చిత్రాలు, 2 కన్నడ సినిమాలలో నటించారు. చివరి సినిమా ధ్వని 1988లో విడుదలయ్యింది. షీలా, జయభారతి, శారద, ఆడూర్ బాసీ, జయన్, సుకుమారన్, సోమన్, మోహన్, మోహన్‌లాల్ వంటి నటీనటులతో కలిసి పనిచేశారు. హబీబా బీవీని వివాహం చేసుకాగా, ముగ్గురు కూతుళ్ళు, లైలా, రసియా, రీటా ఒక కుమారుడు షానవాజ్ కలిగారు. నజీర్ కుమారుడు షానవాజ్ కొన్ని మలయాళ సినిమాలలో నటించాడు కానీ తండ్రిలా రాణించలేక పోయాడు. షానవాజ్ కుమారుడు షమీర్ ఖాన్ కూడా సినిమా నటుడే. ప్రేమ్ నజీర్ తమ్ముడు ప్రేమ్ నవాజ్ (అబ్దుల్ వహాబ్), ఆయన కుమారుడు ప్రేమ్ కిషోర్‌లు కూడా సినిమాలలో నటించారు. వీరెవరూ ప్రేమ్ నజీర్ సినీ వారసత్వాన్ని కొనసాగించలేక పోయారు. ప్రేమ్ నజీర్ కొన్ని సినిమాలను నిర్మించారు కూడా. ఆయన మద్యానికి బహు దూరంగా ఉన్నారు. రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీలో చేరినా, ఎప్పుడూ ఎన్నికలలో నిలబడలేదు. సేవా దృక్పథం కలిగి ఎందరికో సహాయం చేశారు. ఆయన కేరళ 1981లో కేరళ రాష్ట్ర స్పెషల్ జ్యూరీ అవార్డును పొందారు. 1983లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మభూషణ్ అవార్డును స్వీకరించారు. 1985లో 33వ జాతీయ చలనచిత్ర పురస్కారాల కమిటీలో న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. నజీర్1989, జనవరి 16వ తేదీ మద్రాసులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మెలకువలు నేర్పించి.. సాగు విస్తీర్ణం పెంచి



ధారూర్: వనరులను సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులు సాదించేలా కృషి చేస్తోంది భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ. 2017లో ఫార్మర్ ఫస్ట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గట్టెపల్లి, గురుదోట్ల, రాంపూర్, అంపల్లిని దత్తత తీసుకున్నారు. అన్ని గ్రామాల్లో కలిపి 787 మంది రైతులను గుర్తించి సంఘాలుగా ఏర్పాటు చేశారు.

**అన్నదాతలకు అవగాహన..**

వ్యవసాయశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, నేల స్వభావాన్నిబట్టి సకాలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవడంతో పెట్టుబడులు తక్కువ కావడమే కాకుండా మంచి దిగుబడులు సాధించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించారు. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రారంభంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించారు. అందిపుచ్చుకున్న రైతులు గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ, కంది, పెసర, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు. కొందరు వారి పొలంలో పండించిన పంటనుంచే నాణ్యమైన విత్తనాలను సేకరించి సాగుచేస్తున్నారు. మరి కొందరు విపణుల్లో లభించే మేలైన విత్తనాలను తెచ్చుకొని పండిస్తున్నారు. సకాలంలో ఎరువులు, సస్యరక్షణ చర్యలు, క్రిమి సంహారక మందులను పిచికారీ చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

**ప్రస్తుతం సాగు ఇలా..**

రాంపూర్‌లో వానాకాలంలో 250 ఎకరాల్లో వరి, 270 ఎకరాల్లో పెసర, 100 ఎకరాల్లో కంది పంట, యాసంగిలో 300 ఎకరాల్లో వేరుశనగ పంట సాగుచేశారు. గట్టెపల్లిలో 500 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో పెసర, 50 ఎకరాల్లో కంది, 120 ఎకరాల్లో వేరుశనగ వేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అంపల్లి, గురుదోట్లలో 550 ఎకరాల్లో వరి, 110 ఎకరాల్లో పెసర, 100 ఎకరాల్లో కంది, 120 ఎకరాల్లో వేరుశనగ సాగైనట్లు అధికారులు తెలిపారు.

# పాఠ్యపుస్తకం.. కంప్యూటర్ శిక్షణ



హైదరాబాద్: కంప్యూటర్లు.. ల్యాప్‌టాప్‌లు... డిజిటల్ తెరలపై పాఠాలు చెబుతున్న ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. 'కోడింగ్' నేర్పిస్తున్నారు. కళాశాల స్థాయిలో నేర్చుకునే కోడింగ్‌ను ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నేర్పుతున్నారు. కామిక్ సిరీస్‌లు, కార్టూన్ నెట్‌వర్క్‌లలోని పాత్రలను వారితోనే తయారు చేయిస్తున్నారు. ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు సహకారం అందిస్తున్నాయి. ఆయా సంస్థలు ఎంపిక చేసిన పాఠశాలలకు డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లను ఉచితంగా ఇస్తుండగా... ఐటీ సంస్థల ఉద్యోగులు, యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెబుతున్నారు..

**సులువుగా అర్థం చేసుకునేలా...**

డెస్క్‌టాప్ కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఐప్యాడ్‌లను సులువుగా వినియోగించేలా... అందులోని సాంకేతిక పదాలు, భాషను అర్థం చేసుకునేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రోగ్రామ్‌లు ఎలా రూపొందించాలో ప్రయోగాత్మంగా వివరిస్తున్నారు. సర్కారు బడుల విద్యార్థుల ఇళ్లల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఉండవు. అందుకే విద్యార్థులకు చరవాణితో గేమ్‌లు రూపొందిస్తున్నారు. కొద్దిరోజులు వారిని గేమ్స్ ఆడించాక... మీరే సొంతంగా గేమ్స్ రూపొందించండి అంటూ విద్యార్థులకు చెబుతున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు తమకు నచ్చిన గేమ్‌ను తయారు చేసేందుకు కోడింగ్ ఉపయోగిస్తున్నారు. తొంభైశాతం మంది విద్యార్థులు కోడింగ్‌ను ఆడుతూపాడుతూ నేర్చుకుంటున్నారని కూకట్‌పల్లి, మహబూబియా ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతోపాటు కంప్యూటర్లు లేని పాఠశాలల్లో 'సింక్రోనీ' సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన కిట్ ద్వారా చార్టులతోనే కోడింగ్ నేర్పిస్తోంది.

సొంతంగా పేర్లు..కంప్యూటర్ గేమ్‌లో పాత్రధారులకు విద్యార్థులు సొంతంగా పేర్లు పెడుతున్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లభాషలకు సరిపోయేలా పేర్లను తయారు చేస్తున్నారు. శిక్షణతో పాటు వీరికి సమాచార నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కోడింగ్ నేర్చుకుంటున్నకొద్దీ విద్యార్థుల్లో వారికి తెలియకుండానే తార్కికజ్ఞానం పెరుగుతుంది. ఆటలు రూపొందించేటప్పుడు వారి ఆలోచన పరిధి విస్తృతమవుతోంది.

## పర్యవేక్షణ లేమి.. రేషన్ పక్కదారి

హైదరాబాద్: నగరంలో 6.39 లక్షల కార్డు దారులకు నిత్యావసర సరకులను నెల నెలా అందించే నగర పౌర సరఫరాల శాఖలో కీలక పోస్టులు భర్తీ చేయకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. నగరంలో 66 డీలర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రేషనింగ్ అధికారి (సీఆర్‌ఓ) పరిధిలో 18 మంది డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు ఉండగా ప్రస్తుతం తొమ్మిది మంది మాత్రమే విధుల్లో ఉన్నారు.60 మంది సీనియర్ చెకింగ్ ఇన్స్‌పెక్టర్లు ఉండాల్సి ఉండగా.. 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జూనియర్ ఎంక్వయిరీ ఇన్స్‌పెక్టర్లు 41 మంది ఉండాల్సి ఉండగా.. 22 మంది మాత్రమే ఉన్నారు.కీలకమైన పోస్టులతో పాటు పరిపాలనా పరంగా విధులు నిర్వహించే పలు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సీఆర్‌వో పరిధిలో గతంలో ఎప్పుడో నిర్ణయించిన ఉద్యోగుల సంఖ్యలోనూ భారీగా ఖాళీలు ఉన్నాయి.

# విలీన గ్రామాల ఆశలు ఆవిరి

గజ్వేల్ : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటి పరిధిలోని విలీన గ్రామాల్లో ఫేజ్-2 కింద చేపట్టాల్సిన యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు ఇప్పట్లో అయ్యేలా కనిపించటం లేదు. పాలకమండలి ప్రతిపాదించిన దాదాపు రూ.49 కోట్ల నిధులకు సబంధించి ఇప్పటిదాకా ఎలాంటి పురోగతి లేదు. ఈనెల 26 తో ప్రస్తుత మున్సిపాలిటీ పాలక మండలి పదవీకాలం ముగిసిపోతుండటంతో ఇక నిధుల కృషి , పనుల విషయం మరుగునపడినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 40 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించాలని ప్రతిపాదించారు. పనులు చేపట్ట లేదు.

2020లో పనుల ప్రారంభం

దోమలు, మురుగు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటిలో ఫేజ్-1 కింద 138 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయటంతో పాటు నాలుగు చోట్ల మురుగునీటి శుద్ధిప్లాంట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.99 కోట్ల అంచనా వ్యయంతో 2020లో పనులు ప్రారంభించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పట్టణాల పరిధిలో పనులు చేపట్టారు. కరోనా కారణంగా పనుల్లో జాప్యం నెలకొని పైపులైన్ల ఏర్పాటు పూర్తికాకపోవటం, చాలా చోట్ల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వకపోటంతో సమస్యకు కారణమైంది.



**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..- రాజమౌళి, మున్సిపాలిటీ చైర్మన్**

బల్దియా బాగు కోసం గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించటంతో అభివృద్ధి చేశాం. మిగిలిన పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. నిధులు మంజూరు అవుతాయని ఆశించాం. మరో రూ.50 కోట్లు కేటాయిస్తే పూర్తిస్థాయిలో యూజీడీ పనులు పూర్తవనున్నాయి.

**మురుగు తొలగించే యంత్రాలు కరవు**

చేసేదేమీలేక కొందరు ఇంటి యజమానులు సొంత ఖర్చుతో కనెక్షన్లు ఇచ్చుకుంటున్నారు. పట్టణంలో వైద్యుడు కుమారస్వామి రూ.10 వేలకుపైగా ఖర్చు చేసుకుని ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇప్పించుకోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల పైపులైన్ల నిర్మాణం ఎత్తుపల్లాల్లో ఉందని చెబుతున్నారు. విలీన గ్రామాలైన ముత్రాజ్‌పల్లి, గుండన్నపల్లి, క్యాసారం తదితర చోట్ల ఇంకా పనులు చేపట్టలేదు. మురుగు నిలిచినపుడు తొలగించే యంత్రాలు సైతం లేవు. మున్సిపాలిటీకి అన్నిరకాల పన్నులు చెల్లిస్తున్నా.. కాలనీల్లో సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియాలో జనాభా - 55000 నివాసాలు - 13500

అవసరమయ్యే యూజీడీ లైను - 180 కి.మీ.

చేపట్టింది - 130 కి.మీ.

# అతివలకు ఆర్థిక వెలుగులు

సంగారెడ్డి : విద్యుత్తు వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఇలా వినియోగిస్తూ పోతే భవిష్యత్తు తరాలకు మిగిలేది అంధకారమే. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా సౌర విద్యుత్తు ఉత్పత్తి దిశగా సాగుతోంది. 'సౌర' యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. తాజాగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద పొదుపు సంఘాల సభ్యులకు సౌర యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**సాగుకు యోగ్యం కాని భూముల్లో..**

గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూములు జిల్లాలో వందలాది ఎకరాలు ఉంటాయి. అలాంటి స్థలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే అక్కడా యూనిట్లు నెలకొల్పాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ భూమి రక్షించినట్లు అవుతుంది. ముందుకు వచ్చే మహిళా సంఘాల సభ్యులకు పీఎం కుసుమ్ యోజన కింద యూనిట్ నెలకొల్పేందుకు తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీ సదుపాయం ఉంటుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఎంపిక చేసిన మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించనున్నారు. స్త్రీనిధి, సెర్ప్, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. గ్రామైక్య సంఘం, మండల, జిల్లా సమాఖ్యల్లో నిధులు ఉంటే వాటి నుంచి కూడా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పిస్తారు. ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు రూ.4 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇందులో 10శాతం వాటాధనం పొదుపు సంఘం సభ్యులు చెల్లించాల్సి ఉంటుంది.

**విద్యుత్తు విక్రయంతో ఆదాయం**

సౌర విద్యుత్తు ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమీపంలోని ఉప కేంద్రానికి అనుసంధానం చేస్తారు. మెగావాట్ విద్యుత్తు యూనిట్ ఏర్పాటుతో నెలకు రూ.2.16లక్షల వరకు ఆదాయం సంపాదించేందుకు వీలుంటుంది. 25 సంవత్సరాల వరకు ఇది ఆదాయ వనరుగా ఉంటుంది. సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు సౌర విద్యుత్తు ప్లాంట్లపై కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని డీఆర్‌డీవో జంగారెడ్డి తెలిపారు.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695

మహిళా సంఘాలు: 18,213

వాటిలో సభ్యులు: 1.90లక్షలు

మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు అవసరమయ్యే భూమి: 4 ఎకరాలు

పెట్టుబడి వ్యయం: రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు

ఒక యూనిట్ ద్వారా నిత్యం విద్యుత్తు ఉత్పత్తి: 4వేల యూనిట్లు

నెలకు వచ్చే ఆదాయం: రూ.2.16 లక్షలు

# చెరువుల చుట్టూ నిర్మాణాలపై నజర్

హైదరాబాద్: గతంలో చెరువులు, నీటి కుంటలకు సమీపంలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రస్తుతం కొత్త నిర్మాణాలకు మాత్రం ఎన్వోసీలు ఉండాల్సిందేనని స్పష్టం చేస్తోంది. అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారు ఎన్వోసీల కోసం నీటిపారుదల శాఖ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్ ప్రకారం బఫర్‌జోన్‌కు దూరంగా 200 మీటర్లు ఆపై ఉంటే నిర్మాణాలకు గతంలో అనుమతులిచ్చింది. ఇదే




అదనుగా భారీ ఎత్తున అక్రమాలు సైతం జరిగాయి. కొన్నిసార్లు బఫర్‌జోన్‌లో ఉన్నప్పటికీ మాస్టర్‌ప్లాన్‌లో మాయ చేసి అప్పటి అధికారులు అనుమతులు ఇచ్చారు. చెరువులు, నీటి వనరులకు 200 మీటర్లలోపు నిర్మాణాల కోసం దరఖాస్తులు వస్తే నిశితంగా పరిశీలిస్తోంది. మాస్టర్‌ప్లాన్‌లో చెరువులు, నీటి వనరులు లేకపోయినా ఇరిగేషన్, రెవెన్యూ మ్యాపులను తెప్పించుకొని జాగ్రత్తగా హెచ్ఎండీఏ అధికారులు పరిశీలిస్తున్నారు.

# ఆస్తి పన్నులో కట్టలుగా లోపాలు

హైదరాబాద్: ప్రభుత్వానికి చేరాల్సిన ఆస్తిపన్ను వసూళ్లకు.. కింది స్థాయి అధికారులు భారీగా గండి కొట్టారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తిరిగి, వాస్తవ కొలతలు, వినియోగాన్ని నమోదు చేసుకుంటోన్న జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)తో ఆ విషయం స్పష్టమవుతోంది. ఇప్పటి వరకు సుమారు లక్ష ఇళ్లను బల్దియా సర్వే చేసింది. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా పన్ను చెల్లిస్తోన్న నిర్మాణాలు అనేకం లెక్క తేలాయి. వివరాల ప్రకారం.. ప్రధాన రహదారులపై ఈ ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి. నివాస కేటగిరీలో ఇంటి అనుమతి తీసుకుని, వ్యాపార కేంద్రాలుగా నడుస్తోన్న భవనాలకు సిబ్బంది



నామమాత్రంగా పన్ను విధించి, యజమానుల నుంచి నోట్ల కట్టలు తీసుకున్నారనే విమర్శలొస్తున్నాయి.

**5 కాలనీల్లో 100 శాతం పూర్తి..** జీఐఎస్ సర్వేలో మూడు దశలు ఉంటాయి. మొదటిది డ్రోన్ సర్వే. నగరం మొత్తాన్ని డ్రోన్ కెమెరాలు ఇప్పటికే చిత్రీకరించాయి. ఇంటింటికీ వెళ్లి.. ఇంటి నంబర్ల ఆధారంగా వివరాలను తీసుకోవడం రెండోది. మూడో దశలో..అన్ని ఇళ్లను ఫొటో తీసి.. వాటిని డ్రోన్లు చిత్రీకరించిన పటాలపై వాస్తవ విస్తీర్ణంలో చేర్చడం తరువాయి. మొదటి దశలో ఎప్పుడో పూర్తయింది. రెండోదశ పురోగతిలో ఉండగా.. చందానగర్, హయత్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని ఐదు కాలనీలు మూడో దశ వరకు సర్వే పూర్తి చేసుకున్నాయి.

పెరగనున్న డిమాండ్.. ఆస్తిపన్ను ద్వారా జీహెచ్ఎంసీకి ప్రస్తుతం ఏడాదికి రూ. 2వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీఐఎస్ సర్వే పూర్తయితే ఆదాయం రూ. 2500–2,800 కోట్లకు పెరుగుతుందనే అంచనాలున్నాయి. ప్రస్తుతం 2లక్షల ఇళ్లలోనే 100శాతం సర్వే జరిగిందని, మిగిలిన 23 లక్షల కట్టడాలను జీఐఎస్ మ్యాపింగ్ చేస్తే.. పన్ను మదింపులోని లోపాలు వెలుగులోకి వస్తాయి.

డ్రోన్ సర్వే పూర్తయిన పరిధి..650 చ.కి.మీ
ప్రయోగాత్మకంగా ఇంటింటి సర్వే మొదలైన వార్డులు.. 33
సమాచార సేకరణ 100శాతం పూర్తయిన కాలనీలు.. 5

# మెట్రోతో తగ్గేదెంత? పెరిగేదెంత?

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలంటే చాలా అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ట్రాఫిక్ అధ్యయనాలతోపాటూ ఫైనాన్షియల్ ఇంటర్నల్‌రేట్ ఆఫ్ రిటర్న్ (ఎఫ్ఐఆర్ఆర్), ఎకనమిక్‌రేట్ ఆఫ్ రిటర్న్(ఈఐఆర్ఆర్) వంటి అంశాలను లెక్కలోకి తీసుకుంటుంది. వీటన్నింటిని మదింపు చేశాకే మెట్రో డీపీఆర్‌లను ఆమోదించి.. ప్రాజెక్టుకు అనుమతి ఇస్తుంది.

**గణాంకాలు సానుకూలం!:** మెట్రోరైలు రెండోదశలోని ప్రతిపాదిత మార్గాల్లో ఎఫ్ఐఆర్ఆర్, ఈఐఆర్ఆర్ సానుకూలంగా ఉన్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్ఏఎంఎల్)కేంద్రానికి పంపిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 76.4 కి.మీ. ప్రాజెక్ట్‌పై రూ. 24,269 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు అభివృద్ధి చేస్తే ఏ మేరకు సంపద పెరుగుతుంది? ఎప్పుడు తిరిగి వస్తుంది? వంటి అంశాలను ఎఫ్ఐఆర్ఆర్‌లో మదింపు చేస్తారు. 8%పైన ఉంటే సానుకూలంగా ఉన్నట్లుగా పరిగణిస్తారు. విమానాశ్రయ కారిడార్‌లో 18.16% అత్యధికంగా, పాతబస్తీ కారిడార్‌లో 10.30% ఎఫ్ఐఆర్ఆర్ ఉంది. కాబట్టి కేంద్ర అనుమతిపై మెట్రో అధికారులు సానుకూలంగా ఉన్నారు.

**ఇంధనం, కాలుష్యం ఎంత తగ్గుతుంది?**

మెట్రో ప్రాజెక్ట్ చేపట్టడం ద్వారా ఏమేరకు ప్రయోజనం కలుగుతుందనేది ఈఐఆర్ఆర్ తెలియజేస్తుందని మెట్రో అధికారులు తెలిపారు. మెట్రోలో ప్రయాణాల ద్వారా ఎంత మేరకు ఇంధనం ఆదా అవుతుంది? కాలుష్యం ఏ మేరకుతగ్గుతుంది? రవాణా పరంగా ఆదా అయ్యే సమయం ఎంత? పెరిగే ఉత్పాదకత ఎంత? వంటి అంశాలను ఈఐఆర్ఆర్‌లో చూస్తారని అధికారులు చెప్పారు. నాగోల్–విమానాశ్రయ కారిడార్, మియాపూర్–పటాన్‌చెరు మార్గాలతో ఎక్కువ ప్రయోజనం ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

# అదనపు తరగతులు ఏదీ అల్పాహారం?



వికారాబాద్ : 'పది' ఫలితాల్లో వికారాబాద్ జిల్లా రెండేళ్లుగా అట్టడుగున నిలుస్తోంది. ఈసారి 'శత శాతం' ఫలితాలు సాధించి ఉన్నత స్థానంలో నిలవాలని జిల్లా విద్యాధికారులు ఆరంభం నుంచే దృష్టి సారించారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపించి అందరూ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గత నెలలో సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులు కూడా ప్రారంభించారు. కొద్ది రోజుల్లో ఉదయం పూట ప్రారంభం కానున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా వీరికి ఎలాంటి అల్పాహారం ఇవ్వడంలేదు. దీంతో విద్యార్థులు ఆకలితో నీరసించిపోతున్నారు. చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. ఈ పరిస్థితులకు సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

**గతేడాది అధికారుల చొరవ**

సాయంత్రం పాఠశాల నిర్ణీత వేళల తరువాత 45 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది అధికారుల చొరవతో నిత్యం ఒక రకం చొప్పున అల్పాహారం అందించారు. ప్రస్తుతం ప్రత్యేక తరగతులు ప్రారంభమై నెల రోజుల గడిచింది. అల్పాహారంపై ఎవరూ దృష్టి పెట్టలేదు. పరీక్షలు మార్చి రెండో వారం మొదలవుతాయి. తరగతులేమో మరో 2 నెలల పాటు సాగుతాయి. అప్పటిదాకా వీరి పరిస్థితి ఏమిటనేది ఎవరూ ప్రస్తావించడంలేదు.

చిరుధాన్యాల ఆహారం అందించాలి: నందిని, వికారాబాద్
విద్యార్థులకు చిరుధాన్యాల ఆహారం (చిక్కీలు, బిస్కెట్లు తదితరాలు) అందిస్తే బాగుంటుంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరుతాం. సాయంత్రం ఇంటికి వెళ్లే సరికి రాత్రవుతోంది. దీంతో నీరసం పెరిగిపోతోంది.

**మధ్యాహ్న భోజనమే ఆధారం**

జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సుమారుగా రెండు కి.మీ.దూరంలోని మారుమూల గ్రామాల నుంచి సైతం విద్యార్థులు ఉదయమే వస్తుంటారు. కొందరు ఖాళీ కడుపుతోనే బడికి వస్తున్నారు. మధ్యాహ్నం భోజనంపైనే ఆధారపడుతున్నారు.

**దాతలు చొరవ చూపాలి**

జిల్లాలోని పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాంటి దాతలు విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటుకు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో స్నాక్స్ ఏర్పాటు చేస్తే విద్యార్థుల ఆకలి తీర్చిన వారవుతారు. **సంక్రాంతి సెలవుల తర్వాత ఉండొచ్చు : రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి** విద్యార్థుల ఇబ్బందిని మేం కూడా గమనిస్తున్నాం. ప్రభుత్వమే సంక్రాంతి పండుగ తర్వాత స్నాక్స్ ఇచ్చే అవకాశం ఉంది. దాతల విషయంలో నిబంధనలున్నాయి. అనుమతి లేనిదే వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు వెళ్లటానికి వీలు లేదని కలెక్టర్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

# పరస్పర బదిలీలు.. జోరుగా బేరసారాలు



కరీంనగర్ : 317 జీవో నిబంధనల్లో పేర్కొన్న పరస్పర బదిలీలు కొందరు ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాన్ని తెచ్చిపెట్టేలా ఉన్నాయి. పక్క జిల్లాల్లో ఉన్న వారు సొంత, కోరుకున్న జిల్లాలుకు వచ్చేందుకు పరస్పర బదిలీలను ఉపయోగపడనున్నాయి. ఇద్దరు ఉపాధ్యాయుల సమ్మతితో జరిగే ఈ బదిలీల్లో స్థానిక జిల్లాలను వదులుకొని ఇతర జిల్లాలకు వెళ్లేందుకు, వారి స్థానంలో వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య బేరసారాలు జోరందుకున్నాయి. ఈనెల 30వ తేదీలోపు ఈ బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

**ఉద్యోగ విరమణ పొందే వారే..**

పరస్పర బదిలీల ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లేందుకు ఉద్యోగ విరమణ దగ్గర్లో ఉన్న వారే ఆసక్తి చూపుతున్నారు. వారి స్థానంలో ఇక్కడికి వచ్చే వారి మధ్యే ఇలాంటి బేరసారాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇక ముందు పదోన్నతి పొందలేమనే భావనలో ఉన్న కొందరు ఫిజికల్ డైరెక్టర్లు కూడా ఈ ప్రయోజనాన్ని పొందేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. భూపాలపల్లి జిల్లా నుంచి కరీంనగర్ జిల్లాకు వచ్చేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పనిచేస్తున్న వారు కూడా ఉత్సాహాన్ని చూపుతున్నారు. పరస్పర బదిలీపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వీడిపోయిన పక్క జిల్లాలకు వెళ్లేందుకు సమ్మతిగా ఉన్నట్లు పలువురు ఉపాధ్యాయులు వాట్సప్ గ్రూపుల్లో సందేశాలను పెడుతున్నారు.

**వాట్సాప్ గ్రూపుల వేదికగా...**

పరస్పర బదిలీల కోసం చరవాణుల్లో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని బదిలీపై వెళ్లే వారు పని చేస్తున్న పాఠశాల పేరు, కేటగిరీ, చరవాణి నంబర్లను పొందుపరుస్తున్నారు. ఏ జిల్లాలకు వెళ్లేందుకు సమ్మతిస్తున్నారో వాటి వివరాలను పొందుపరుస్తున్నారు. అవసరమైన ఉపాధ్యాయులు వారిని సంప్రదిస్తున్నారు. పరస్పర బదిలీల కోసం వారి మధ్య బేరసారాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి.

**కరీంనగర్ జిల్లాకు అధిక డిమాండ్..**

పరస్పర బదిలీల ద్వారా కరీంనగర్ జిల్లాకు వచ్చేందుకు అధిక డిమాండ్ ఉంది. రూ. 10 లక్షలు కూడా ఇవ్వడానికి కూడా వెనుకడటంలేదు. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారు రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారనే చర్చ ఉపాధ్యాయుల్లో నడుస్తోంది. హెచ్ఆర్ఏ సౌకర్యం గల పాఠశాలల వారు అంతకు మించి అడుగుతున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్న రూ. 5 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు అడుగుతున్నట్లు తెలిసింది. కాస్త మారుమూల ప్రాంతానికి వెళ్లే వారి మరింత ఎక్కువ అడుగుతున్నారు.

# ఎన్టీపీసీలో కొత్త దందా

గోదావరిఖని: రామగుండం ఎన్టీపీసీలో కొత్త దందాకు తెరతీశారు. ఒక్కో కాంట్రాక్టు ఉద్యోగానికి గతంలో భారీ మొత్తంలో వసూలు చేసి శాశ్వత లొకేషన్‌లలో పనులు కల్పించారు. తాజాగా కాంట్రాక్టు పూర్తవుతున్న ఓ ప్రైవేటు కంపెనీలో 29 మందిని నియమించుకోవడానికి రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన ప్రకియను పూర్తిచేసినట్లు తెలిసింది. కాగా మూడు నెలల్లో ఆ కంపెనీకి సంబంధించిన గడువు ముగియనుంది. ప్రస్తుతం మూడు నెలల తాత్కాలిక పనుల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి నియమిస్తున్నట్లు ఆరోపణలు మిన్నంటుతున్నాయి. తిరిగి ఇదే కంపెనీకి కాంట్రాక్టు పొడిగించడం ద్వారా వారిని శాశ్వతంగా అదే లొకేషన్‌లో కొనసాగించవచ్చని భావించిన ఓ అధికారి సదరు గుత్తేదారు కంపెనీకి చెందిన ఓ తాత్కాలిక ఉద్యోగితో కలిసి దందా చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సదరు అధికారి ప్రమేయంతో ఎన్టీపీసీలోని వివిధ లొకేషన్‌లలో గుత్తేదారులతో కుమ్మక్కై భారీగా కాంట్రాక్టు ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. గుత్తేదారులతో చేతులు కలిపి తన అక్రమ దందాను కొనసాగిస్తున్న ఆయన తాజాగా కొత్తగా 30 మందికి ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. వారికి సంబంధించిన వైద్య పరీక్షలు కూడా పూర్తి చేసినట్లు సమాచారం. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. కేవలం మూడు నెలల కోసం మాత్రమే వీరిని నియమిస్తున్నట్లు బయటకు ప్రచారం చేస్తున్నా దీనివెనుక భారీ మొత్తంలో ఉద్యోగ దందా సాగుతున్నట్లు సమాచారం. ఆ కంపెనీకి మూడు నెలల్లో కాంట్రాక్టు గడువు పొడిగించి మరి కొంత మందిని నియమించుకునేలా నిబంధనలు మార్చనున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రస్తుతం కొత్తగా నియమిస్తున్న వారికి శాశ్వత లొకేషన్‌లలో ఉద్యోగం పదిలంగా ఉంటుందన్నది వారి ఆలోచన.



**ఇష్టారీతిన నియామకాలు?**

ఎన్టీపీసీలో ఉద్యోగ నియామకాల దందా ఆగడం లేదు. కొత్తగా నిర్మించిన తెలంగాణ ప్రాజెక్టులో ఏర్పడుతున్న కొత్త లొకేషన్‌లలో ఇష్టం వచ్చిన రీతిలో కాంట్రాక్టు ఉద్యోగులను నియమిస్తున్నారు. ఉద్యోగాల నియామకాల్లో గుత్తేదారులతో పాటు కొందరు అధికారులు, సంస్థలోని ఓ నాయకుడి సమన్వయంతోనే ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి కాంట్రాక్టు ఉద్యోగానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలోనే దీనిపై ఎన్టీపీసీ విజిలెన్స్ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజా అంశాలపై దృష్టి సారించి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

# నిఘా కళ్లు.. ఉంటేనే మేలు

తాండూరు : జిల్లాలో నేరాల ఛేదన, భద్రతల పెంపులో పోలీసులు సీసీ కెమెరాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరంభంలో వీటి నిర్వహణ అన్నిచోట్ల బాగున్నా, తరువాత దారి తప్పసాగింది. దీన్నిమళ్లీ పట్టాలెక్కించడానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కథనం.

**2017లో నేను సైతం కార్యక్రమంతో శ్రీకారం**

దొంగలను పట్టుకోవడానికి, భద్రతను మెరుగుపర్చడానికి దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ వికారాబాద్ పోలీసులు 2017 ఆగస్టు 18న 'నేను సైతం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీన్లో భాగంగా కాలనీల్లోని ప్రజలు స్వయంగా డబ్బులు వసూలు చేసుకొని తమ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు వికారాబాద్ పురపాలిక పరిధిలో 550 ఏర్పాటు చేశారు.

**కొన్ని ఉదాహరణలు**

జూన్ 30న పరిగి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఐదిళ్లలో చోరీకి పాల్పడ్డారు. సీసీ టీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించి చోరీకి పాల్పడిన ముగ్గురు శికారి ముఠా సభ్యుల ముఖ చిత్రాలను గుర్తించి పట్టుకున్నారు. చోరీకి గురైన 70 గ్రాముల బంగారాన్ని జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తాండూరు పట్టణంలో నాలుగు మాసాల కిందట ఓ వ్యక్తి ఒకే తరహాలో ముగ్గురిని మట్టుబెట్టాడు. సీసీ కెమెరా ఆధారంగానే ధారూర్



మండలానికి చెందిన సైకో నిందితున్ని అరెస్టు చేశారు.

వికారాబాద్ మహాశక్తి చౌరస్తా సమీపంలో ఓ మహిళలను ద్విచక్ర వాహనం ఢీ కొంది. నిందితుడు పారిపోయాడు. రామయ్యగూడ రోడ్డులో ఈవ్ టీజింగ్‌కు గురైన యువతి తీవ్ర మనస్తాపం చెందింది. ఈ రెండు ఘటనల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిందితులను పోలీసులు గుర్తించలేదు.

సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం
అన్ని గ్రామాలు, కూడళ్లలో సీసీ కెమెరాలను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే దిశగా దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశాం. సీసీ కెమెరాల కోసం విరాళం ఇచ్చే దాతలను సత్కరిస్తున్నాం. ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు 6,300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇంకా ఏర్పాటు చేయిస్తున్నాం. వీటిలో 350 వరకు సాంకేతిక లోపంతో పని చేయడం లేదు. మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తెస్తాం. నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి.

# ప్లాట్లుగా ప్రభుత్వ భూములు

హైదరాబాద్: ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను కొందరు రియల్ వెంచర్ల ప్రతినిధులు ప్లాట్లుగా విభజించి విక్రయించేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి పది కిలోమీటర్ల దూరంలోని నాగిరెడ్డిపల్లిలో ఈ వ్యవహారం కొనసాగుతోంది. ఇప్పటికే మూడు వెంచర్లలో రూ. 30కోట్ల విలువైన సుమారు నాలుగు ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించారని స్థానికులు పంచాయతీ అధికారులకు గతనెలలో ఫిర్యాదు చేశారు.

నాలుగు వెంచర్లు.. ఉద్యానాలకు స్థలాలు.. మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లిలో కొందరు రియల్ వ్యాపారులు 15 ఏళ్ల క్రితం స్థానికుల నుంచి యాభై ఎకరాల పొలాలు కొన్నారు. కొన్నేళ్ల క్రితం వైట్‌ఫీల్డ్, పినాకిల్ ప్యారడైజ్, వాయు విహార్ పేర్లతో వెంచర్లు వేసేందుకు డీటీసీపీ



నుంచి అనుమతులు పొందారు. ఉద్యానాలు.. రహదారులకు పంచాయతీకి పదిశాతం బహుమతిగా ఇచ్చారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వే నంబర్లకు బై నంబర్లు వేయిస్తుండటంతో డబుల్ రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని వైట్‌ఫీల్డ్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డీపీవోకు కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు.

నాలుగెకరాలు పంచాయతీదే: లక్ష్మీనారాయణ, డివిజన్ పంచాయతీ అధికారి
వెంచర్లను పరిశీలించాం. సుమారు నాలుగు ఎకరాల భూమి గ్రామ పంచాయతీకి చెందినదే. రియల్ వెంచర్ల ప్రతినిధులను కార్యాలయానికి రమ్మని కబురు పంపినా వారు రాలేదు.

# రసాయన గరళం.. వాగు నీరు కలుషితం

మోమిన్‌పేట: మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి, మేకవనంపల్లి గ్రామాల శివారులోని రామేశ్వరాలయం పరివాహక ప్రాంతం గుండా దశాబ్దాలుగా పారుతున్న నందివాగు ఏనాడూ కలుషితమైన దాఖలాలు లేవు. అలాంటిది ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వర్థ్యాలను వదలడంతో స్వచ్ఛమైన నీరంతా ఎర్రగా మారింది. రామేశ్వరాలయం సమీపం నుంచి క్రషర్ వెళ్లే మార్గంలో వంతెన దగ్గర వ్యర్థ్యాలు కలిపినట్టు స్థానికులు గుర్తించి సోమవారం ఉదయం రెవెన్యూ అధికారులు, మోమిన్‌పేట ఠాణా పోలీసులకు సమాచారం అందించారు. ఠాణా ఎస్సై అరవింద్, ఆర్ఐ గోవర్ధన్ వాగు దగ్గరికి వెళ్లి పరిశీలించారు. వాగు మార్గంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. నీరు వాడకుండా రైతులను అప్రమత్తం చేశారు.

**వృక్ష రాజం.. స్వాగత తోరణం**

వికారాబాద్ అనంతగిరి కొండలు ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. ఇక్కడ కొలువైన అనంత పద్మనాభుని దర్శనానికి చేరుకోవడానికి ముందు రోడ్డుకు ఇరువైపులా స్వాగతం తెలిపే విధంగా ఏళ్లనాటి పెద్ద పెద్ద వృక్షాలు కనువిందు చేస్తాయి. ఇవి సుమారు 6 కిలో మీటర్ల దూరం మేర ఇలా రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్నాయి. వీటినుంచి వచ్చే చల్లటి గాలులను ఆస్వాదిస్తూ హాయిగా సాగుతూ భక్తులు స్వామిదర్శనం చేసుకుంటున్నారు.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

మద్దిపాడు : పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలన్న మహాత్ముని పలుకులను గత పాలకులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా గుంతల రహదారులు..దెబ్బతిన్న మురుగు కాలువలు..అపరిశుభ్రతతో నిండిన పరిసరాలతో పరిస్థితి దుర్భరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఇవన్నీ నందనవనాల్లా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పల్లె పండగ మొదలైంది. ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందుకోసం జిల్లాకు దాదాపు రూ.150 కోట్లు వెచ్చించి 1143 రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు 80 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

**తప్పిన అవస్థలు:** గతంలో ఏమాత్రం చిన్న వాన పడినా మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడేవారు. పాఠశాలలకు వెళ్లాలంటే దాదాపు అసాధ్యమే! ఈ నేపథ్యంలో పల్లె పండగలో భాగంగా పనులు చేపట్టి సంక్రాంతి నాటికి



వాటి దశ మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాకేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దిపాడు మండలంలో 29 పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 7.3 కి మీ మేర సీసీ బాటల నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిన మద్దిపాడు బీసీ కాలనీకి ఇప్పటికీ రోడ్డు లేదు. ఇప్పుడు వారు హాయిగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం దక్కింది. మద్దిపాడు, దొడ్డవరం, పెద కొత్తపల్లి, నాగన్నపాలెం, కొలచనకోటలో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం తదితర గ్రామాల్లోనూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.సంతనూతలపాడు మండలంలో మొత్తం 30 రోడ్లు మంజూరు కాగా, వీటికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 25 పనులు పూర్తవ్వగా, మిగిలినవి జరుగుతున్నాయి.

# రూ.60 కోట్లు... బూడిదలో పోసిన పన్నీరు!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకోలేకపోయారు. చాలా వరకు పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలనే ధ్యాస లేకుండా పోయిందనే విమర్శలు మూటగట్టుకున్నారు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ కోవకు చెందినదే సూక్ష్మసేద్యం ప్రాజెక్టు.సూక్ష్మసేద్యం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న సూక్ష్మసేద్యం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో 2021, మార్చిలో అప్పటి సీఎం జగన్ మరోసారి శిలాఫలకం ఆవిష్కరించారు.

క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం, లింగాల కుడి కాలువ, పీబీఆర్ జలాశయాల పరిధిలోని మొత్తం 1,22,480 ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా సాగునీరందించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణపనులు పూర్తిచేసేందుకు రూ.1,256 కోట్ల అంచనాలతో పనులను మెగా కంపెనీకి వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. 2021,



మార్చిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024, మార్చి ఆఖరి నాటికి వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి 10.50 శాతం పనులు పూర్తి చేసి రూ.60 కోట్ల బిల్లులు గుత్తేదారుకు చెల్లించేశారు. సూక్ష్మసేద్యం పనులు పూర్తయితే కరవు నేలలో పచ్చని పైర్లతో కళకళలాడుతుంది.

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు :** ఆకృతుల మేరకు ఒక సంపు నుంచి సూక్ష్మసేద్యం పద్ధతిలో 100 నుంచి 120 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణాలు రూపుదిద్దాల్సి ఉంది. ఈ విధంగా 1,22,480 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు 1,275 సంపులు నిర్మించాల్సి ఉండగా, 60 సంపులు పూర్తి కాగా, మరో 10 వరకు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. మిగతా సంపుల నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూసేకరణ కార్యక్రమం ఆగిపోయింది. ఒక్కో సంపు నిర్మాణానికి 60 సెంట్ల స్థలం కావాల్సి ఉంది. ఈ మేరకు స్థలాన్ని వదులుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రాలేదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులు మాత్రమే ముందుకొచ్చారు. ఎకరా లేదా రెండు ఎకరాలు భూములు ఉన్న కర్షకులు ఆ మేరకు భూమి కోల్పోయేందుకు ససేమిరా అన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు ముందుకు సాగలేదు. చేపట్టిన పనుల మేరకు సంపుల నుంచి నీటిని తోడేందుకు మోటార్లు, పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాల్సి ఉంది. గుత్తేదారు క్షేత్ర స్థాయి నుంచి వెళ్లిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో వెచ్చించిన రూ.60 కోట్లు వృథాగా పోయాయి.

# చెత్తగుట్టల్లో 'వెలుగు' రేఖలు



ఆదోని : గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా 'చెత్త' నిర్ణయాలతో పట్టణ ప్రజలు అవస్థలు పడ్డారు.. ఇంటింటా చెత్త పన్నుతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యర్థాలను తొలగించకపోగా క్లాప్ పేరుతో పుర నిధులను కొందిరికి దోచి పెట్టారు. ప్రజా విన్నపాల మేరకు 'కూటమి' ప్రభుత్వం చెత్త పన్ను విధానానికి స్వస్తి పలికింది.. అక్టోబరు 2వ తేదీ నాటికి స్వచ్ఛ పట్టణాలు, నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తికి ప్రణాళిక రచించారు. ఇలాంటి ప్లాంట్లు విశాఖపట్నం, గుంటూరు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి.. ఇదే స్ఫూర్తితో త్వరలో కర్నూలులో ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పట్టణాల్లో పోగయ్యే చెత్తను రీసైక్లింగ్‌కుపోగా మిగిలిన వ్యర్థాలు ప్లాంట్‌కు తరలించనున్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యాలకు రక్షణతోపాటు భూ, వాయు, నీటి కాలుష్య సమస్యలు దూరమవుతాయని అధికారుల అంచనా.

**శుద్ధికి బిల్లులు ఇవ్వని వైకాపా**

డంపింగ్ యార్డుల్లో పోగైన చెత్తను శుద్ధి చేసేందుకు నిధుల్లేవని గత వైకాపా ప్రభుత్వం చేతులెత్తేసింది. స్పందించిన కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని సూచించింది.

టన్ను చెత్త శుద్ధికి రూ.650 చొప్పున చెల్లిస్తామని టెండర్లు పిలిచారు. నంద్యాల, ఆదోనిలో పనులు ప్రారంభించినా... సకాలంలో బిల్లులు ఇవ్వలేదు.. గుత్తేదారులు చేతులెత్తేశారు. కర్నూలు నగర పాలక సంస్థలో శుద్ధి అనే మాటే లేదు.

క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఆటోలు తెచ్చి ఇంటింటి చెత్త సేకరణ పేరుతో ప్రజలపై రుసుం భారాన్ని మోపడంతో చివరికి ప్రజలు వార్డులకు వచ్చిన ఆటోలను అడ్డగించి, ఇచ్చిన చెత్త బుట్టలను అందులోకే విసిరేసి నిరసన వ్యక్తం చేశారు. తెదేపా హయాం (2014-19)లో ఆదోని పట్టణంలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్ విజయవంతంగా నడుస్తోంది. పురపాలికలో పోగైన తడి చెత్తను ఇక్కడికి తరలించి గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు.

**గతంలో ఎన్జీటీ బృందం ఆగ్రహం**

గతంలో ఎన్జీటీ బృంద సభ్యులు పురపాలికల్లో పర్యటించారు. ప్రజల ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.. డంపింగ్ యార్డుల నిర్వహణను పరిశీలించారు. ఎక్కడా శుద్ధి చేయడం లేదని గుర్తించారు. తక్షణం డంపింగ్ యార్డులను స్వచ్ఛ ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.. లేదంటే భారీ ఎత్తున జరిమానా విధించాల్సి ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేరుకుపోయిన చెత్త గుట్టలు**

ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగర పాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలికలు, నగర పంచాయతీలున్నాయి. ఆయా పట్టణాల్లో నిత్యం సగటున 500-600 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది.

కర్నూలు నగరంలో సేకరించిన చెత్తను గార్గేయపురం, నంద్యాలలో పీవీ నగర్, ఆదోనిలో శిరుగుప్ప, ఎమ్మిగనూరులో సోగనూరులోని డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.

చెత్తను యార్డులకు తరలించి గుట్టలుగా పేరుస్తున్నారు తప్ప శుద్ధి చేయడం లేదు. నిధుల లేమి, సిబ్బంది కొరత, ప్రజారోగ్య విభాగం బాధ్యతారాహిత్యంతో ముందుకు సాగడం లేదు.

ఏళ్ల తరబడి చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో స్థానికంగా భూ, వాయు, నీటి కాలుష్యం తలెత్తుతోంది. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు చర్మ వ్యాధులు, శ్వాసకోశ సంబంధ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు బారిన పడుతున్నారు.

# పుర పేదలకు గూడు




కర్నూలు : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామని వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు మాయ చేసింది. జగనన్న కాలనీల పేరుతో ఆ పార్టీ నేతలు దందా చేశారు.. ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకొచ్చిన వారికీ సకాలంలో బిల్లులు ఇవ్వలేదు.. సొంతిళ్ల కోసం పేదలు కళ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు.. పేదల ఇబ్బందులు గమనించి 'కూటమి' ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. రాష్ట్రంలో పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.. పీఎంఏవై అర్బన్- 2.0 పథకం కింద ఇళ్ల మంజూరు అంగీకరించింది. మొదటి విడత కర్నూలు మున్సిపాలిటీకి 1,615, మిగిలిన మున్సిపాలిటీలకు కలిపి 4,035 ఇళ్ల మంజూరుకు ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి మార్చిలో ఉత్తర్వులు రానున్నాయి. ఆయా పట్టణాల్లో 2011 జనాభాను అనుసరించి ఇళ్లు మంజూరు చేసినట్లు తెలుస్తోంది..

**మొదటి విడత పట్టణాలకు**

కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో 55 మండలాలు ఉన్నాయి.. వాటినీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 పథకానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారందరూ అర్హులవుతారని మొదట అంచనా వేశారు. కేంద్రం మొదటి విడత కేవలం కర్నూలు కార్పొరేషన్‌తోపాటు మిగిలిన పురపాలికలను పరిగణనలోకి తీసుకొంది.

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకొనేవారు ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. స్థలాలకు సంబంధించిన పత్రాలు, భార్య, భర్త ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు తదితర పత్రాలు జత చేయాలి. ఇదివరకెన్నడూ తమ పేర్లతో గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు కాకుంటేనే అర్హులవుతారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని హౌసింగ్ ఏఈకి అందించాలి.

**ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు**

గత ప్రభుత్వ హయాంలో ఒక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చేవారు.. డబ్బులు సరిపోక నిర్మాణానికి చాలా మంది ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీఎంఏవై అర్బన్-2.0 పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలకు పెంచింది. సొంతిళ్లు లేని వారి వివరాల కోసం సచివాలయ ఉద్యోగులతో నెల రోజుల నుంచి డిమాండ్ సర్వే చేయిస్తోంది. " సొంత స్థలాలున్నాయి.. ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ 2024 డిసెంబరు నాటికి కర్నూలు జిల్లాలో 12,102, నంద్యాలలో 6,420 మంది అర్జీ పెట్టుకొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా గడువు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

# జనానికి గరళ జలం

నంద్యాల : మంచినీరు అందించేందుకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా జిల్లా వాసులకు కలుషిత నీరే దిక్కవుతోంది. గలగల సేలయేర్లు పారుతున్నా ప్ర'జల'కు మంచినీరు దక్కడం లేదు.. ఇప్పటికీ చాలామంది చేతిపంపులు, చెరువుల నీటిపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన 'భూగర్భ జల నాణ్యత నివేదిక-2024' పలు ప్రాంతాల్లో నీటి నాణ్యత సరిగా లేదన్న విషయం తేలింది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ముందు, అవి వచ్చిన తర్వాత వర్షాలు కురిసిన అనంతరం నమూనాలు సేకరించి పరీక్షలకు పంపితే కొన్నిచోట్ల లోపాలు వెలుగులోకి వచ్చాయి.

**పరీక్షలో ఏం తేలిందంటే**

బేతంచెర్ల, ప్యాపిలి, కొలిమిగుండ్ల, అవుకు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఫ్లోరైడ్ స్థాయి లీటరు నీటిలో 1.5 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ఉంది.

భూగర్భ జలాల్లో ఇనుము 1.0 కి.గ్రా/లీ ఉండాలి. నంద్యాల మండలం మిట్నాల, గుంతనాల, ఉడుమాల్పురం ప్రాంతాల్లో ఇంతకంటే ఎక్కువగా ఉంది. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లో కుందూనది పరివాహకంలో నీళ్లు రంగుమారి కనిపిస్తున్నాయి. ఆ నీటిని తాగుతున్న వారు విరేచనాలు, వాంతులతో ఆస్పత్రుల పాలవుతున్నారు.

నంద్యాల, ఆళ్లగడ్డ దొర్నిపాడు, రుద్రవరం, శిరివెళ్ల, బండిఆత్మకూరు, వెలుగోడు, చాగలమర్రి మండలాల్లో భూగర్భ జలాల్లో నైట్రేట్ 45 మిల్లీ గ్రాములు/లీ కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వరి సాగు ఎక్కువ. సాగుదారులు అధిక నైట్రోజన్ కలిగిన ఎరువులు వినియోగిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. జల్ జీవం తీశారు రూ.450 కోట్లతో పట్టాలెక్కాల్సిన జల్ జీవన్ మిషన్ వైకాపా



ప్రభుత్వ నిర్వాకంతో అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగా వివిధ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం ప్రతిపాదించినా ఆచరణలో అమలు కాలేదు. దీంతో ఇప్పటికీ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కలుషిత నీటితో ప్రజలు అతిసారం, వివిధ రకాల వ్యాధుల బారినపడుతున్నారు. ప్రత్యేకించి నాపరాళ్ల గనులు అధికంగా ఉన్న ఎర్రమల కొండ ప్రాంతాలతో పాటు వరి సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వాడుతున్న రసాయనాల వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న జిల్లా కేంద్రాల్లో సైతం నీటి నాణ్యత సరిగా లేదని నాణ్యతా పరీక్షల్లో తేలింది.

నేరుగా నదుల్లోకి వదిలేస్తున్నారు నంద్యాల పట్టణంలో చామకాల్వ, మద్దిలేరు, పాలేరు వాగులు కలుషితమవుతున్నాయి. ఆ మురుగంతా నేరుగా కుందూనదిలో కలుస్తోంది. నంద్యాల పట్టణ శివార్లలోని విత్తన శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రమాదకర రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలు నేరుగా కేసీ కాల్వలోకి వదులుతున్నారు. జిల్లాలో చాలా చోట్ల సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు, మురుగునీటిని నేరుగా సాగునీటి కాలువల్లో కలిపేస్తున్నారు. ఇవన్నీ కాలుష్యానికి కారణమవుతున్నాయి.

# 'ఓపి'కలేని వైద్యులు!

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యులు రోగులకు నాలుగు గంటలపాటు ఓపీ సేవలందించాల్సి ఉండగా, కేవలం రెండు గంటల్లోనే మమ అనిపిస్తున్నారు. ఫలితంగా పూర్తిస్థాయిలో వైద్యసేవలందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఓపీ సేవలందించాల్సి ఉండగా, ఇందుకు భిన్నంగా జరుగుతోంది. పలువురు వైద్యులు 10 గంటలకు వచ్చి 12 గంటలు కాగానే ఓపీ చీటీలివ్వడం ఆపేస్తున్నారు. రోగులకు అందే సేవల్లో రెండు గంటలు కోత పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు. వైద్యులు తాము చెప్పింది పూర్తిగా వినకుండానే పరీక్షించి మందులు రాసి పంపేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైద్యులు సరైన సమయానికి హాజరై పూర్తిస్థాయిలో పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పూర్తిగా నాలుగు గంటలపాటు ఓపీ సేవలు అందించాల్సిందేనని, వెంటనే విచారించి వైద్యులు సరైన సమయానికి వచ్చి ఒంటిగంట వరకు ఓపీ సేవలందించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# కార్పొరేషన్లకు మోక్షం!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వివిధ కార్పొరేషన్లు కళకళలాడబోతున్నాయి. అయిదేళ్ల అనంతరం లబ్ధిదారులకు రాయితీపై రుణాలు మంజూరు చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాయితీ రుణాలకు జిల్లాలోని లబ్ధిదారులైన బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు వర్గాలు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. జిల్లాలో వివిధ రూపాల్లో 2 వేల యూనిట్ల స్థాపనకు రాయితీ రుణాలు అందించడానికి చర్యలు చేపట్టింది. యూనిట్ల కింద రూ.43.50 కోట్ల మేర రుణాలు ఇవ్వనుండగా, ఈ మొత్తంలో 50 శాతం లబ్ధిదారులకు రాయితీ లభించనుంది. కాపు వర్గానికి చెందినవారు ఎంఎస్‌ఎంఈ యూనిట్ల స్థాపనకు సహకారం అందించనుంది. వీటితోపాటు రూ.8 లక్షల యూనిట్ విలువతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించనుంది. ఇందులో రూ.4 లక్షలు రాయితీ లభించనుంది. ఇలా 57 మంది బీ ఫార్మసీ చేసిన నిరుద్యోగులకు జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటుకు రుణాలు అందజేయనున్నారు. గత అయిదేళ్లుగా వైకాపా సర్కారు రూపాయి కూడా కార్పొరేషన్ల కింద రుణాలు ఇవ్వలేదు. పైగా గత తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రుణాలను లబ్ధిదారుల మెడపై కత్తిపెట్టి మరీ వసూలు చేసింది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి కార్పొరేషన్లకు పూర్వ వైభవం వచ్చింది. రుణాలను విడుదల చేసి ఫిబ్రవరిలో యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. బీసీ, ఈబీసీ, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కులాల కింద లబ్ధిపొందడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నా



రు. అర్హత గల లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డులు, ఆదాయ ధ్రువీకరణ, కుల పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో %apobmm% (వెబ్‌సైట్ ద్వారా ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**వీటికి ప్రాధాన్యం:** చేతి వృత్తులు, పాడి, చిన్న తరహా కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, డెయిరీ యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు. వీటితో పాటు జనరిక్ దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నారు. రాయితీ మొత్తం ప్రభుత్వం ఇవ్వనుండగా.. మిగిలిన 50 శాతం సాయాన్ని రుణంగా బ్యాంకుల నుంచి ఇప్పించనుంది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజస్ సర్వీస్, సెక్యూరిటీ గార్డులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా వేలాది మందికి లబ్ధి కలిగేలా కార్యాచరణ ప్రణాళిక జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంఘం లిమిటెడ్ రూపొందించింది.

# చెత్త బిన్‌లతో ప్రమాదాలు!

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటి పురపాలక సంఘం పరిధిలో వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ప్రధాన రహదారులు వెంబడి చెత్త సేకరణకు పురపాలక సంఘం అధికారులు చెత్త బిన్‌లు ఏర్పాటు చేశారు. వీటి నుంచి చెత్తను సేకరించేందుకు మూడు వాహనాలు సైతం ఉన్నాయి. వీటి ద్వారా సిబ్బంది ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో విడతల వారీగా చెత్తనిల్వలు సేకరిస్తారు. చెత్తసేకరణ చేసిన అనంతరం వీటిని యథాస్థానంలో ఉంచకుండా నిర్లక్ష్యంగా రహదారుల మధ్యలో వదిలేస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా రెండు రోజుల కిందట రాయచోటి ఆర్టీసీ బస్టాండు మార్గంలో ప్రధాన రహదారి పక్కన ఉ



ంచిన చెత్త బిన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సు మరమ్మతులకు రూ.20 వేల వరకు ఖర్చయిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. చెత్తకుండీల కారణంగా ప్రమాదాలు సంభవించి వాహనదారులకు గాయాలవుతున్నాయి.

పట్టణంలో వాణిజ్య, వ్యాపార సముదాయాలున్న గాంధీ బజారు, కంసల వీధి, బస్టాండు ప్రాంతం, గాలివీడు రోడ్డు మదనపల్లె రోడ్డు, చిత్తూరు రోడ్డు, జగదాంబ సెంటర్, కొత్తపేట, మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో సుమారు 40 వరకు చెత్త బిన్‌లు ఉన్నాయి. వీటి నుంచి సిబ్బంది చెత్తను సేకరించిన తరువాత రోడ్ల మధ్యలో వదిలేస్తుండడంతో నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ వాసుబాబు మాట్లాడుతూ పట్టణంలోని రహదారులకు అడ్డంగా ఉన్న చెత్త బిన్‌లను వెంటనే తొలగిస్తామన్నారు.

# సమరానికి సై.. తగ్గేదేలే!

నూజివీడు : సంక్రాంతి పండగ సమీపించిన నేపథ్యంలో కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. పందేలు నిర్వహించడానికి వీల్లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నాయి. పోలీసులు కూడా పందేలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. గతంలో నిందితులుగా ఉన్నవారిని బైండోవర్ చేశారు. కానీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చివరిలో చేతులెత్తేస్తున్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఏటా కోడి పందేలు జోరుగా సాగుతున్న విషయం బహిరంగ రహస్యమే. ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోని అనేక గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన, ఏడాది పొడవు పెంచిన కోడి పుంజులను పందేలకు సిద్ధం చేస్తున్నారు. పందేల్లో పాల్గొనడానికి నూజివీడు చుట్టుపక్కల నుంచే కాకుండా పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లా నుంచి కూడా వేలాది మంది వస్తారు. ముసునూరు మండలంలోని లోపూడి, గోపవరం, కాట్రేనిపాడు, చెక్కపల్లి, గుడిపాడు, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల, చింతలవల్లి, ఆగిరిపల్లి మండలంలోని చిన్న ఆగిరిపల్లి, అడవి నెక్కలం, అమ్మవారిగూడెం,



ఈదర, నూజివీడు మండలంలోని హనుమంతుల గూడెం, తుక్కులూరు, పోతురెడ్డిపల్లి, సుంకొల్లు, చాట్రాయి మండలంలోని జనార్దనవరం, చిన్నంపేట తదితర ప్రాంతాల్లో కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి.

**యథేచ్ఛగా జూదం**

ఒక్క కోడి పందేలే కాకుండా కోతముక్క, లోన.. బైట, గుండాట, పేకాట తదితర జూదాలు యథేచ్ఛగా నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో మద్యం, నాటుసారా కూడా ఏరులై పారుతుంది. పండగ మూడు రోజులు లక్షలాది రూపాయలు చేతులు మారతాయి. కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్‌కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో ఎస్సై, తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేశారు.

**చర్యలు తప్పవు...**నూజివీడు సబ్ డివిజన్‌లో కోడి పందేలు, జూదాలు నిర్వహించకుండా ఇప్పటికే చర్యలు చేపట్టాం. బరులు ధ్వంసం చేస్తున్నాం, బైండోవర్ కేసులు నమోదు చేశాం. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
కేవీవీఎన్‌వీ ప్రసాద్, డీఎస్పీ, నూజివీడు.

# వంతెనల ఊసే లేదు!

భీమవరం : భీమవరం పట్టణ పరిధిలో గోస్తనీ– వేల్పూరు కాలువపై 72 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన ఇది. 12 ఏళ్ల కిందట ఈ వంతెనకు ఇరువైపులా కొంత భాగం శిథిలం కావడంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలు, సర్వీబాదులు, వెదురు తడికెలు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో మధ్య ఎర్ర కంకర వేసి వదిలేశారు. ప్రస్తుతం ఈ వంతెన పరిస్థితి దారుణంగా ఉంది. పశ్చిమలో సాగు, మురుగు కాలువలపై ఉన్న అనేక వంతెనలు శిథిలస్థితికి చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన వీటికి ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు కూడా లేవు. రహదారుల విస్తరణ, అభివృద్ధికి రూ. వందల కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వాలు వీటి ఊసైనా ఎత్తడం లేదు. గత అయిదేళ్లు వైకాపా పాలనలో వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు.

పెనుమంట్ర మండలం మాముదూరు వద్ద గోస్తనీ కాలువపై నిర్మించిన వంతెన శిథిలమైంది. కింది భాగం దెబ్బతినడంతో వాహనాల



రాకపోకల సమయంలో ప్రకంపనలు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆచంట– పెంటపాడు రహదారిలో గోస్తనీ– వేల్పూరు కాలువపై బ్రాహ్మణ చెర్వులో, నరసాపురం కాలువపై మార్టేరులో ఉన్న పాత వంతెనలు, వాటి రక్షణ గోడలు దెబ్బతిన్నాయి.

కలిదిండి మీదుగా భీమవరం నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారిలో కోపల్లె వద్ద బొండాడ డ్రెయిన్‌పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన బాగా ఇరుకుగా మారడంతో పాటు శిథిలమైంది. దీనికి గతంలో నిధులు కేటాయించినా పనులు మాత్రం జరగలేదు.

**జిల్లాలో ఇలా..**

ప్రధాన వంతెనలు (సుమారు) 172
శిథిలస్థితికి చేరినవి 46
ప్రమాదకరంగా ఉన్నవి 21

పాలకొల్లు శివారులో నరసాపురం కెనాల్‌పై పాతికేళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన నిర్వహణను గత అయిదేళ్లుగా పట్టించుకోలేదు. రెయిలింగ్ దెబ్బతినడంతో పురపాలక అధికారులు ఇటీవల ఇలా కర్రలు కట్టించి వదిలేశారు. భీమవరం– తాడేపల్లిగూడెం ప్రధాన మార్గంలో గరగపర్రు వద్ద ఉండి కెనాల్‌పై 1933లో నిర్మించిన ఈ వంతెన క్రమంగా శిథిలమవుతోంది. దీనిపై అనేకసార్లు భారీ వాహనాలు ఇరుక్కుపోయి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిన ఘటనలు ఉన్నాయి. పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయి. యుద్ధ ప్రాతిపదికన ఇక్కడ నూతన వారధి నిర్మించాల్సిన అవసరం ఉంది.

**ప్రతిపాదనలు పంపాం**

పలు చోట్ల వంతెనలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో కొన్ని వంతెనల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. నిధులు విడుదల చేస్తే శాఖాపరంగా పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. రామరాజు, ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఈఈ

# చేనేతకు చేయూత..



పుత్తూరు : ఆదరణలేక నానాటికి కుదేలవుతున్న చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జవసత్వాలు నింపుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చేనేతల అభ్యున్నతికి చర్యలు చేపడుతోంది.. గత వైకాపా ప్రభుత్వం చేనేతలకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు.. ఏడాది రూ.24 వేలు ఇచ్చి కొందరికే ఇచ్చి చేతులు దులుపుకొంది.. పలుమార్లు అర్హులు తమకు రూ.24 వేలు వర్తింపజేయాలని వినతులు ఇచ్చినా వాటిని బుట్టదాఖలు చేశారు.. గతేడాది తుపాను కారణంగా పనుల్లేక పస్తులున్నా ఆదుకున్న పాపాన పోలేదు.. ఈ నేపథ్యంలో చేనేతల కుటుంబపోషణ కష్టసాధ్యంగా మారింది.. 2019లో అధికారంలోకి వస్తే చేనేతలకు ఉచిత విద్యుత్తు ఇస్తామన్న హామీ నెరవేరలేదు.. ఎన్నికల ప్రచారంలో చేనేతలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించారు.. ఈ మేరకు చేనేత కార్మికులు వంద యూనిట్ల లోగా వినియోగించుకుంటే ఉచిత విద్యుత్తును వర్తింపజేస్తున్నారు. దీంతో చేనేత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5,500 చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఆ రంగంపై ఆధారపడి మరో 10వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో పెనుమూరు, నగరి మండలంలోని మాంగాడు, పలమనేరు తిరుపతి జిల్లాలో పుత్తూరు మండలం గొల్లపల్లి, నారాయణవనం మండలంలోని నారాయణవనం, పాలమంగళం, ఉత్తరం, దక్షిణం, వరదయ్యపాళెం, సత్యవేడు, వెంకటగిరి, పాపానాయుడుపేట, శ్రీకాళహస్తి, బీ.ఎన్ కండ్రిగ తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులున్నారు. ఈ కుటుంబాలు 100 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు పొందేందుకు అర్హులు. ఇప్పటికే చిత్తూరు జిల్లాలోని పెనుమూరు, నగరి ప్రాంతాల్లో పలు కుటుంబాలు ఉచిత విద్యుత్తుకు సంబంధించి సంబంధిత శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా పలు కుటుంబాలు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేనేత మగ్గాలకు మాత్రమే 100 యూనిట్లు లోగా వాడితే పూర్తిగా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. చేనేత కార్మికులు దరఖాస్తుతో పాటు గుర్తింపుకార్డు జత చేసి ఇస్తే 100 యూనిట్ల లోగా వాడితే అతడికి ఆ పథకం కింద ఉచిత విద్యుత్తు వర్తిస్తుంది. 100 యూనిట్లు దాటితే మొత్తం బిల్లు చెల్లించాల్సిందే. ప్రభుత్వ ఇచ్చిన హామీతో చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించినట్లే.

**అవగాహన కల్పించాలి..**

జిల్లాలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం 100 యూనిట్లు ఉచితం అందిస్తున్నట్లు అవగాహన కల్పించాలి. తద్వారా ఆ కుటుంబాలన్ని కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్తు అందించడం ఎంతో సంతోషంగా ఉంది.
కుప్పయ్యశెట్టి, జిల్లా గౌరవాధ్యక్షుడు, చేనేత కార్మిక సంఘం

**సద్వినియోగం చేసుకోవాలి..**

2018లో తెదేపా హయాంలోనే 100 యూనిట్లులోపు విద్యుత్తు వినియోగించుకుంటే ఉచితం. అయితే 2019లో రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ జీవోను పక్కన పెట్టేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ అమలు చేస్తున్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వెంకటముని, జిల్లా ఉపాధ్యక్షుడు. చేనేత కార్మిక సంఘం

# నత్తనడకన ఎంఎస్‌ఎంఈల సర్వే



అనంతపురం : ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) ర్యాంపు సర్వే ఉమ్మడి అనంత జిల్లాలో నత్తతో పోటీ పడుతోంది. క్షేత్రస్థాయి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం మూలంగా ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. సందట్లో సడేమియాగా గ్రామవార్డు సచివాలయాల సిబ్బంది సైతం శ్రద్ధ చూపడం లేదు. కేవలం 20 రోజులే గడువు ఉండేది. ఈలోపు వంద శాతం పూర్తి చేస్తారా లేదా అన్నది అనుమానమే. ఎంఎస్‌ఎంఈలు తక్కువ సంఖ్యలో ఉన్న మండల ప్రాంతాల్లోనూ సర్వేలో వేగం పుంజుకోలేదు. పట్టణ ప్రాంతాల్లో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎంఎస్‌ఎంఈల సర్వే ద్వారా ‘ఉద్యమ్’ గుర్తింపు సంఖ్య వచ్చిన తర్వాత ఖయిలాపడినా, నష్టాల్లో పరిశ్రమలకు బహుళ ప్రయోజనాలు ఒనగూరుతాయి. అన్ని విధాల ఆదుకోడానికి ఈ సర్వే ఎంతో కీలకం. అయినా సరే.. ఎంఎస్‌ఎంఈల సర్వే పురోగతి దయనీయంగా మారడం గమనార్హం.

**47,651 పరిశ్రమలే పూర్తి**

ఉమ్మడి అనంత జిల్లాలో ఈ సర్వే నవంబరు 29న మొదలైనా డిసెంబరు 2 నుంచి పూర్తి స్థాయిలో ఆరంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నాటికి సర్వే ప్రక్రియ ముగియనుంది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 1,51,220 ఎంఎస్‌ఎంఈలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఇప్పటి దాకా 47,651 ఎంఎస్‌ఎంఈలను సర్వే పూర్తి చేయగా.. 37,198 పరిశ్రమలకు ఉద్యమ్ గుర్తింపు సంఖ్య ఇచ్చారు. మిగతా 10,453 పరిశ్రమలు మూతపడ్డాయి.

**ఆ ‘ఐదు’ అధ్వానం**

అనంత జిల్లాలో మండల, పట్టణాలు 37 ఉంటే.. కేవలం ఐదు ప్రాంతాల్లో మాత్రమే కొద్దిమేర పర్వాలేదు. గుంతకల్లు పట్టణం, అనంత నగరం, గుత్తి, కంబదూరు, కళ్యాణదుర్గం పట్టణం.. వంటి ప్రాంతాల్లో మరీ అధ్వానంగా సర్వే నడుస్తోంది. గుంతకల్లు పట్టణంలో కేవలం 9.36 శాతమే పూర్తి కావడం గమనార్హం. అనంత నగరంలో 13.23, గుత్తిలో 20.38 శాతం ప్రకారమే సర్వే పూర్తి అయింది. కంబదూరు, కళ్యాణదుర్గం పట్టణం, యాడికి, బీకే సముద్రం, గుత్తి పట్టణం, ఉరవకొండ మండలాల్లో 30 శాతం మించలేదు. ఒక్క కుందుర్పిలో మాత్రమే 97.64 శాతం, పామిడిలో 91.55, పెద్దపప్పూరు విడపనకల్లు, రాయదుర్గం, వజ్రకరూరు, వంటి చోట్లా 75 శాతంపైగా సర్వే పూర్తి చేసినట్లు నమోదు అయింది. ఎంఎస్‌ఎంఈల సర్వే వేగం పుంజుకోడానికి కలెక్టర్ రోజూ సమీక్ష చేస్తున్నారని డీఐసీ జీఎం శ్రీధర్ తెలిపారు. రాష్ట్రంలో ఆశించిన స్థానంలో ఉన్నామన్నారు.

# పౌరుల లెక్క పక్కా




కర్నూలు : “ పౌరుల వివరాలు పక్కాగా ఉండాలి.. వలసెళ్లిన వారు ఎక్కడున్నారో కచ్చితంగా తెలుసుకోవాలి.. మృతిచెందిన వారి వివరాలు నమోదు చేయాలి.. నమోదుకాని కుటుంబాల వివరాలు ‘యాప్’లో చేర్చాలని అధికారులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలని ‘కూటమి’ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబరు– డిసెంబరు మధ్య సచివాలయ సిబ్బందితో ఇంటింటి సర్వే చేయించారు. వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. వివరాలు తప్పులతడకగా ఉండటంలో పునఃపరిశీలనకు ప్రభుత్వం ఆదేశించింది.

**వివరాలు తప్పులమయం**

సచివాలయ సిబ్బంది నవంబరు 6 నుంచి 30 వరకు సర్వే చేశారు. ఇళ్లు, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కర్నూలు జిల్లాలో 7,36,862, నంద్యాలలో 5,97,468 కుటుంబాల లెక్కను పంపించారు. ఇందులో 5,22,354 పౌరుల వివరాలు సరిగా లేవు పునః పరిశీలించాలని ఆదేశించారు. డిసెంబరు నాటికి 1,24,309 మంది వివరాలు నమోదు చేశారు. వీటిలో భారీగా లోపాలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించి 3.98 లక్షల మంది పౌరుల వివరాలు పునః పరిశీలన చేయాలని ఆదేశించారు.

**వలసెళ్లినవారు ఎక్కడున్నారు**

జిల్లాల్లోని కొన్ని ఇళ్ల వివరాలు తప్పుగా నమోదైనట్లు గుర్తించి ప్రభుత్వం వెనక్కి పంపించింది. వాటికి సవరణ చర్యలు చేపట్టారు. మృతుల వివరాలను వలసలు వెళ్లినట్లు కొన్నింటిని నమోదు చేయడంతో వారికి పింఛన్లు, తదితర ప్రభుత్వ పథకాలు అందే అవకాశాలున్నాయి. వాటిని సవరించాలి. వలసలు వెళ్లిన వారు ఏ జిల్లాలో ఉన్నారు ?, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా..?, అనే వివరాలు సర్వేలో పొందుపర్చలేదు. ఆ వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

**కదలని సచివాలయ ఉద్యోగులు**

ఉమ్మడి జిల్లాలో 9,566 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. అందులో నిత్యం 2,500 మంది గైర్హాజరు కావడంతో సర్వే నత్తను తలపిస్తోంది. పునఃపరిశీలన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులు సచివాలయ ఉద్యోగులను పురమాయిస్తున్నా.. పౌరుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం నెలకొంది.

**కొత్తగా కుటుంబాల నమోదు**

కొత్తగా కర్నూలు జిల్లాలో 8,094, నంద్యాలలో 3,981 కలిపి మొత్తం 12,075 కుటుంబాలను కొత్తగా కుటుంబ సర్వేలో నమోదు చేశారు. ప్రభుత్వం యునిక్ రికార్డ్సు మిస్సింగ్ సిటిజన్స్‌ని మరో మారు పునఃపరిశీలించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. సచివాలయ ఉద్యోగులతో ఈ ప్రక్రియ చేపడుతున్నామని, పౌరుల గుర్తింపు పరిశీలన కొనసాగుతోందని జిల్లా అధికారులు చెబుతున్నారు.

# చేరువలో రక్తశుద్ధి సేవలు

ఆకివీడు : ఉండి నియోజకవర్గ, కొల్లేరు తీర ప్రాంతా గ్రామాల వాసులకు రక్తశుద్ధి (డయాలసిస్) సేవలు చేరువకానున్నాయి. మూత్రపిండాల రోగుల సంఖ్యకు తగ్గట్టుగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు లేవు. దీంతో బాధితులు దూర ప్రాంతాల్లో ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఉండి నియోజకవర్గ పరిధిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాయని గతంలో ఎమ్మెల్యే, ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రకటించారు. ఆయన చొరవ తీసుకొని దాతల సహకారంతో ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించారు. **రూ. 65 లక్షల వ్యయంతో..**ఈ కేంద్రాన్ని ఏర్పాటుకు ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన వైద్యుడు దాట్ల సత్యనారాయణరాజు ముందుకు వచ్చారు. ఆయన కుమారుడు దివంగత విశ్వనాథరాజు, కోడలు పద్మసుందరిల జ్ఞాపకార్థం రూ.65 లక్షల వ్యయంతో 4 పడకలతో ఈ కేంద్రాన్ని నెలకొల్పారు. ఒకే సారి నలుగురు రోగులకు డయాలసిస్ చేసేలా పరికరాలు సమకూర్చారు. ఈ కేంద్రానికి నిరాటంకంగా విద్యుత్తు సరఫరా అయ్యేలా సీపీయూ యూనిట్, నీటి శుద్ధికి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దాత సత్యనారాయణరాజు గతం నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

# కొల్లేరులో కృత్రిమ సాగు

కైకలూరు : నిత్యం పక్షుల కిలకిలరావాలతో సందడిగా ఉండే కొల్లేరులో సంప్రదాయం ముసుగులో నిబంధనలను తుంగలో తొక్కి కృత్రిమ సాగుకు తెర తీస్తున్నారు. కొల్లేరు కాంటూర్ పరిధిలో 2006 ఆపరేషన్‌లో కొట్టేసిన భూముల్లో జీరో సైజు చేపపిల్లల సాగు చేస్తున్నారు. పక్షుల ఆవాసాలకు, ఆహార సేకరణకు విఘాతం కలిగించేలా చర్యలు చేపడుతున్నా పట్టించుకున్న నాథ%రి%్నడు కనిపించడం లేదు. కొట్టేసిన చెరువుల్లో గట్లు వేసి వాటిలో నీటిని నింపి చేపలు పెంచుతున్నారు. హాని కారకమైన రసాయనాలతో పాటు తవుడు, ఇతర మేత అందిస్తున్నారు. కొల్లేరులో మేత కర్రలు పెట్టి, పడవలపై మేతలు వేసుకుని మూటలు కడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమాలకు అదుపు లేకుండా పోతోంది.

**సాగు ఇలా..**కైకలూరు మండలంలోని చెటాకాయ్‌లో 400 ఎకరాలు, నత్తగుల్లపాడు 200, పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప 250, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోటలో 200, శృంగవరప్పాడు 400, గుమ్మళ్లపాడు 200 ఎకరాల్లో, మండవల్లి మండలంలోని కొవ్వాడలంకలో 250, చింతపాడులో 300, పులపర్రులో 250, నుచ్చుమిల్లి 150, తక్కెళ్లపాడులో 150, పెనుమాకలంకలో 200, నందిగామల



ంకలో 250 ఎకరాల్లో కృత్రిమ సాగు చేస్తున్నారు.

**విలవిల్లాడుతున్న పక్షులు, పశువులు..**

కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న పక్షులకు, పశువులకు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. కొల్లేరులో ఉప్పు నీరు పెరిగిపోవడంతో చేపలు మృత్యువాత పడటంతోపాటు వృద్ధి తగ్గి పోతోంది. దీంతో ఖండాలు దాటి సంతానోత్పత్తికి వస్తున్న పక్షులు అర్థాంతరంగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. విషతుల్యంగా మారిన నీటిలో పక్షులకు పూర్తి స్థాయిలో ఆహారం లభించక పోవడంతో అర్థాకలితో బక్కచిక్కి పోతున్నాయి.

**జీవో 120కి విఘాతం**

జీవో 120 ప్రకారం కొల్లేరు పరివాహక ప్రాంతంలో కృత్రిమ సాగు చేయడం, భారీ యంత్రాలతో తవ్వకాలు, శబ్దాలు చేసే ఇంజిన్ల ఏర్పాటు నిషిద్ధం. కానీ మండవల్లి, కైకలూరు మండలాల్లోని చాలా గ్రామాల్లో కొల్లేరు మధ్యలో ఆయిల్ ఇంజిన్లు పెట్టి కొట్టేసిన చెరువుల్లో నీటిని బయటకు తోడుతున్నారు. ఆయా చెరువుల వద్దకు వస్తున్న పక్షులను బెదిరిస్తూ చేపల సాగు చేస్తున్నారు. దీనిపై అటవీ రేంజర్ రామలింగాచార్యులును వివరణ కోరగా నిఘాను పెంచి కొల్లేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎఫ్‌వో విజయను సంప్రదించగా అక్రమసాగును అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జడ్పీలో ‘లెక్క’లేనంత నిర్లక్ష్యం!

ఒంగోలు : ప్రజాధనాన్ని బాధ్యతాయుతంగా ఖర్చు చేయడం.. ప్రతి పైసాకు లెక్కలు చూపడం అధికారుల విధి. వైకాపా ప్రభుత్వంలో ఓ అధికారి ఈ విషయాన్ని విస్మరించారు. ‘జాలి’ గుండెతో నిధులు మళ్లించారు. నిబంధనలకు నీళ్లొదిలి ముందస్తు చెల్లింపులు చేశారు. అకారణంగా ఖర్చవుతున్నా చూస్తుండిపోయారు. తామెవరికీ ఏం చెప్పాల్సింది లేదంటూ ‘లెక్క’లేనితనం ప్రదర్శించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులు వెలుగు చూస్తున్నాయి. అప్పటి అధికారులేమో బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వచ్చిన వారేమో చర్యలు తీసుకోకుండా ‘చిరు’నవ్వులే సమాధానంగా అనిపిస్తు న్నారు.

**ఏం పనులు చేశారో తెలియదు:** బీపీసీఎల్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం ఓడరేవుకు మల్టీ ప్రొడక్ట్ పెట్రోలియం పైపులైన్ నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం చేపట్టారు. తవ్విన రహదారుల పూడ్చివేతకు సెక్యూరిటీ డిపాజిట్ కింద 2021లో జడ్పీ ఖాతాకు రూ.52 లక్షలు అందించారు. 2022లో అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి వీటిని ఖర్చు పెట్టారు. ఆ నిధులతో ఏం పనులు చేశారని తెలిపే దస్త్రాలు లేవు. లెక్కలు చెప్పలేదు. అధికారులు మాత్రం అప్పటి జడ్పీ సీఈవో బదిలీపై వెళ్లారని, లేఖ రాశామంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

**బిల్లులు సమర్పించింది లేదు:** జడ్పీ జీపీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.2.81 కోట్లను వివిధ పనుల పేరిట పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు రెండేళ్ల క్రితం ముందుగానే చెల్లించారు. నిబంధనలు పాటించలేదు. ఇంజినీరింగ్ అధికారులేమో ఆ నిధులను ఏ పనులకు వెచ్చించారు.. ఎంబీ రికార్డులు, బిల్లులను జడ్పీ అధికారులకు సమర్పించలేదు. నిధుల ఖర్చు, పనుల వివరాలు, నోట్‌కామ్ చిత్రాలు, ఎవరికి, ఎప్పుడు డబ్బు చెల్లించారు, ప్రస్తుత పని స్థితిపై నివేదిక ఇవ్వాలని జడ్పీ సీఈవోనే గత నెల 31న పీఆర్ ఈఈకి లేఖ రాశారు. నేటికీ సమాధానం లేదు.

**ఇష్టారీతిన విధులు:** ఫారిన్ సర్వీస్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు ఇతర శాఖలో పనిచేస్తుంటారు. ఇందుకు జడ్పీ సీఈవో, తర్వాత కమిషనర్ అనుమతి అవసరం. అయిదేళ్ల అనంతరం తిరిగొచ్చి ఆరు నెలలు పూర్వస్థానంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు అమలు కావడం లేదు. సుమారు 15 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఈవోలు, సూపరింటెండెంట్లు, టైపిస్టులు ఫారిన్ సర్వీసులో భాగంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు, డ్వామా, మెప్మా, మైనార్టీ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. వీరిలో అయిదేళ్లు దాటినా వారూ ఉన్నారు. అయినా చర్యలు లేవు.

**రెండుసార్లు రుణం చెల్లింపు:**రెండేళ్ల కిందట సుమారు పది మంది వరకు జీపీఎఫ్ రుణం తీసుకున్నారు. వీరికి రూ.99.50 లక్షలను రెండుసార్లు చెల్లించారు. ఇందులో ముగ్గురు ఉద్యోగుల పాత్ర ఉంది. తప్పును ఆలస్యంగా తెలుసుకొని.. పది మందిని బతిమిలాడుకొని మళ్లీ రాబట్టారు. ఆ మొత్తానికి జడ్పీ రెండు నెలలపాటు వడ్డీ కోల్పోవాల్సి వచ్చింది.ఏడాది కిందట ఈఎల్(యర్న్ లీవ్స్) పేరిట రూ.1.80 లక్షలను రెండు సార్లు చెల్లించారు. నేటికీ విషయం తెలియదు. ఇటీవల సీఎఫ్‌ఎంఎస్ అధికారులు గుర్తించి లేఖ ఇచ్చారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం:**చిరంజీవి, జడ్పీ సీఈవో
బీపీసీఎల్ నిధులు రూ.52 లక్షలకు సంబంధించి గత జడ్పీ సీఈవో నుంచి బిల్లులు ఇంకా అందలేదు. వచ్చిన వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. పీఆర్ ఈఈకి ఇచ్చిన ముందస్తు చెల్లింపుల నివేదికపై మరోసారి నివేదిక కోరుతాం. ఫారిన్ సర్వీసు అధికారుల వివరాలు తెలుసుకుని వెనక్కి రప్పిస్తాం. గతంలో సాంకేతిక తప్పిదంతో రెండుసార్లు బిల్లులు చెల్లించడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# దొరికితేనే దొంగలు

పుత్తూరు : పుత్తూరు బజారువీధిలో రెండ్రోజుల కిందట పోలీసులు దాడులు నిర్వహించి 49 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వాటి విలువ రూ.97వేలు. నిందితులపై కేసు నమోదు చేసినా విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచాల్సి వచ్చిందనేది పోలీసులకే ఎరుక. నగరి కేంద్రంగా నిత్యం రేషన్ బియ్యం అక్రమంగా సేకరించి గోదాములో చేర్చి అక్కడి నుంచి కర్ణాటకకు తరలిస్తున్నారు. ఇదంతా అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బియ్యం ఎవరు సేకరిస్తున్నారు? ఈ అక్రమాలకు సూత్రధారి ఎవరు.. ఎంతమంది ఇక్కడ ఇలాంటి వ్యాపారం నిర్వహిస్తున్నారనేది అధికారులకే ఎరుక.రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్ల రాయితీతో పేదలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు దీన్ని వృత్తిగా చేసుకోగా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తూ మొక్కుబడి దాడులతో



సరిపెడుతున్నారు. నగరి నియోజకవర్గం, పరిసర ప్రాంతాలు చౌకబియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి. అధికారులకు ఫిర్యాదులు వచ్చినా వెంటనే అక్రమార్కులుకు సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరి నుంచి నేరుగా అటు కర్నాటక రాష్ట్రానికి, ఇటు కాకినాడకు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి నెలకు కనీసం 15 లారీల్లో బియ్యం తరలిపోతున్నాయంటే దందా ఏమేరకు సాగుతుందో చెప్పవచ్చు. ఈ ప్రాంతంతో పాటు.. సమీప తిరుపతి జిల్లా సత్యవేడు, సూళ్లూరుపేట నుంచి సైతం బియ్యం తరలిపోతున్నాయి.

**అక్రమార్కులపైన కఠిన చర్యలు - వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు**

రేషన్ బియ్యం అక్రమంగా సేకరిస్తే చర్యలు తప్పవు. ఇకపై తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమంగా సేకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వం సైతం అక్రమంగా బియ్యం సేకరిస్తున్న వారిపై పీడీ చట్టం పెట్టేలా చట్ట సవరణ చేసే పూర్తిగా అరికట్టవచ్చు.

# తిరుపతి - శ్రీసిటీకి కొత్త దారి

తిరుపతి : రాష్ట్రానికే తలమానికమైన శ్రీసిటీకి తిరుపతి నుంచి నేరుగా కొత్తదారి వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్నవి కాకుండా అనువైన రహదారిని నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరోవైపు ఐతేపల్లి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెకు మరో రహదారి ఏర్పాటుపైనా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

**పారిశ్రామిక వాడలు కలిపేలా..** ఈఎంసీ-1, ఈఎంసీ-2లను కలుపుతూ కొత్త రహదారి ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బీవీకండ్రిగ పరిధిలో చెన్నై-బెంగళూరు పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూసేకరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పారిశ్రామికవాడలు అన్నింటినీ శ్రీసిటీతో అనుసంధానం చేస్తూ ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని యోచిస్తున్నారు.

**చిత్తూరు రహదారితో అనుసంధానం**

తిరుపతి-పూతలపట్టు చిత్తూరు ప్రధాన రహదారిని సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లెతో అనుసంధానం చేయడంపైనా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఐతేపల్లి నుంచి రహదారి నిర్మించేలా చూస్తున్నారు. ప్రస్తుతం ఐతేపల్లి నుంచి రంగంపేట వరకు సింగిల్ రోడ్డు ఉంది. దీన్ని విస్తరించడమా లేదంటే కొత్తదాన్ని నిర్మించడమా అనే విషయమై యోచిస్తున్నారు.

**ప్రస్తుత రాకపోకలు ఇలా..** సత్యవేడు పరిధిలోని శ్రీసిటీలో ప్రస్తుతం 30 దేశాలకు చెందిన 220 కంపెనీలు పరిశ్రమలు స్థాపించాయి. శ్రీసిటీకి ఇటు శ్రీకాళహస్తి మీదుగా బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం తడ ప్రధాన రహదారి వైపు నుంచి వెళ్లవచ్చు. ఇటు పుత్తూరు, నారాయణవనం, నాగలాపురం, సత్యవేడు మీదుగా మరో మార్గం ఉంది. ప్రస్తుతం ఈ రెండు మార్గాలు అనువుగా లేవని భావిస్తున్నారు. పారిశ్రామికవేత్తలు తిరుపతి విమానాశ్రయం నుంచి వెళ్లలేక పలువురు చెన్నైలో దిగి అక్కడి నుంచి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# షార్ భద్రమేనా?

సూళ్లూరుపేట: శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం భద్రత పరంగా అత్యంత సున్నితమైంది. అయితే ఈ విషయంలో నీలినీడలు అలుముకుంటున్నాయి. నిఘావర్గాలు హెచ్చరించినా లోపాలు కనిపిస్తున్నాయి. కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు, పోలీసుల మధ్య సమన్వయం సైతం లోపించింది. ఏడాది కిందట భద్రతపై సమన్వయ కమిటీ చేసిన సూచనలు అమలు కావడం లేదు.

శ్రీహరికోట భద్రతకు సంబంధించి గతేడాది నవంబరు 8న సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. షార్ నియంత్రణ, విజిలెన్సు అధికారి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తమిళనాడు, ఆంధ్ర పోలీసు అధికారులు, కోస్టుగార్డు, కేంద్ర, రాష్ట్ర నిఘా అధికారులు, సీఐఎస్‌ఎఫ్ దళాల అధిపతులు పాల్గొన్నారు. ఎవరు వస్తున్నారో.. వెళ్తున్నారో.. అర్థం కావడం లేదని, పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిరంతరం తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**చక్కర్లు కొట్టని బోటు**

తీరంలో నిరంతరం బోటు ద్వారా పెట్రోలింగ్ చేయాలని కోస్టుగార్డు అధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అన్ని రాష్ట్రాలకు సరఫరా చేసిన బోట్లు చక్కగా వినియోగంలో ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉపయోగించడం లేదని ఆ విభాగం అధికారులు చెబుతున్నారు.

**అరకొరగానే..** కంచెతోపాటు సీసీ కెమెరాలు అరకొరగానే ఏర్పాటు చేశారు. దీవుల్లో తనిఖీలు మరిచారు. సీఐఎస్‌ఎఫ్, పోలీసుల మధ్య సమన్వయం లేదు. ఉద్యోగుల కాలనీలు, పులికాట్ నగర్‌లో చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల బెల్జియంకు చెందిన ఉపగ్రహం రాగా పోలీసులు బందోబస్తు విస్మరించారు.

**దృష్టిసారిస్తాం..**– శ్రీనివాసులురెడ్డి, నియంత్రణ, విజిలెన్స్ అధికారి, షార్ శ్రీహరికోట భద్రతపై దృష్టి పెడతాం. దీవుల్లో తనిఖీలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడతాం. అన్ని విషయాలపై మరోసారి అధికారులతో చర్చిస్తాం.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో 30 పోస్టుల కోత




అనంతపురం : పునర్విభజన పేరుతో అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాలకు చెందిన 30 పోస్టులను ఇతర ప్రాంతాల్లోని వైద్య కళాశాలలకు కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుసంధానంగా సర్వజన వైద్యశాల నిర్వహిస్తున్నారు. వైద్య కళాశాలలో మొత్తం 83 ట్యూటర్ పోస్టులుండగా ప్రస్తుతం కేవలం తొమ్మిది మంది మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 30 పోస్టులను ఇతర ప్రాంతాలకు కేటాయించటం ద్వారా అనంత వైద్యకళాశాల నష్టపోతుందని వైద్యులు, వైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు పోస్టులకు ఇక్కడే వైద్యులను నియమిస్తే సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాల్టీ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే వీలుంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వంలోని పాలకులు దృష్టి సారించి ఉమ్మడి జిల్లాకు వరంగా ఉన్న సర్వజన వైద్యశాలకే పోస్టులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

**ఎక్కడెక్కడికి కేటాయించారంటే..**

ప్రభుత్వ వైద్యకళాశాలలో ఉన్న ట్యూటర్ పోస్టుల్లో కర్నూలు ప్రభుత్వ వైద్యకళాశాలకు 22, తిరుపతి స్విమ్స్‌కు 8 పోస్టులను కేటాయించారు. సంబంధిత ఆసుపత్రుల్లో కంటే అనంతపురం సర్వజన ఆసుపత్రిలోనే రోగులకు అధికంగా వైద్యసేవలు అందిస్తుండటం గమనార్హం. అయినప్పటికీ అనంత కళాశాలలో ఉన్న పోస్టులను ఇతర వైద్య కళాశాలలకు కేటాయించటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

**వైద్యులపై తీవ్ర భారం**

ప్రస్తుతం వైద్యకళాశాలకు 200 ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు ఉంది. వీరికి పాఠాలు బోధించడానికి తగినంతమంది బోధకులు లేరు. వైద్యులే విద్యార్థులకు బోధన చేయడంతో పాటు సర్వజన వైద్యశాలలో రోగులకు సేవలు అందిస్తున్నారు. సర్వజన వైద్యశాలకు సంబంధించి 560 పడకలు మంజూరు ఉండగా 1,200 మంది వరకు ఐపీ సేవలు, రోజుకు 2,500 మంది వరకు ఓపీ సేవలు అందిస్తున్నారు. అయితే 560 మందికి సరిపడా వైద్యులు, సిబ్బంది మాత్రమే కేటాయింపులు ఉన్నాయి. వీటిలో కూడా ఎక్కువగా ఖాళీలు ఉండటంతో ఉన్నవారే సర్దుకుపోతూ రెండుచోట్లా పనిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడి పోస్టులను ఇతర ప్రాంతాలకు కేటాయించటం పట్ల వైద్యులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న పోస్టులు వెళ్లిపోతే భవిష్యత్తులో తిరిగి తెచ్చుకోవటం సాధ్యమయ్యే పనికాదన్న చర్చ సాగుతోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం- డాక్టర్ మాణిక్యరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్యకళాశాల, అనంతపురం**

30 ట్యూటర్ పోస్టులను ఇతర వైద్యకళాశాలలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయిన మాట వాస్తవమే. సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాల్టీ వైద్యశాలలో వైద్యుల కొరత ఉంది. ఇక్కడ రోగులు అధికంగా వస్తున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పోస్టులను ఇక్కడే కేటాయించాలని విజ్ఞప్తి చేస్తాం.

# సెంట్రల్ యూనివర్సిటీలో కలకలం



అనంతపురం : జంతులూరులోని సెంట్రల్ యూనివర్సిటీలో భద్రతా లోపాలు వెలుగు చూశాయి. ఈఏడాది నుంచి వర్సిటీ కొత్త భవనాల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 900 మందికి పైగా విద్యార్థులు వివిధ విభాగాల్లో చదువుతున్నారు. వీరిలో 400 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరంతా వర్సిటీ ప్రాంగణంలోని వసతి గృహంలో ఉంటున్నారు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి వర్సిటీలో భవన నిర్మాణ పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన కొందరు అమ్మాయిల స్నానాల గదులున్న వైపు తొంగి చూసేందుకు ప్రయత్నించడం కలకలం రేపింది. ఆసమయంలో విద్యార్థినులు గట్టిగా కేకలు వేయడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. భయంతో వణికిపోయిన విద్యార్థినులు డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరుణాకర్ సోమవారం వర్సిటీకి చేరుకొని విచారణ ప్రారంభించారు. అనుమానిత నలుగురు బిహార్ యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనిపై డీఎస్పీ వెంకటేశ్వర్లుని వివరణ కోరగా విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

**అడుగడుగునా లోపాలున్నా...**

వర్సిటీ ప్రాంగణంలో దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వందల మంది అమ్మాయిలు ఇక్కడి వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. అర్ధరాత్రి బిహార్‌కు చెందిన యువకుల దుశ్చర్యతో ఆందోళనకు గురవుతున్నారు. వసతిగృహం చుట్టూ ప్రహరీ లేకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. దీనికి తోడు రాత్రిళ్లు గస్తీ లేకపోవడంతోనే యువకులు దర్జాగా అమ్మాయిలు ఉన్న ప్రాంతం వైపు వెళ్లగలిగారన్న విమర్శలున్నాయి. ఘటన జరిగిన రోజు రాత్రే పోలీసులు అక్కడికి చేరుకున్నారని, వారు ఆరాత్రంతా భద్రత దృష్ట్యా అక్కడే ఉన్నట్లు తెలిసింది. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. మామూలు రోజుల్లో వసతిగృహం వద్ద నలుగురు మహిళా రాత్రికాపలాదారులను ఏర్పాటు చేసి భద్రతను గాలికి వదిలేశారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. పోలీసులు సైతం తమదైన స్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని వారు వాపోతున్నారు. ఏదైనా ఘోరం జరిగితే తప్ప స్పందించేలా లేరని ప్రశ్నిస్తున్నారు. ఇంత పెద్ద వర్సిటీ ఉన్నప్పుడు పరిసరాల్లో ఏమేరకు భద్రత ఉంది?అక్కడి లోపాలు ఇతరత్రా అంశాలపై దృష్టి సారించాల్సిన పోలీస్ యంత్రాంగం జోద్యం చూస్తోందని విద్యార్థులు విమర్శిస్తున్నారు.

**ఎమ్మెల్యే అత్యవసర సమావేశం**

వసతిగృహం ప్రాంతంలో యువకులు రావడంపై ఎమ్మెల్యే శ్రావణి తీవ్రంగా స్పందించారు. ఆమె సోమవారం రాత్రి వర్సిటీని సందర్శించారు. వసతిగృహం వద్దకు వెళ్లి అమ్మాయిలతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం వర్సిటీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వర్సిటీ ప్రాంగణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, భద్రత పెంచాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీపీ సునీత, వర్సిటీ అధికారులు, తదితరులు ఉన్నారు.

**సీసీ కెమెరాలు ఏవీ?**

క్యాంపస్‌లో వందల మంది విద్యార్థినులు ఉన్న ప్రాంతంలో సీసీ కెమెరాలు లేవంటే ఇక్కడి భద్రతా చర్యలు ఎంత బలహీనంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా రాత్రిళ్లు పకడ్బందీ గస్తీతో పాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పరిష్కరించాం.. అంతే..!



చిత్తూరు : పుత్తూరు పురపాలిక పరిధిలోని మసీదు పక్కవీధిలో వర్షాలకు గుంతలుపడి ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పూడ్చాలని విశ్రాంత వెటర్నరీ సిబ్బంది రామ్మూర్తి పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ వీధిలో ప్రజలు వినతి అందజేసి మూడునెలలైనా ఇప్పటికీ గోతులు పూడ్చలేదు. సమస్యను మూడ్రోజుల్లో పరిష్కరించాల్సి ఉన్నా.. ఇంజినీర్లు పట్టించుకోలేదు. అయితే వచ్చిన అర్జీలన్నీ పరిష్కరించినట్లు అధికారులు చెప్పడం గమనార్హం. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం పురపాలికలో ప్రజల వినతులకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించడం లేదు. ప్రజలు అందించే అర్జీల్లో ఎన్ని పరిష్కరించారు.. ఇంకా ఎన్ని ఉన్నాయనే వివరాలు పక్కాగా ఉండాలి అనంతరం ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాలి. వీటిపై పారదర్శకత లేకపోగా అర్జీల్లో 80 శాతం పరిష్కరించినట్లు అధికారులు పేర్కొనడం గమనార్హం.

నగరిలో గత ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 18 వినతులు వచ్చాయి. అందులో 17 పరిష్కరించామని అధికారులు చెప్పడం విశేషం.

ప్రజల వినతులు బుట్టదాఖలవుతున్నాయి. జిల్లాలో చిత్తూరు నగరపాలకతోపాటు పుత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు పురపాలికలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రజలు అందిస్తున్న అర్జీలకు లెక్కాపక్కా ఉండటం లేదు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, చేతిబోర్ల మరమ్మతులు, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను మదింపు వంటి అంశాలను మాత్రమే పరిశీలిస్తున్నారు. మిగిలిన సమస్యలకు సంబంధించి అర్జీలు వచ్చినా వాటిని చెత్తబుట్టలో పడేస్తున్నారు. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక వంటి కీలక విభాగాలకు సంబంధించి సమస్యలు పరిష్కారం కాక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి. నగర, పురపాలికల్లో గత ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా అక్రమ లేఔట్లు వేశారు. ఆ ప్రాంతాల్లో కనీస వసతులు కరవే. దీంతో ఆయా ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకునే వాళ్లు అధికంగా రోడ్లు, కాలువల నిర్మాణానికి సంబంధించి అర్జీలు ఇస్తున్నారు. అవి పరిష్కారానికి నోచుకోవడం లేదు.

**గడువులోగా స్పందిచకపోతే చర్యలు - విశ్వనాథ్, ఆర్డీ, పురపాలక, పరిపాలనాశాఖ, అనంతపురం**

నగర, పురపాలికల్లో ప్రజలు నుంచి వస్తున్న అన్ని వినతులు పరిశీలించి నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాల్సిందే. రిజిస్టర్ నిర్వహించి అందులో నమోదు చేయాలి. ఎన్ని వినతులు వచ్చాయి. గడువు లోగా ఎన్ని పరిష్కరించామనే లెక్కలు ఉండాలి. వినతులు గడువులోగా పరిష్కరించకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

# టిడ్కో గృహాల అప్పగింతకు ప్రణాళిక

తిరుపతి : సొంత ఇల్లు ప్రతిఒక్కరి కల.. దాన్ని నెరవేర్చేందుకు నాడు తెదేపా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు గత వైకాపా పాలకులు గండికొట్టారు. నిరుపేదల కోసం చేపట్టిన టిడ్కో ఇళ్లపై కక్ష ఐదేళ్లూ సాధించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక మేరకు దృష్టిసారించి సత్వరం లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు సిద్ధమవుతోంది. నిరుపేదల కోసం జి౦3 విధానంలో ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు నాడు తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొత్తం 15,136 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,118 మందికి మాత్రమే ఇచ్చారు. అంటే 27.21% మంది లబ్ధిదారులకు మాత్రమే తాళాలు అందజేశారు.

**పూర్తిచేయలేక పాట్లు..**

జిల్లాలో మొత్తం రూ.811.33 కోట్ల విలువైన పనులకు అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఒప్పందాలు జరిగాయి. అందులో 740.94 కోట్ల పనులు (95%) పూర్తయ్యాయి. వైకాపా పాలకులు కనీస ఏర్పాట్లు పనులు పూర్తిచేయలేకపోయారు. ఇంటికి అవసరమైన కిటికీలు,



తలుపులు, ఇతర చిన్నచిన్న పనులు పూర్తిచేసి ఉంటే లబ్ధిదారులకు అందించేందుకు ఆస్కారం ఉండేది. కనీసం వాటిపైనా దృష్టిసారించలేదు. మౌలిక వసతుల ఏర్పాటు ఎక్కడికక్కడే ఆగింది.

**పనుల పెండింగ్ ఇలా..**

గూడూరు మినహా పనులు ఎక్కడా పూర్తికాలేదు. పుత్తూరులో కేవలం 72% పనులు పూర్తయ్యాయి. శ్రీకాళహస్తి-1లో 81%, శ్రీకాళహస్తి-2లో 91% పూర్తిచేశారు. శ్రీకాళహస్తి-1లో సుమారు రూ.14 కోట్లు, శ్రీకాళహస్తి-2లో రూ.10 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. నాయుడుపేటలో సుమారు రూ.15 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**రుణాలు ఇప్పించలేక...**

వైకాపా పాలకులు లబ్ధిదారులకు రుణాలు ఇప్పించడంలోనూ విఫలమయ్యారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు లబ్ధిదారులపైనే నెట్టేందుకు ప్రయత్నించారు. లబ్ధిదారులు ముందుకు రావట్లేదని, బ్యాంకు రుణాలకు సిబిల్ స్కోరు తక్కువగా ఉందని, అనేకమంది వలసలు వెళ్లినట్లుగా చెబుతూ వచ్చారు. ఇటీవల తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి పార్థసారథి టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని ప్రకటించారు. రూ.70 కోట్ల అవసరం ఉండగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

# సేవలకు దూరం.. సంఘాలకు భారం

అనకాపల్లి : మాకొద్దు బాబోయ్ అని సహకార సంఘాలు మొత్తుకున్నా వినకుండా రూ.లక్షలు పెట్టి గోదాములు నిర్మించేశారు. వీటితో ఆదాయం రాకపోగా వాటి నిర్మాణానికి తెచ్చిన అప్పుల భారంతో పీఏసీఎస్‌లు సతమతమవు తున్నాయి. వైకాపా హయాంలో తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలు ఇప్పుడు వ్యవసాయ సహకార సంఘాలకు తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. రైతు సేవా కేంద్రాలకు అనుసంధానంగా మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సర్వీస్ సెంటర్ల పేరుతో అనకాపల్లి జిల్లాలో తొమ్మిది చోట్ల గోదాములు నిర్మించారు. ఒక్కటి కూడా వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. వీటిలో కొన్ని సరకు నిల్వకు ఉపయోగపడే విధంగా లేవని ఇంజినీరింగ్ అధికారులు తాజాగా గుర్తించినట్లు తెలిసింది.

అనకాపల్లి జిల్లాలో మార్కెటింగ్ శాఖ పరిధిలో 9,522 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన గోదాములు ఉన్నాయి.

వీటిలో సుమారు 3,500 టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన నిల్వ కేంద్రాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. అయినా వాటిని లెక్కలోకి తీసుకోకుండా గత ప్రభుత్వం బహుళ ప్రయోజనాల కేంద్రాల పేరుతో 500 టన్నుల సామర్థ్యంతో కూడిన గోదాములను మంజూరు చేసింది. వాటి నిర్మాణానికి సహకార సంఘాల నుంచి రూ.40 లక్షల వరకు సొమ్ము వెచ్చించారు. పీఏసీఎస్‌లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా నాబార్డు నుంచి అప్పులు తెచ్చి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారు. ఎనిమిది గోదాముల నిర్మాణం పూర్తిచేశారు. వాటిలో రెండింటిని ఏడాది క్రితమే సహకార సంఘాలకు అప్పగించేశారు. ఇప్పటివరకు వాటిని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. మిగతా ఆరు గోదాములు కూడా సంఘాలకు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు.

**వాయిదాలు.. వడ్డీ.**

కశింకోట, నాగులాపల్లి, దిమిలి, శృంగవరం, రాంబిల్లి, కొత్తకోట, నాతవరం, బుచ్చెయ్యపేట సంఘాల పరిధిలో నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటి కోసం పీఏసీఎస్‌లు డీసీసీబీల నుంచి రూ.40 లక్షల రుణాలు తీసుకున్నాయి. వాటిని నాలుగు శాతం వడ్డీతో ఏడేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. గిడ్డంగి నిర్మించిన తర్వాత అందులో నిల్వచేసిన వస్తువులు, సరకులకు అద్దెలు వసూలు చేసి ఆ ఆదాయంతో అప్పులు తీర్చాలని చెబుతున్నారు. ఏడాది క్రితమే కశింకోట, నాగులాపల్లి పీఏసీఎస్‌లకు గోదాములు అప్పగించారు. వీటి నుంచి నయా పైసా ఆదాయం కూడా ఆ సంఘాలకు దక్కలేదు. ఏడాది పూర్తికావడంతో ఆయా సంఘాలు వాయిదా సొమ్ము రూ.5.3 లక్షలు డీసీసీబీకి చెల్లించాల్సి వచ్చింది. జీతాలకే ఇబ్బందులు పడాల్సి వస్తున్న వేళ గోదాముల ఖర్చు తలకు మించిన భారమవుతుందని పీఏసీఎస్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాణ్యత అంతంతమాత్రమే..**

గతంలో నిర్మించిన గోదాములు పరిస్థితి ఎలా ఉందని ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో డీసీసీబీ, మార్కెటింగ్, సహకార, వ్యవసాయ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. వాటిలో కొన్ని గిడ్డంగులు సరకు నిల్వకు అనువుగా లేనట్లు గుర్తించినట్లు సమాచారం. కొన్ని గోదాముల గోడలు చెమ్మగిల్లుతున్నాయి. షట్టర్లకు, ప్లాట్‌ఫామ్‌కు మధ్య ఖాళీ ఎక్కువగా ఉండడంతో ఎలుకలు, పందికొక్కులు సంచరించే ప్రమాదం ఉంది. పైకప్పులో ఎయిర్ బ్లోయర్లు ఏర్పాటు చేయలేదు.. జమాదులపాలెం, మరికొన్ని చోట్ల గోదాములకు వెళ్లేందుకు సరైన మార్గాలు లేవు. అనువుగాని చోట నిర్మించడంతో వాటిని అద్దెలకు తీసుకోవడానికి ముందుకు రావడం లేదని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో వీటన్నింటినీ ఒకే గుత్తేదారుకు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ అప్పటి సీఎంకు సన్నిహితునిగా చెప్పుకొంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి వెంటవెంటనే బిల్లులు చేయించేసుకున్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను మాత్రం గాలికొదిలేశారు. ఈ విషయమై జిల్లా సహకార శాఖ అధికారిణి ప్రేమస్వరూపరాణి వద్ద ప్రస్తావించగా, 'అప్పట్లో రెవెన్యూ అధికారులు అప్పగించిన ప్రాంతాల్లోనే నిర్మాణాలు చేశారు. వాటిని ఏవిధంగా వినియోగించుకోవచ్చని ఇటీవల సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు. ఆ నివేదికలు అందితేగానీ నాణ్యత గురించి చెప్పలేమ'న్నారు.

# మద్యం విక్రయాల్లో హద్దు మీరొద్దు!

అచ్యుతాపురం : గొలుసు దుకాణాలు లేకుండా చేయడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. బెల్టుషాపులు నిర్వహిస్తే తాను బెల్ట్ తీయాల్సి వస్తుందని సీఎం చంద్రబాబు హెచ్చరికలతో ఎక్సైజ్ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. మద్యాన్ని ఎమ్మార్పీకి మించి విక్రయించినా, గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసినా లైసెన్సు రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైకాపా ప్రభుత్వంలో నాసిరకమైన మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి మందుబాబుల ప్రాణాలతో ఆడుకున్నారు. పేదల రోజువారీ సంపాదనలో సగం మద్యానికే లాక్కున్నారు. నాసిరకమైన మద్యాన్ని రూ.200కు విక్రయించి ఐదేళ్లలో అనకాపల్లి జిల్లాలోనే రూ.4,716 కోట్లు పిండుకున్నారు. గత ఎన్నికల్లో మద్యం ప్రియులు వైకాపాపై పగబట్టి కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టారు. జిల్లాలో ఏడు ఎక్సైజ్ పోలీసు సర్కిల్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో అనకాపల్లి, చోడవరం, సబ్బవరంలో అత్యధికంగా 22 మద్యం దుకాణాలు ఉండగా నర్సీపట్నంలో 21, ఎలమంచిలిలో 20, పాయకరావు



పేట 18, వి.మాడుగుల్లో 13, గొలుగొండలో 8 ఉన్నాయి. వీటిపై పర్యవేక్షణ లోపం లేకుండా తనిఖీలు పెంచారు. కల్తీ, నాసిరకం మద్యం విక్రయిస్తూ చిక్కితే జరిమానాలు కాకుండా లైసెన్స్ రద్దు చేయడం, పునరుద్ధరించడానికి అవకాశం ఇవ్వని విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఉల్లంఘనలకు పాల్పడి తొలిసారి చిక్కితే రూ.1-2 లక్షలు, రెండోసారి రూ.2-5లక్షల వరకు భారీగా అపరాధ రుసుం వసూలు చేయనున్నారు. నాణ్యతను పరిరక్షించడానికి 13 పారామీటర్లను ఏర్పాట్లు చేశారు. నాణ్యతను తనిఖీ చేయడానికి గ్యాస్ క్రొమోటోగ్రఫీ అత్యాధునిక సాంకేతికను విశాఖలో అందుబాటులోకి ఉంచారు.

**నిరంతర తనిఖీలు** కల్తీ, గొలుసు దుకాణాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాం. డిపో నుంచి వచ్చిన సరకు, దుకాణాల్లో ఉండే సీసాలను పరిశీలిస్తున్నాం. భారీగా అపరాధరుసుం విధించడంతోపాటు మళ్లీ తప్పుచేస్తే ఏకంగా లైసెన్సును రద్దు చేస్తున్నాం. తేజో వెంకటకుమార్, ఎక్సైజ్ సీఐ, ఎలమంచిలి

# కందిపప్పు బొక్కేస్తున్నారు..



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలో కొందరు రేషన్ డీలర్లు ప్రభుత్వ రేషన్‌ను పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రాయితీపై వస్తున్న కందిపప్పును కార్డుదారులకు పంపిణీ చేయకుండా నల్లబజారులో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా పౌరసరఫరాలశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతోపాటు తూకాల్లో మోసం చేస్తూ చక్కెర, జొన్నల పంపిణీలోనూ రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. అయినా ఉన్నతాధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారనే ఆరోపణలున్నాయి.

**20 శాతమే పంపిణీ**

ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ వరకు రేషన్ డీలర్లకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు, జొన్నలు సరఫరా చేస్తున్నారు. డీలర్లు వాటిని 18వ తేదీ వరకు తమ పరిధిలోని కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో రూ.160 వరకు పలుకుతోంది. ప్రభుత్వం రాయితీతో రూ.67కే అందిస్తోంది. దీన్నే కొందరు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. తమకు వచ్చిన సరకులో 20 శాతం మాత్రమే కార్డుదారులకు సరఫరా చేసి ఆ తర్వాత వచ్చిన వారికి స్టాక్ లేదని చెప్పి బియ్యం మాత్రమే ఇచ్చి పంపిస్తున్నారు. బియ్యం కోసం బయోమెట్రిక్ వేస్తున్న సమయంలోనే కందిపప్పు కూడా ఇచ్చినట్లు మిషన్‌లో నమోదు చేసుకుంటున్నారు. దీంతో కార్డుదారులకు అనుమానం రావడం లేదు. అలా మిగిల్చుకున్న సరకును నల్లబజారులో కిలో రూ.130 వరకు విక్రయిస్తున్నారు. కిలోపై రూ.63 చొప్పున సంపాదిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇలా ఒక్కో రేషన్ దుకాణంలో 200 నుంచి 300 ప్యాకెట్ల వరకు నొక్కేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సగటున రెండు జిజిల్లాల్లో కలిపి సుమారు 200 నుంచి 300 మెట్రిక్ టన్నుల వరకు పక్కదారి పడుతోంది.

**ఫిర్యాదులు చేస్తున్నా స్పందించని తీరు**

డీలర్లు ఇష్టారీతిన సరకులు నొక్కేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి కార్డుదారుడికి సరకులు పంపిణీ చేసే సమయంలో బయోమెట్రిక్ నమోదు చేసిన తర్వాత తప్పనిసరిగా రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రేషన్ డీలర్లు ఎక్కడా ఇవ్వడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేని చాలామంది బియ్యం మాత్రమే తీసుకుని వచ్చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఈనెల 20 శాతం తక్కువగా కందిపప్పు సరఫరా అయ్యింది. అందులోనూ రేషన్ డీలర్లు 60 నుంచి 70 శాతం నొక్కేస్తుండటంతో చాలాచోట్ల కార్డుదారులకు కందిపప్పు అందడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని గ్రామీణులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం చెందుతున్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో 137, గ్రామీణం పరిధిలో 85 రేషన్ దుకాణాలుండగా చాలాచోట్ల కందిపప్పు పూర్తిగా సరఫరా చేయడం లేదు. ఆయా దుకాణాలకు నెలకు 140 క్వింటాళ్ల వరకు సరకు సరఫరా అవుతోంది. అయితే డీలర్లు సగం వరకు నొక్కేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో 20 శాతానికి మించి ఇవ్వడం లేదని క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా స్పష్టమవుతోంది.

రాప్తాడు మండల పరిధిలో రేషన్ డీలర్లకు 70 శాతమే కందిపప్పు సరఫరా చేశారు. కొన్ని షాపులకు 50 శాతమే ఇవ్వడంతో వారు ఒక్క ప్యాకెట్ కూడా పంపిణీ చేయకుండా తమవద్దే ఉంచుకుంటున్నారు. ఈ సాకుతోనే కొందరు డీలర్లు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. **క్రిమినల్ కేసులు పెడతాం- వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, అనంతపురం** రేషన్ తీసుకున్న తర్వాత ప్రతిఒక్కరూ రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. అందులో నమోదు చేసిన సరకుల్లో ఏది ఇవ్వకపోయినా నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. డీలర్లు ఎవరైనా కందిపప్పును పక్కదారి పట్టించినట్లు తేలితే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. క్షేత్రస్థాయిలో సీఎస్‌డీటీలతో విచారణ జరిపిస్తాం.

# విత్తనాభివృద్ధి క్షేత్రానికి పూర్వ వైభవమెన్నడో...?



చిత్తూరు : వ్యవసాయంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ఆశించిన దిగుబడులు లేక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ప్రభావం సాగు విస్తీర్ణంపై పడుతోంది. సేద్యం లాభసాటిగా మారడంలో నాణ్యమైన విత్తనాలు కీలకం. ప్రయోగ పరీక్షల అనంతరం శ్రేష్ఠమైన విత్తనాలు అందించాలనే సంకల్పంతో గంగాధరనెల్లూరు మండలం మహదేవమంగళంలో ఏర్పాటు చేసిన విత్తనాభివృద్ధి క్షేత్రానికి దశాబ్దాలుగా ప్రభుత్వ సహకారం కొరవడింది. కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపాలని రైతాంగం కోరుతోంది.

**306 ఎకరాలు.. వందలాది మంది సిబ్బంది**

1962లో మహదేవమంగళం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 306 ఎకరాల్లో విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని నెలకొల్పాయి. ప్రారంభంలో వరి, రాగి, కంది, పెసలు, వేరుసెనగ, జొన్నలు, సజ్జలు వంటి పలు రకాల పంటలు సాగు చేసేవారు. నాణ్యమైన విత్తనాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సరఫరా చేశారు. 50 మంది ఉద్యోగులు, వందలాది మంది సిబ్బంది నిమగ్నమయ్యేవారు. మామిడి, టేకు, కొబ్బరి మొక్కల్లోనూ కొత్త తరహా వంగడాలు ఉత్పత్తి చేసిన ఘనచరిత్ర క్షేత్రానికి ఉంది.

**భూగర్భ జలమట్టం పడిపోయిందని..**

1990 ప్రాంతంలో జిల్లాలో కరవు తాండవం చేసింది. ఈక్రమంలోనే భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. విత్తనాభివృద్ధి క్షేత్రంలోని బోర్లు ఎండిపోయాయి. దీంతో ప్రయోగాలు నిలిపేశారు. ఉద్యోగులు, సిబ్బందిని ఆయా శాఖలకు పంపారు. తర్వాత పరిస్థితిలో మార్పువచ్చినా ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. భూమి నిరుపయోగంగా ఉందంటూ 60 ఎకరాల స్థలాన్ని 400 కేవీ ఉప కేంద్రానికి అప్పగించారు. ఇటీవల మరో 125 ఎకరాలను పోలీసు శాఖకు కేటాయించే ప్రయత్నం జరిగింది. నర్సరీ ఏర్పాటుకు కొంత ప్రాంతాన్ని డ్వామాకు అప్పగించగా.. మిగతా స్థలంలో ప్రస్తుతం విత్తనాభివృద్ధి అన్నదే లేదు.

**తమిళనాడు, కర్ణాటకకూ అంటుకట్టిన మొక్కలు**

ఉద్యాన రైతుల ఆదాయాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో కుప్పం మండలం పెద్దబంగారునత్తంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) స్థాపించారు. 22.68 ఎకరాల్లో రూ.10 కోట్లతో 2019 జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. పూలు, కూరగాయలకు అంటుకట్టి నాణ్యమైన మొక్కలను రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకకూ ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు. వీటిద్వారా నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తున్నాయి. రాష్ట్రంలోని రైతులకు రాయితీపై ఇస్తున్నందున డిమాండ్ సైతం ఎక్కువగా ఉంది. సీవోఈకి ఏటా ఆదాయం సైతం పెరుగుతోంది. ఇదేతరహాలో మహదేవమంగళం విత్తనాభివృద్ధి క్షేత్రానికి పూర్వవైభవం తెస్తే అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుంది.

# శిథిలమైన భవనం.. భారమైన ఆతిథ్యం..!

విశాఖపట్నం : నగర పర్యటనకు వచ్చే గవర్నర్, ముఖ్యమంత్రి, స్పీకర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, ఐఏఎస్ అధికారులు, ఇతర ప్రముఖులకు వసతి కల్పించే అతిథి గృహం (గవర్నర్ బంగ్లా) శిథిలావస్థకు చేరింది. నాటి వైకాపా ప్రభుత్వం భవన నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో... వసతులన్నీ కనుమరుగయ్యాయి.

భవనం మొదటి అంతస్తులో ఉన్న నాలుగు గదులు పూర్తిగా పాడయ్యాయి. దిగువ అంతస్తులోని మూడు గదుల్లో ఒకటి మినహా రెండు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ పైకప్పు పెచ్చులు, సీలింగ్ ఊడిపోవడంతో పాటు, వర్షం నీరు లీకవుతోంది. దీంతో ఆయా గదుల్ని అతిథులకు కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఒకటో నెంబర్ సూట్ మాత్రమే అందుబాటులో ఉండడంతో... అప్పుడప్పుడు ఒక్కొక్కరికి కేటాయిస్తున్నారు.

**నిధుల విడుదల లేక...!**

నగరానికే తలమానికంగా ఉండే గవర్నర్ బంగ్లాకు గతంలో నిత్యం ప్రముఖుల తాకిడి ఉండేది. ప్రస్తుతం భవనం అధ్వానంగా మారడంతో అతిథులంతా హొటల్స్‌కు వెళుతున్నారు. ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు బంగ్లాకు వచ్చి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు.



బంగ్లా ఆవరణలోని సహాయకులు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగుల కోసం ఉన్న భవనాలు వినియోగించలేని స్థితిలో ఉన్నాయి. వైకాపా హయాంలో భవనం మరమ్మతులకు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా.. అవసరమైన నిధులు విడుదల చేయలేదు.

**పెరుగుతున్న ఖర్చులు**

బంగాల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో నగరానికి వచ్చే ప్రముఖులకు స్టార్ హొటల్స్‌లో వసతి కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రొటోకాల్ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే ప్రొటోకాల్ బకాయిలు రూ.8 కోట్ల వరకు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో హొటల్స్ యజమానులు, వాహనాలు సమకూర్చే గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఇంకొందరు అతిథులు**

ఇటీవల నగరంలో జరిగిన డీప్‌టెక్ సదస్సుకు హాజరైన మంత్రులు, ఐఏఎస్ అధికారులతో పాటు ఇతర పనులపై వచ్చిన అసెంబ్లీ కమిటీ సభ్యులు, ఛైర్మన్ హొటల్స్‌లోనే బస చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి..మరమ్మతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బంగ్లాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలంటే రూ.2 కోట్లు అవసరమని, ఈ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

# బెయిలొచ్చిందా.. తిరిగొస్తే ఒట్టు!

చోడవరం : గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకు వెళుతున్నారు. కొన్ని రోజులకు బెయిల్‌పై బయటకు వస్తున్నారు. తర్వాత కోర్టు విచారణకు హాజరు కావడం లేదు. వారిలో చాలామంది జాడ కూడా ఉండటం లేదు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిని విచారించే సమయంలో మరికొందరి బయట వ్యక్తుల ప్రమేయమూ వెలుగు చూస్తోంది. పోలీసులు వారిపైనా కేసులు నమోదు చేస్తున్నారు. అరెస్టు చేయడానికి వెళ్తే పత్తా లేకుండా పోతున్నారు. విశాఖ రేంజ్ పరిధిలోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో 900 మందికిపైగా తప్పించుకు తిరుగుతున్నారు. వీరి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి గత ఐదు నెలలో 237 మందిని పట్టుకున్నారు. మిగతా వారి కోసం గాలిస్తూనే ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రోజూ ఎక్కడో ఒకచోట గంజాయి పట్టుపడుతూనే ఉంది. నిందితుల్లో కొందరు పోలీసులకు చిక్కితే మరికొందరు తప్పించుకుపోతున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నారు. వీరిలో కొందరు బెయిల్‌పై వచ్చాక పోలీసులకు కనిపించకుండా తిరుగుతున్నారు. కోర్టు వాయిదాలకు హాజరుపరచాలని సమన్లు జారీ అవుతున్నా నిందితుల ఆచూకీ దొరక్క, కేసుల పురోగతి ముందుకు వెళ్లడం లేదు. చోడవరం కోర్టు పరిధిలోనే 2019 తర్వాత బెయిల్‌పై వచ్చి తదుపరి విచారణకు హాజరుకాని వారు 27 మంది వరకు ఉన్నారు. వీరిలో 16 మందిపై నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు జారీ అయ్యాయి. వీరి కోసం గాలిస్తున్నట్లు చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పాపునాయుడు చెబుతున్నారు. ఇక్కడే కాదు.. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోనూ పరారీ నిందితులు భారీగానే ఉన్నారు. వీరి కోసం 29 ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిందితుల్లో ఎక్కువ మంది బయట రాష్ట్రాలకు చెందిన వారు ఉండటంతో వారిని పట్టుకుని తీసుకురావడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

**వారిపై గంజా షీట్లు**

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గంజాయిపై ఉక్కుపాదం మోపేలా చర్యలు తీసుకుంటున్నారు. విశాఖ రేంజ్ పరిధిలో ఈ ఐదు నెలల్లో సుమారు 12 వేల కేజీల గంజాయిని పట్టుకున్నారు. 476 మందికిపైగా అరెస్టు చేశారు. నిందితుల్లో ఎక్కువ మంది ఒకటి కంటే ఎక్కువ సార్లు



పట్టుబడుతున్న వారున్నారు. అలాంటి వారిలో 247 మందిపై గంజా షీట్లు (రౌడీ షీట్లు మాదిరిగా) తెరిచారు. మరో 21 కేసుల్లో నిందితులపై పీడీ చట్టం ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో గంజాయి సాగు చేసిన రైతుల వివరాలను సర్వే నంబర్ల ఆధారంగా గుర్తించి వారికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు ఇవ్వడంతోపాటు ఇకపై గంజాయి సాగు చేపట్టబోమని లేఖలు తీసుకుంటున్నారు. ఇటీవల కొంతమంది జి.మాడుగుల ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్నట్లు డ్రోన్లతో గుర్తించి పంటను ధ్వంసం చేయడమే కాకుండా సంబంధిత రైతులపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యం సేవిస్తున్న వారిని డ్రోన్ల సాయంతో గుర్తించి పట్టుకుంటున్నారు. గంజాయి కట్టడికి బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు డీఐజీ గోపీనాథ్ జెట్టి 'ఈనాడు'కు వివరించారు. సాగు, రవాణాపైనే కాదు వినియోగంపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 948 విద్యా సంస్థల్లో మూడు వేలకుపైగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, 86 మందిని వ్యసన విముక్తి కేంద్రాల్లో చేర్పించినట్లు వెల్లడించారు. గంజాయి నిందితులు ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, అందరిని పట్టుకుని శిక్షపడేలా చేస్తామని పేర్కొన్నారు.

# ఐదేళ్లు.. అక్రమాల ఆనవాళ్లు!!

విశాఖపట్నం : వైకాపా అయిదేళ్ల పాలనలో 'సింహాచలం' అప్పన్న కొండను వివాదాలకు కేంద్రంగా మార్చేశారు. మరో వైపు దేవస్థానం భూములను కబ్జా చేశారు. గ్రావెల్ దందాకు పాల్పడ్డారు. అక్కడితో ఆగకుండా వంశపారంపర్యంగా వస్తున్న ధర్మకర్తలి మండలి ఛైర్మన్ హోదా నుంచి అశోక్ గజపతిరాజును తప్పించారు. తప్పుడు కేసులు నమోదు చేయాలని చూశారు. చివరికి న్యాయస్థానం ద్వారా ఆ హోదాను దక్కించుకునే పరిస్థితికి తెచ్చారు. అప్పటి ఈవోను తప్పించి విజిలెన్స్ విచారణకు ఆదేశించినా ఫలితం లేకపోయింది. ఎంత తవ్వారు, దానికి బాధ్యులు ఎవరనేది బయటకు రాలేదు. అప్పట్లో జరిగిన అవకతవకలపై 'విజిలెన్స్' రంగంలోకి దిగినా రాజకీయ ఒత్తిళ్లతో అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం నాటి అక్రమాలపై విచారణ చేయిస్తుందనుకుంటే ఇప్పటికీ ఆ దిశగా కార్యాచరణ లేదనే విమర్శలు వస్తున్నాయి.

**2019 గ్రావెల్ దందా**

సింహాచలం కొండకు వెళ్లే దారిలో కొత్త ఘాట్ రోడ్డుకు సమీపంలో గ్రావెల్ తవ్వకాల ద్వారా భారీ అక్రమాలకు పాల్పడ్డారు. వేల టన్నుల గ్రావెల్ పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. ఓ కీలక అధికారి అండతోనే ఇదంతా జరిగింది. ఇందులో నాటి పాలకుల హస్తం ఉందని సమాచారం. ఇష్టానుసారంగా తవ్వేసి అమ్ముకున్నారు.

**2020 భూముల్లో దారుణాలు**

అప్పట్లో దేవస్థానం ఉద్యోగులే కొందరు భూముల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారు. ఉన్న భవనాలపై అదనపు నిర్మాణాలకు సహకరించారు. ఇందులో నలుగురు ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు దేవాదాయశాఖ ఎస్టేట్ విభాగం గుర్తించింది. సొమ్ములు చేతులు మారినట్లు నివేదికిచ్చింది. వీటిని గుర్తించకపోవడంపై అప్పటి భూపరిరక్షణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను బదిలీ చేసి ఈవోను సరెండర్ చేశారు. ఇంత జరిగినా సూత్రధారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**2021 ఇంజినీరింగ్ పనుల్లో**

కొండపై జరిగిన ఇంజినీరింగ్ పనులపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. కొన్ని పనులకు జరిగిన టెండర్లలో అవకతవకలు జరిగాయనే విమర్శలున్నాయి. దీని మీద 2021లో విజిలెన్స్ విచారణకు ఆదేశించినా... ఆ తరువాత పట్టించుకోలేదు.

**2022 భూములపై కన్నేసి...**

అప్పన్న ఆలయానికి అడవివరం, వేపగుంట, మాధవధార ప్రాంతాల్లో విలువైన భూములున్నాయి. వీటిల్లో కొన్నింటిపై దేవస్థానానికి, ప్రైవేటు వ్యక్తుల మధ్య ఆది నుంచి వివాదాలున్నాయి. ఇటీవల కొన్ని కేసుల్లో దేవస్థానం విజయం సాధించింది. అప్పట్లో కొన్నింటి విషయంలో కావాలనే కౌంటర్లు దాఖలు చేయలేదన్న విమర్శలున్నాయి. వీటిపై దేవాదాయశాఖకు ఫిర్యాదులు అందినా దృష్టిసారించలేదు.

**2023 చందనోత్సం**

ఈ ఏడాది చందనోత్సవం నిర్వహణ తీరు తీవ్ర వివాదాస్పదమైంది. భక్తులు ఊహించని అసౌకర్యానికి గురయ్యారు. అధిక సంఖ్యలో నకిలీ టికెట్లు బయటపడ్డాయి. దీనిపై తూతూమంత్రంగా విచారణ జరిపి వదిలేశారు. అక్రమాలు నిగ్గుతేల్చలేదు.

**2024 నెయ్యి వివాదం**

సింహాచలం దేవస్థానం తక్కువ ధరకు నెయ్యి కొనుగోలు చేస్తున్న విషయం చర్చనీయాంశమయింది. గతంలో ఉన్న సరఫరాదారులను కాదని చాలా తక్కువకు విక్రయిస్తామని ముందుకొచ్చిన గుత్తేదారు టెండర్లను ఆమోదించారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం బయటకు వచ్చిన తరువాత... జరిగిన తనిఖీల్లో సింహాచలంలో సాగిన నెయ్యి కొనుగోళ్ల తీరు వెలుగులోకి వచ్చింది.

# కేసీలో రూ.కోటి మేత

నంద్యాల : నీరు-చెట్టు పథకం కింద ఓ గుత్తేదారు చేసిన పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వీటికి బిల్లులు చేయకుండా అధికారులు పక్కన పెట్టేశారు. అప్పటి అధికారులు బదిలీ కావడం.. వారి స్థానంలో కొత్తగా వచ్చిన అధికారులు బిల్లులు చేసి 'స్వామి భక్తి'ని చాటుకున్నారు. రూ.కోట్లలో అవినీతి జరిగిందని రికార్డు చేసిన పనికి.. లోపాయికారి ఒప్పందం చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు చేయడం చర్చనీయాంశమైంది. ఇది ఇలా ఉండగా నీరు- చెట్టు పనుల్లో అక్రమాలకు పాల్పడిన 12 మంది గుత్తేదారుల నుంచి విజిలెన్స్ అధికారులు గతంలో నిధుల రికవరీకి ఆదేశించారు. ఈ పనులకు సంబంధించిన బిల్లులను నిలుపుదల చేశారు. ప్రస్తుతం విజిలెన్స్ తప్పుపట్టిన పనుల్లో కొన్నింటికి బిల్లులు కావడంతో.. గతంలో బిల్లులు నిలిచిపోయిన మిగతా గుత్తేదారులు కూడా కేసీ కాల్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే కొంతమంది బిల్లులు తయారు చేయించి అధికారుల వద్ద దస్త్రాలను సిద్ధంగా ఉంచినట్లు సమాచారం.

**నామినేషన్ పద్ధతిపై పనులు**

జిల్లా కేంద్రం నంద్యాల చిన్న చెరువు, పెద్ద చెరువుల్లో 2018-19లో నీరు- చెట్టు పథకం కింద పూడికతీత పనులు జరిగాయి. ఈ పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. నంద్యాల నియోజకవర్గానికి చెందిన ఓ వైకాపా నాయకుడు వాటిని అడ్డదారిలో దక్కించుకున్నారు. తన పేరుపై చేస్తే ఇబ్బందులు తప్పవని భావించి తన బినామీ అయిన గుత్తేదారుకు ఈ పనులు వచ్చేలా చక్రం తిప్పి సాధించుకున్నారు. దస్త్రాల పరంగా పనులు పూర్తయినట్లు చూపారు. క్షేత్రస్థాయిలో మాత్రం వాటి ఆనవాళ్లు కనిపించని పరిస్థితి. దస్త్రాల్లో లెక్కలు ఒక రకంగా ఉంటే.. క్షేత్రస్థాయిలో పనులు మరో రకంగా జరిగాయి. పూడిక తీత పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు.

**వారు ఆపితే.. వీరు చెల్లించారు**

కేసీ కాల్వ విభాగంలో రెండు నెలల కిందట కొందరు అధికారులు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో గతంలో పనిచేసిన అధికారులు పక్కన పెట్టిన పెద్ద, చిన్న చెరువుల్లో జరిగిన నీరు-చెట్టు పనులకు సంబంధించిన బిల్లులను కొత్తగా వచ్చిన అధికారులు 'ఒకే' చేశారు. విజిలెన్స్ అక్రమం అని తేల్చినా సరే లెక్క చేయలేదు. నిబంధనలను పక్కనపెట్టి రూ.కోటి బిల్లులు చేశారు. ఈ బిల్లులను పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి పంపగా అక్కడ కూడా 'ఒకే' చేశారు. దీంతో గుత్తేదారుకు ఇటీవల రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. సాధారణంగా బిల్లులు ఒకే చేసేటప్పుడు రాష్ట్రంలోని వివిధ కార్యాలయాలకు గుత్తేదారుకు బిల్లులు చేస్తున్నట్లు సమాచారం ఇస్తారు. ఎందుకంటే సదరు గుత్తేదారు నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు, జీఎస్టీ, ఆదాయపు పన్ను, ఇతర రుసుములు చెల్లించాల్సి ఉంటే వాటిని మినహాయించుకుని మిగతా నిధులు విడుదల చేస్తారు. కేసీ కాల్వ అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా రూ.కోటి చెల్లించారు. ఇందులో ఓ ఉన్నతాధికారి కీలకంగా వ్యవహరించారు. ఈయన హయాంలోనే గతంలో ఈ పనులకు సంబంధించి నిధుల రికవరీకి ఆదేశాలు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈయన ఆధ్వర్యంలోనే చెల్లింపులు జరగడం గమనార్హం. కొత్తగా వచ్చిన కొంతమంది ఏఈలు, డీఈలు ఇతనికి తమవంతు సహకరించారు. బిల్లుల మంజూరులో కొన్నేళ్లుగా సాగునీటి శాఖలో చక్రం తిప్పుతున్న ఓ మాజీ అధికారి పాత్రపై అనుమానాలున్నాయి.

**రూ.10 కోట్ల రికవరీకి ఆదేశం** చిన్నచెరువు, పెద్ద చెరువు పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చారు. గుత్తేదారు నిబంధనలు పాటించకుండా అవినీతి పాల్పడినట్లు నివేదిక ఇచ్చారు. విజిలెన్స్ కమిటీ నివేదికతో పనుల్లో జరిగిన అక్రమాలకు గుత్తేదారును బాధ్యుడిని చేస్తూ బిల్లు నిలుపుదల చేశారు.

చురకలు



## చీరకట్టులో అందాల రాశి.. స్టన్నింగ్ లుక్స్

రాశి ఖన్నా.. టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి. 2014లో విడుదలైన ఊహలు గుసగుసలాడే సినిమాతో మొదలైన అమ్మడి ప్రయాణం ఆ తరువాత హడావుడిగానే కొనసాగింది. హీరోయిన్ గా మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో, రాశి ఖన్నా తర్వాత వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. సుప్రీం, జిల్, తొలిప్రేమ వంటి చిత్రాల్లో నటించి, నటనలో తనకంటూ ఓ ముద్ర వేశారు. టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల్లోనూ రాశి తన అందం, ప్రతిభతో ఆకట్టుకుంది. అలాగే బాలీవుడ్‌లో కూడా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న అమ్మడు.. మద్రాస్ కేఫ్ వంటి హిందీ చిత్రాలతో పాటు, తమిళ సినిమాల్లోనూ మంచి అవకాశాలను దక్కించుకుంది. ఆమె కెరీర్‌లో బెస్ట్ సినిమాలలో ఇమైక్క నొడిగల్ తమిళ సినిమా. ఈ చిత్రంలో ఆమె నటనకు విశేషమైన ప్రశంసలు లభించాయి.రాశి ఖన్నా తన సినీ ప్రయాణంలో గ్లామర్ పాత్రలతో పాటు, డిఫరెంట్ కంటెంట్ ఉన్న పాత్రలను కూడా ఎంపిక చేసుకుంటూ ముందుకు



సాగుతున్నారు. తాజాగా రాశి ఖన్నా పొంగల్ సందర్భంగా విషెస్ అందిస్తూ ఎర్రని చీరలో మెరిసిపోతూ దిగిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. సంప్రదాయ వస్త్రధారణలో స్టైలిష్‌గా కనిపిస్తూ, రాశి తన అందంతో అభిమానులను ఎట్రాక్ట్ చేసింది. ఈ చీరకు తగ్గట్టు మెరిసే బ్లౌజ్ ధరించి, సింపుల్ జువెలరీతో స్టన్నింగ్ లుక్‌లో ఆమె కనిపించారు. సూర్య కాంతి పడ్డ లైటింగ్‌లో, ఆమె ముఖ కాంతి మరింత అందంగా మెరవడం నెటిజన్లను విపరీతంగా ఆకర్షించింది. ఇక రాశి ఖన్నా ఫోటోలకు సంబంధించిన ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె అందంగా కనిపించే ఈ ఫోటోలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

“కణ్మణి” అని క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలకు కలెక్షన్ లక్షల్లో లైకులు వచ్చాయి. ఈ చీరలో ఆమె చూపించిన ఆహార్యం, ఆమె వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేస్తూ, ట్రెడిషనల్ లుక్‌లో కూడా ఆమె ఎంత అందంగా ఉంటారో చూపించారు. ప్రస్తుతం రాశి ఖన్నా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా రు. ఒక హిందీ సినిమాతో పాటు, తమిళంలో కూడా ఓ ప్రముఖ హీరోతో సినిమా చేస్తుంది. అంతేకాకుండా, తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా అనే సినిమా లైన్ లో ఉంది. ఇక అమెజాన్ ప్రైమ్ కోసం రూపొందుతున్న ఓ వెబ్‌సిరీస్‌లో కూడా రాశి కీలక పాత్ర పోషిస్తున్నారు. .

## సూపర్‌హీరో మూవీలో వామిక జాక్‌పాట్?

2025 ప్రముఖ బాలీవుడ్ కథానాయిక వామిక గబ్బికి ప్రత్యేక సంవత్సరం కానుంది. ఈ ఏడాదిలో రెండు భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది వామిక. వీటిలో ఒకటి అక్షయ్ కుమార్ తో భూత్ బంగ్లా. మరొకటి రణవీర్ సింగ్ సరసన సూపర్ హీరో సినిమాలో నటించే వీలుందని కథనాలొస్తున్నాయి. బాలీవుడ్ లో ఒక్కో సినిమాతో తనదైన ముద్ర వేస్తూ వామిక గబ్బి అగ్ర హీరోయిన్ రేసులోకి చేరుకుంది. ఇటీవల చాలామంది సీనియర్ నటీమణులకు దక్కాల్సిన ఛాన్సుల్ని ఈ కుర్రబ్యూటీ తన ఖాతాలో వేసుకుంటోంది. అక్షయ్ కుమార్ ‘భూత్ బంగ్లా’ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం జైపూర్‌లో భూత్ బంగ్లా షూటింగ్‌లో ఖిలాడీ అక్షయ్ పాల్గొంటున్నారు. ఇప్పుడు వామికా గబ్బి అతడితో సెట్స్‌లో చేరింది. తాజాగా వామికా గబ్బి ఇన్‌స్టాగ్రామ్‌లో



ఒక వీడియోను షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతోంది. ‘దిల్ కా దర్వాజా ఖోల్ దో నా డార్లింగ్’ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, జయా బచ్చన్‌లతో కలిసి వామిక నటిస్తోంది. ఆదిత్య రాయ్ కపూర్ – సమంతా రూత్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘రక్త్ బ్రహ్మాండ్’ వెబ్ సిరీస్‌లో కూడా భాగం కానుంది. నాని సరసన ఓ తమిళ చిత్రంలో నటించనుందని టాక్ ఉంది. అయితే వీటన్నిటిలో సూపర్ హీరో మూవీలో ఆఫర్ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు బాసిల్ జోసెఫ్ తెరకెక్కించనున్న సూపర్ హీరో సినిమాలో రణ్‌వీర్ సింగ్ సరసన కథానాయిక పాత్రకు వామికా పోటీపడుతోందని బలంగా టాక్ వినిపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు అనుకూలిస్తే వామికా ఈ పాత్రను దక్కించుకునే అవకాశం ఉంది. గతంలో బాసిల్ జోసెఫ్ తెరకెక్కించిన మలయాళ చిత్రం ‘గోధా’లో నటించింది, దీంతో వామిక సూపర్ హీరో మూవీలో ఛాన్స్ కొట్టేయడం ఖాయమని చెబుతున్నారు.




## కంగన ఎమర్జెన్సీకి మరో ఎదురు దెబ్బ



మాజీ భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా రూపొందిన పొలిటికల్ డ్రామా ఎమర్జెన్సీ త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. సెన్సార్ గడపపై చాలా అడ్డంకులను ఎదుర్కొన్న ఎమర్జెన్సీ ఎట్టకేలకు కొన్ని కట్స్ తో విడుదలకు రెడీ అవుతోంది. అయితే రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ సినిమాను బంగ్లాదేశ్‌లో నిషేధించారు. తాజా మీడియా కథనాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లో ఎమర్జెన్సీ ప్రదర్శనను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సమాచారం. సినిమా కంటెంట్ దీనికి కారణం కాదు.. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ అనైక్యత దీనికి కారణం. భారతదేశం– బంగ్లాదేశ్ మధ్య దెబ్బతిన్న సంబంధాలకు సంబంధించిన వ్యవహారమిది. ఎమర్జెన్సీ భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితకథ. ఇందిర కథలో బంగ్లాదేశ్ కి స్థానం ఉంది. పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్‌ను విభజించడంలో ఇందిరా గాంధీ చురుకైన పాత్ర పోషించారు. 1971 యుద్ధంలో భారతదేశం పాల్గొనడంతో చివరికి అది బంగ్లాదేశ్ ఏర్పాటుకు పరిస్థితి దారితీసింది. అత్యవసర పరిస్థితిలో 1971 బంగ్లాదేశ్ స్వాతంత్ర్య యుద్ధంలో భారత సైన్యం, గాంధీ ప్రభుత్వ పాత్రను బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజిబుర్ ఎంతగానో కీర్తించారు. రెహమాన్‌తో ఇందిరా గాంధీ గొప్ప సత్సంబంధాలను కొనసాగించారు. భారతదేశం పాకిస్తాన్‌పై యుద్ధంలో విజయం సాధించిన తర్వాత ఇందిరా గాంధీ దేవత దుర్గా అని రెహాన్ సంబోధించారు. యుద్ధ సమయంలో ఆయనకు భారతదేశం నుండి కీలకమైన మద్దతు లభించింది. ఇది అత్యవసర పరిస్థితిలో ముఖ్యమైన పాత్ర పోషించింది. బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఇందిర ప్రమేయం కారణంగా, తీవ్రవాదులు అతడిని ఇంట్లోనే హతమార్చారు. చాలా కాలంగా బంగ్లాదేశ్ తో ఇండియా సంబంధాలు నీటి మూటలా మారాయి. రకరకాల కారణాలతో ఇప్పుడు ఎమర్జెన్సీ సినిమాని బంగ్లాదేశ్ లో రిలీజ్ చేయకూడదని ఆంక్షలు విధించారు. అయితే నిషేధానికి సినిమాలో కంటెంట్ ఎంతమాత్రం కారణం కాదని కూడా వెల్లడైంది.

## రవితేజ మాస్ జాతర.. ఆ కిక్కు గ్యారెంటీనా..?




సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు సితార ఎంటర్టైన్మెంట్స్ సూర్యదేవర నాగ వంశీ. స్టార్ సినిమాలు స్మాల్ బడ్జెట్ సినిమాలు రెండిటినీ కూడా సూపర్ గా బ్యాలెన్స్ చేస్తూ నాగ వంశీ మంచి ప్లానింగ్ తో వస్తున్నారు. ఒక సినిమా రిలీజ్ అయ్యింది అంటే నెక్స్ట్ వెంటనే మరో సినిమా రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ సంక్రాంతికి ఆయన బ్యానర్ నుంచి డాకు మహారాజ్ సినిమా వస్తుంది. బాలకృష్ణ హీరోగా బాబీ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా మీద అంచనాలు ఎలా ఉన్నాయో అందరికీ తెలిసిందే. ఈ సినిమా తర్వాత మార్చి ఎండింగ్ లో విజయ్ దేవరకొండ సినిమాతో వస్తున్నాడు. ఐతే ప్రస్తుతం సితార బ్యానర్ లో మాస్ మహారాజ్ రవితేజ హీరోగా మాస్ జాతర సినిమా వస్తుంది. ఈ సినిమాను భాను భోగవరపు డైరెక్ట్ చేస్తున్నారు. ధమాకా కాంబో హీరోయిన్ శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా గురించి నాగ వంశీ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. మాస్ మహారాజ్ రవితేజ ఈమధ్య వరుస సినిమాలైతే చేస్తున్నారు కానీ అందుకు తగిన రిజల్ట్ మాత్రం అందుకోవట్లేదు. ధమాకా తర్వాత వాల్తేరు వీరయ్య అది కూడా చిరంజీవి కాంబోలో హిట్ అనిపించుకుంది. సోలో హిట్ కోసం అటు రవితేజ ఇటు మాస్ రాజా ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. రవితేజ మాస్ జాతర మీద అంచనాలు పెంచేస్తున్నాడు నిర్మాత నాగ వంశీ. మాస్ జాతరలో రవితేజ మార్క్ ఫన్ ఉంటుందని సినిమాలో మళ్లీ కిక్కు సినిమాను గుర్తు చేస్తుందని అన్నారు. రవితేజ కిక్ సినిమా సూపర్ హిట్ వైబ్ తెలిసిందే. మళ్లీ అలాంటి కిక్కే మాస్ జాతర ఇస్తుందని అంటున్నారు. మరి నిర్మాత ఇంత కాన్ ఫిడెంట్ గా చెబుతున్నారు అంటే కచ్చితంగా మాస్ మహారాజ్ ఫ్యాన్స్ కి మాస్ జాతర నిజంగానే హిట్టు జాతర ఇచ్చేలా ఉంది. రవితేజ కూడా ఆ మూమెంట్ కోసం వెయిట్ చేస్తున్నాడు. అసలైతే రవితేజ మాస్ జాతర సినిమా సంక్రాంతికే రావాల్సి ఉంది కానీ మధ్యలో రవితేజకు షోల్డర్ ఇంజ్యూరీ వల్ల సినిమా లేట్ అవుతూ వచ్చింది. మాస్ జాతర రిలీజ్ ఎప్పుడు అన్నది ఇంకా మేకర్స్ డిసైడ్ చేయలేదు.

## కన్నడ బ్యూటీకి మరో కేకపెట్టించే ఛాన్స్..

కన్నడ భామ శ్రద్ధ శ్రీనాథ్ ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్లతో అదరగొట్టేస్తుంది. కన్నడలో ఆల్రెడీ తన సత్తా చాటుతూ వస్తున్న శ్రద్ధా శ్రీనాథ్ తెలుగులో నానితో జెర్సీ సినిమా చేసింది. జెర్సీలో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఆ తర్వాత ఆది సాయి కుమార్ తో ఒక సినిమా చేసినా వర్క్ అవుట్ కాలేదు. లాస్ట్ ఇయర్ సైంధవ్ తో ఛాన్స్ అందుకున్న శ్రద్ధా శ్రీనాథ్ లేటెస్ట్ గా నందమూరి బాలకృష్ణతో డాకు మహారాజ్ ఛాన్స్ అందుకుంది. ఈమధ్యనే రిలీజైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. డాకు మహారాజ్ హిట్ తో శ్రద్ధా క్రేజ్ మరింత పెరిగింది. ఇక ఇప్పుడు అమ్మడికి మరో లక్కీ ఛాన్స్ వచ్చినట్టు తెలుస్తుంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో శ్రద్ధ కూడా ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. రజిని నెల్సన్ కలిసి చేసిన జైలర్



సినిమా సూపర్ హిట్ కాగా ఆ కాంబోలో ఆ సినిమా సీక్వెల్ గా జైలర్ 2 వస్తుంది. జైలర్ 2 సినిమాలో శ్రద్ధ శ్రీనాథ్ లక్కీ ఆఫర్ అందుకుంది. శ్రద్ధ శ్రీనాథ్ సినిమాలో ఇంపార్టెంట్ రోల్ కి ఎంపికైనట్టు తెలుస్తుంది. శ్రద్ధ శ్రీనాథ్ తో పాటు జైలర్ 2 లో తమన్నా కూడా నటిస్తున్నట్టు తెలుస్తుంది. సూపర్ స్టార్ రజినికి చాలా కాలం తర్వాత సూపర్ హిట్ సినిమాగా జైలర్ బాక్సాఫీస్ ని షేక్ చేసింది. ఐతే ఈ సినిమా సీక్వెల్ ని కూడా అంతకుమించి ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. ఈ సీక్వెల్ లో శ్రద్ధ పాత్ర ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని తెలుస్తుంది. కన్నడలో తన మార్క్ టాలెంట్ చూపిస్తూ వస్తున్న అమ్మడు ఇప్పుడిప్పుడే తెలుగులో బిజీ అవుతుంది. ఇక ఇప్పుడు తమిళ్ లో కూడా తన పంథా కొనసాగించాలని చూస్తుంది. టాలెంట్ ఉన్నా కూడా సరైన ఛాన్స్ లు రాని శ్రద్ధాకి తెలుగు, తమిళ్ లో మంచి అవకాశాలు వస్తున్నాయి. తప్పకుండా అమ్మడు రాబోయే సినిమాలతో అదరగొట్టేస్తుందని చెప్పొచ్చు. శ్రద్ధ శ్రీనాథ్ ఇక మీదట తన వరుస సినిమాలతో సౌత్ ఆడియన్స్ ని అలరించేలా క్రేజీ ప్రాజెక్ట్ లు చేస్తుందని చెప్పొచ్చు.

## వెండి తెరపై స్టార్ కిడ్స్ -కాక పుట్టించే కాంబినేషన్స్!

స్టార్ కిడ్స్ తెరపై కనిపిస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. అందులోనూ ఫేమస్ అయిన హీరోల, హీరోయిన్ల తనయులు జత కడితే తెర మరింత అందంగా మారుతుంది. బాలీవుడ్ ఈ విషయంలో ఎప్పుడూ నిత్య నూతనంగానే హైలైట్ అవుతుంది. తాజాగా మరికొన్ని క్రేజీ కాంబినేషన్స్ ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతున్నాయి. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే.. అజయ్ దేవగణ మేనల్లుడు అమన్ దేవగణ్– అందాల తార రవీనా టాండన్ ముద్దులు కూతురు రాషా తడానీ ఆజాద్ సినిమాతో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ చిత్రాన్ని జనవరి 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అతిలోక సుందరి శ్రీదేవి రెండవ కుమార్తె ఖుషీ కపూర్ కూడా ఇదే ఏడాది అలరించనుంది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్



ఖాన్ తో ‘లవ్యపా’లో నటిస్తోంది. అలాగే ఇబ్రహీం అలీఖాన్ కి జోడీగా ‘నాదా నీయన్’ లోనూ నటిస్తోంది. ఇదే ఏడాది ఈ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అలాగే బాలీవుడ్ లో ఉన్న మిగతా ఖాన్ లు..కపూర్ హీరోలకు జోడీగా నటించాలని అమ్మడు ఆశపడుతోంది. సీరియస్ గా ప్రయత్నాలు చేస్తోంది. యంగ్ హీరో సిద్దంత్ చతుర్వేదీ, కార్తీక్ ఆర్యన్ లతోనూ రొమాన్స్ చేయడానికి స్టార్ కిడ్స్ అంతా సిద్దంగా ఉన్నారు. వాళ్లతో నటించే ఛాన్స్ రావాలి గానీ సై అంటూ ముందుకు రావడానికి సిద్దం అంటు న్నారు. అలాగే యంగ్ హీరో లక్ష్య లక్వానీతో అనన్య పాండే ఓ సినిమాలో రొమాన్స్ చేస్తుంది. వామికా గబ్బి, త్రిప్తీ డిమ్రీ లాంటి సీనియర్ భామలు కూడా వారసుల చిత్రాల్లో నటించాలని ఆశపడుతున్నారు. 2025 లో ఈ క్రేజీ కాంబినేషన్స్ అన్ని ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. మరోవైపు నవ నాయికలైనా సీనియర్ హీరోలతో ఛాన్సులొస్తే నటించడానికి ఏమాత్రం ఆలోచించలేదు. ఛాన్స్ ఇవ్వాలేగానీ యస్ అంటూ ముందు కొస్తు న్నారు. అయితే ఇలాంటి నవ నాయికలు బాలీవుడ్ లో రష్మిక మందన్నా, కీర్తి సురేష్, సమంత లాంటి వారు బ్రేక్ వేస్తున్నారు. ఈ మధ్య కాలంలో సౌత్ భామలు హిందీలో ఫేమస్ అవ్వడంతో? అనుకున్న స్థాయిలో హిందీ నవ నాయికలకు అవకాశాలు రావడం లేదన్న వాదనా వినిపిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536